

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 324

శుక్రవారం 14-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

భారత్ వృద్ధికి ఢోకా లేదు!

ద్రవ్య, పరపతి, విధాన నిర్ణయాలు ఇందుకు దోహదపడతాయి: ఎస్‌అండ్‌పీ -బిజినెస్‌లో

వద్దన్న పాట

వాలెంటైన్స్ డే స్పెషల్ -ఫ్యామిలీలో

● చట్టసభ్యుల నేర చరిత్రను

ఆన్‌లైన్‌లో ఉంచండి

చట్టసభల్లో నేరచరితుల సంఖ్య పెరిగిపోతూ ఉండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్న వారిని ఎన్నికల్లో అభ్యర్థులుగా ఎందుకు నిర్ణయించారో వివరణ ఇవ్వడంతోపాటు ఆయా కేసుల జాబితాను రాజకీయ పక్షాలన్నీ తమ వెబ్ సైట్లలో ఉంచాలని స్పష్టం చేసింది.

- 5లో

● మెలానియా ఉత్సాహం

ఎదురుచూపులు

అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ ఈనెలాఖరున భారత్‌లో చేయబోయే పర్యటన కోసం తానెంతో ఉత్సుకతతో ఉన్నానని వెల్లడించారు. అహ్మదాబాద్, ఢిల్లీలో పర్యటన కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని, తమను ఆహ్వానిస్తున్న ప్రధాని మోదీకి ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

- 5లో

● చుక్‌చుక్ బండి

దుమ్ము రేపింది

ఐఆర్‌సీటీసీ... భారతీయ రైల్వేకు చెందిన ఈ కంపెనీ షేరు జోరైన లాభాలతో దూసుకుపోతోంది. గత ఏడాది అక్టోబర్‌లో స్టాక్ మార్కెట్లో అరంగేట్రం చేసిన ఈ షేర్... ఇన్వెస్టర్లకు కళ్లు చెదిరే లాభాలను పంచింది. నాలుగు నెలల్లోనే ఐదు రెట్లు పెరిగింది.

- బిజినెస్‌లో

● 'ఇన్ఫోసిస్' మూర్తి అల్లుడు

బ్రిటన్ ఆర్థిక మంత్రి

'ఇన్ఫోసిస్' నారాయణమూర్తి అల్లుడు, భారత సంతతి బ్రిటిష్ ఎంపీ రిషి సునక్ భారీ ప్రమోషన్ కొట్టేశారు. బ్రిటన్ కేబినెట్‌లో చోటుచేసుకున్న భారీ మార్పుల్లో భాగంగా ప్రధాని తర్వాత రెండో స్థానంగా భావించే కీలకమైన ఆర్థిక మంత్రి పోస్టు ఆయనకు దక్కింది.

- 5లో

గురువారం లక్ష్మీ బ్యారేజీ వద్ద గోదావరి జలాలకు నమస్కరిస్తున్న సీఎం కేసీఆర్

చుక్క నీరూ వృథా కావొద్దు

మేడిగడ్డ పరిశీలనలో ఇంజనీర్లతో సీఎం కేసీఆర్

- నీటిని తోడి పోసుకుంటూ రిజర్వాయర్లు నింపాలి..
- ప్రాజెక్టుల ద్వారా చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలి
- ఇంజనీర్లు వాకీటాకీ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి.. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో అధికారులతో కేసీఆర్
- ముక్తేశ్వరస్వామి ఆలయంలో పూజలు
- హెలికాప్టర్ నుంచి ఏరియల్ సర్వే

సాక్షి ప్రతినిధి, వరంగల్: 'ఎంతో కష్టపడి కట్టుకున్న ప్రాజెక్టుల్లోని నీటిని ఎప్పటికప్పుడు తోడి పోసుకుంటూ రిజర్వాయర్లను నింపుతూ.. గోదావరి జలాలు చుక్క కూడా వృథా పోకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీర్లదే.. ఎస్సారెస్పీ మొదలుకుని మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలు, రిజర్వాయర్లు, ఎత్తిపోతల పంపులు, కాల్వల ద్వారా చివరాఖరు ఆయకట్టు వరకు వ్యవసాయ భూములను తడిపేలా సునిశిత పర్యవేక్షణ చేయాలి'అని సీఎం కె.చంద్రశేఖర్‌రావు సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా సీఎం కేసీఆర్ గురువారం కరీంనగర్ నుంచి హెలికాప్టర్‌లో గురువారం కాళేశ్వరం చేరుకున్నారు.

నాణేలు వదిలి.. పుష్పాంజలి ఘటించి..: కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం సన్నిధిలోని గోదావరి ఘాట్‌కు చేరుకున్న కేసీఆర్.. గోదావరి, ప్రాణహిత సంగమ స్థలి, అంతర్వాహిని సరస్వతీ నదుల త్రివేణి సంగమ పుణ్య స్థలిని దర్శించుకున్నారు. కనుచూపు మేర జలనిధిగా మారిన మిగతా 2వ పేజీలో ▶

చంద్రబాబు కొండంత అవినీతిపై గోరంత వెలుగు

మచ్చుకు రూ.2,000 కోట్లు



టీడీపీ అధినేత పీఏపై ఐటీ దాడుల్లో బయటపడ్డ రూ.2 వేల కోట్ల బాగోతం

- హైదరాబాద్, విజయవాడ, కడప, విశాఖపట్నం, ఢిల్లీ, పుణేల్లో ఈ నెల 6 నుంచి 10 వరకు ఐటీ సోదాలు
- మూడు ప్రధాన కాంట్రాక్టు సంస్థలు.. బోగస్ సబ్ కాంట్రాక్టర్ల ద్వారా బోగస్ బిల్లుల రూపంలో తరలింపు
- ఆయా సంస్థల ఐటీ రిటర్నులన్నీ ఒకే కంప్యూటర్ నుంచే.. విదేశీ పెట్టుబడుల రూపంలో తరలింపు
- ఈ-మెయిల్స్, వాట్సాప్ మెసేజిలు, కీలక పత్రాలు స్వాధీనం
- 40 చోట్ల నిర్వహించిన సోదాల్లో 25 బ్యాంకు లాకర్లు సీజ్.. రూ. 85 లక్షల నగదు, రూ. 71 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.శ్రీనివాస్ వద్ద ఆధారాలు లభ్యం

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కమీషన్ల బాగోతాన్ని ఆదాయపు పన్ను శాఖ బట్టబయలు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కేంద్రంగా చేసుకుని మూడు ప్రధాన కాంట్రాక్టు సంస్థలు, బోగస్ సబ్ కాంట్రాక్టర్లు రాకెట్‌గా ఏర్పాటు చేసి.. భారీ నగదు కుంభకోణానికి పాల్పడ్డారంటూ ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ సురభి అహ్లూవాలియా గురువారం విడుదల చేసిన ప్రకటన సంచలనం రేపింది. అధికంగా బిల్లులు చెల్లించినట్లు చూపడం (ఓవర్ ఇన్‌వాయిసింగ్), బోగస్ బిల్లులు సృష్టించడం ద్వారా ఈ కుంభకోణానికి పాల్పడ్డారని వెల్లడించింది. ఇందుకు సంబంధించి తిరుగులేని ఆధారాలను సేకరించామని ఆ ప్రకటనలో ఐటీ శాఖ స్పష్టం చేసింది. ఈ అక్రమ లావాదేవీలకు మిగతా 2వ పేజీలో ▶

8,212 మందికి కరోనా స్క్రీనింగ్

- హైదరాబాద్ విమానాశ్రయంలో కొనసాగుతున్న థర్మల్ స్కానింగ్

- హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన కరోనా థర్మల్ స్కానింగ్ ద్వారా స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. గత నెల 30 నుంచి ఇప్పటి వరకు వివిధ దేశాల నుంచి వచ్చిన వారిలో 8,212 మందికి థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేసింది . - 13లో

వన్ పోలీస్.. వాట్సాప్!

- రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులకు ఒకే నంబర్..
- వాట్సాప్ బిజినెస్ అకౌంట్ వైపు మొగ్గు
- డీజీపీ కార్యాలయం కేంద్రంగా వ్యవస్థ నిర్వహణ - 14లో

... నా బాయ్‌ఫ్రెండ్‌తో మీరే పెళ్లి చేస్తారా లేక బయట భజరంగ్‌దళ్ వాళ్లతో పెళ్లి చేయించుకోమంటారా...!!

దేశంలో జాతీయ పార్టీలేవీ లేవు

టైమ్స్ నౌ యాక్షన్ ప్లాన్ సమ్మిట్‌లో మంత్రి కేటీఆర్

అవన్నీ పెద్ద సైజు ప్రాంతీయ పార్టీలే

పెద్ద నోట్ల రద్దుకు మద్దతు ఇవ్వడంపై చింతిస్తున్నాం

మంచి జరుగుతుందని అనుకున్నాం

కేంద్రం ఇచ్చేది రాష్ట్రాల నుంచి వచ్చిందేనని గమనించాలి

సాక్షి, న్యూఢిల్లీ

దేశంలో జాతీయ పార్టీలేవీ లేవని, అలా చెలామణిలో ఉన్నవన్నీ పెద్ద సైజు ప్రాంతీయ పార్టీలేనని తెలంగాణ పరిశ్రమలు, ఐటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన టైమ్స్ నౌ యాక్షన్ ప్లాన్-2020 సమ్మిట్‌లో పాల్గొన్నారు. 'దేశ నిర్మాణంలో రాష్ట్రాల పాత్ర'అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో మాట్లాడుతూ.. 'దేశంలో ఉన్న పార్టీలన్నీ ప్రాంతీయ పార్టీలే. దేశ వ్యాప్తంగా ఉనికి, యంత్రాంగం ఉన్న జాతీయ పార్టీలేవీ లేవు. బీజేపీ, కాంగ్రెస్ సైతం పెద్ద సైజు ప్రాంతీయ పార్టీలే. భారతదేశం రాష్ట్రాల సమాఖ్య మాత్రమే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. బలమైన రాష్ట్రాలు ఉన్నప్పుడే బలమైన దేశం సాధ్యమవుతుంది. కేంద్రం విధి విధానాలు ఎన్ని ఉన్నా వాటి ఆచరణ అంతా రాష్ట్రాల్లోనే ఉందని పేర్కొన్నారు. కేంద్రం నిర్వహించే కార్యక్రమాల అమలును సైతం రాష్ట్ర ప్రభుత్వాలే చేయాల్సి ఉంటుందని చెప్పారు. మేకిన్ ఇండియా లాంటి కార్యక్రమాల్లోనూ రాష్ట్రాల అనుమతులు, రాష్ట్ర ప్రభుత్వ శాఖల సహకారం మిగతా 4వ పేజీలో ▶

గురువారం ఢిల్లీలో జరిగిన టైమ్స్ నౌ సమ్మిట్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశం

'పౌరసత్వ సవరణ చట్టాన్ని మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. కేంద్రం ఇలాంటి వివాదాస్పద చట్టాలపై కాకుండా.. ప్రాధాన్యత గల ఇతర అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక.. అలాంటప్పుడు ఒక వర్గంపై ఎలా వివక్ష చూపుతారు?'అని ప్రశ్నించారు.

పీఆర్‌సీ గడువు మరోసారి పొడిగింపు?

- డిసెంబర్ 31 వరకు పొడిగించే అవకాశం
- ఈలోగా ఉద్యోగులకు ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవాలని నిర్ణయం
- ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ప్రత్యామ్నాయాలపై దృష్టి.. పీఆర్‌సీ అమలుకు ముందే డీఏను బేసిక్ పేలో కలిపి ఇవ్వాలని ప్రతిపాదన
- ఐఆర్ ఇవ్వడం కంటే ఇలా చేస్తే తక్కువ ఆర్థికభారం.. వచ్చే ఏప్రిల్ నుంచి అమలుకు యోచన

సాక్షి, హైదరాబాద్

వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ) గడువు మరోసారి పొడిగించే అవకాశం ఉంది. ఈ నెలలో గడువు ముగియనున్న నేపథ్యంలో డిసెంబర్ 31 వరకు పొడిగించాలని పీఆర్‌సీ కమిటీ ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిసింది. దీంతో ఆ దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. పీఆర్‌సీ వ్యవహారాలే కాకుండా రాష్ట్ర కార్యాలయాలు, జిల్లాల్లో వర్క్‌లోడ్, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు, ఉండాల్సిన సిబ్బంది సంఖ్య, ఉద్యోగులకు సంబంధించిన సర్వీసు నిబంధనలు తదితర అంశాలను తేల్చే బాధ్యతలను ప్రభుత్వం పీఆర్‌సీకి అప్పగించింది. అయితే ఇవన్నీ కసరత్తు చేసేందుకు మరింతగా సమయం అవసరం కావడంతో ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. దీంతో పీఆర్‌సీ అమలు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈలోగా ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చూసేందుకు మిగతా 4వ పేజీలో ▶

ఏబీవీ బినామీ భూ బాగోతం

- తెలంగాణలో భారీగా భూములు కొన్న ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్
- నారాయణపేట జిల్లాలోని రెండు గ్రామాల పరిధిలో 117.14 ఎకరాలు కొనుగోలు
- 11 మంది బినామీల పేరిట పట్టాలు చేయించిన వైనం
- రైతులతో సాగు చేయిస్తే విషయం బయటపడుతుందని యంత్రాల ద్వారా సాగు
- కృష్ణా నది నుంచి పొలాలకు అంతర్గత పైప్‌లైన్ నిర్మాణం
- రైతు బంధు కింద రూ. 9.23 లక్షల లబ్ధి

4 లో

అంచనాలకు మించి..

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో గణనీయంగా ఆదాయం

- తొలి మూడేళ్లు సగటున 85శాతం పైమాటే..
- ఆ తర్వాతి మూడేళ్లు అంచనాలకు మించి
- గతేడాది ఆదాయాన్ని మించిపోయే చాన్స్
- రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి ఏటేటా వృద్ధి నమోదు
- ఇప్పటివరకు రూ.23,910 కోట్లు ఆర్జించిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన ప్పటి నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా స్థిరమైన ఆదాయం లభిస్తోంది. తొలి నాళ్లలో కొంత ఒడిదొడుకులకు లోనైనా గత మూడేళ్లుగా రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు కాసుల పంట పండుతోంది. రాష్ట్రంలో స్థిరమైన అభివృద్ధి కొనసాగుతుండటం.. రియల్ రంగం కూడా ఊపందుకోవడంతో రిజిస్ట్రేషన్ల పంట పండుతోందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆర్థిక మాంద్యం ప్రభావం దేశ వ్యాప్తంగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది. ఈ ఏడాది బడ్జెట్ అంచనాల ప్రకారం 2020 మార్చి చివరి నాటికి రూ.6,146 కోట్లు ఆదాయం రావాల్సి ఉండగా, మరో 2 నెలలు మిగిలి ఉండగానే 2020 జనవరి నాటికే మిగతా 4వ పేజీలో ▶



'మార్కండేయ' సమగ్ర సర్వేకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం జలాలపై ఆధారపడి చేపట్టిన కల్వకుర్తి ఎత్తిపోతల నీటిని వినియోగించుకుంటే మరో ఎత్తిపోతల పథకం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కల్వకుర్తి ప్రధాన కాలువ పరిధిలోని ప్యాకేజీ-29 నుంచి అర టీఎంసీ నీటిని తీసుకుంటూ 5,300 ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేలా మార్కండేయ ఎత్తిపోతల ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మార్కండేయ ఎత్తిపోతల పథకం సమగ్ర సర్వే, ప్రాజెక్టు నివేదికల తయారీకి పరిపాలనా అనుమతిస్తూ గురువారం నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రాజెక్టు సమగ్ర సర్వేకు రూ.49 లక్షల మేర ఖర్చు కానుంది.

కేకే ఓటు హక్కుపై ట్రిబ్యునల్‌కెళ్లండి

పిటిషనర్‌కు హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: తుక్కుగూడ మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఓటు హక్కును ఉపయోగించుకునేందుకు రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావును ఎన్నికల అధికారి అనుమతించిన వ్యవహారాన్ని ఎన్నికల ట్రిబ్యునల్‌లోనే తేల్చుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత వాటికి సంబంధించి ఏ అభ్యంతరాలున్నా, వాటిపై ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని రాజ్యాంగం, తెలంగాణ మునిసిపాలిటీల చట్ట నిబంధనలు చెబుతున్నాయని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ పి.కేశవరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కేశవరావును ఓటు హక్కు వినియోగించుకోవడానికి అనుమతించడాన్ని సవాలు చేస్తూ బీజేపీ తరపున ఎన్నికైన మోనిరాజు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై గురువారం న్యాయమూర్తి జస్టిస్ పి.కేశవరావు మరోసారి విచారణ జరిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపించారు. ఎన్నికలు ముగిశాక వచ్చిన అభ్యంతరాల విచారణకే ట్రిబ్యునళ్లు ఏర్పాటయ్యాయని తెలిపారు. జిల్లా జడ్జి స్థాయి అధికారి దీనికి నేతృత్వం వహిస్తారన్నారు. తరువాత పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది సురేందర్‌రావు వాదిస్తూ, ఈ వివాదం ఎన్నికల పిటిషన్ పరిధిలోకి రాదని, అందువల్ల ట్రిబ్యునల్ వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. నేరుగా అధికరణ 226 కింద హైకోర్టు విచారణ జరపవచ్చునని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, ఈ వివాదంపై ఎన్నికల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలంటూ ఉత్తర్వులిచ్చారు.

'అపెక్స్' భేటీకి కేంద్రం సన్నాహాలు

సాక్షి, హైదరాబాద్: కృష్ణా, గోదావరి నదీ బేసిన్‌ల పరిధిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అపరిష్కృత సమస్యల పరిష్కారానికి వీలుగా అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్ర జలశక్తి శాఖ సన్నాహాలు చేస్తోంది.గత జనవరిలో జలశక్తి శాఖ కార్యదర్శి స్థాయిలో జరిపిన చర్చల్లో అనేక అంశాలపై పీటముడి నెలకొన్న నేపథ్యంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి చైర్మన్‌గా ఇరు రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా ఉండే అపెక్స్ భేటీలోనే వాటన్నింటికీ పరిష్కారం వెతకాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో అపెక్స్ భేటీలో చర్చించాల్సిన అంశాల ఎజెండా తీసుకోవాలన్న కేంద్రం సూచనల మేరకు కృష్ణాబోర్డు ఇరు రాష్ట్రాలకు లేఖలు రాసింది. అపెక్స్ భేటీ అజెండా వివరాలను తమకు సమర్పించాలని కోరింది.

సస్పెన్షన్‌పై క్యాట్‌కు ఏబీ వెంకటేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం తనను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. తన సస్పెన్షన్ జీవో ఏకపక్షమే కాక, రాజ్యాంగ, చట్ట విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రాథమిక విచారణ చేపట్టకుండానే ప్రభుత్వం తనను సస్పెండ్ చేసిందన్నారు. అలాగే వివరణ ఇచ్చే అవకాశం కూడా ఇవ్వలేదన్నారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయాలని ఆయన ట్రిబ్యునల్‌ను అభ్యర్థించారు.



గురువారం లక్ష్మీ బ్యారేజ్ వద్ద ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఈటల, సీఎస్ సోమేశ్, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ తదితరులు

సాగునీటి ఇంజనీరింగ్ విభాగాలన్నీ

ఒకే గొడుగు కిందకు

- 11 సర్కిళ్లుగా సాగునీటి ఇంజనీరింగ్ వ్యవస్థ విభజన
- 530 టీఎంసీల గోదావరి జలాల నిర్వహణ లక్ష్యం
- బ్యారేజీల ఆపరేషన్ రూల్స్ కార్యాచరణ సిద్ధం చేయాలి
- మే 15లోగా కరీంనగర్‌లో 161 చెక్ డ్యాంలు నిర్మించాలి
- జూన్‌లోగా ఇరిగేషన్ విభాగంలో ఖాళీల భర్తీ
- ఉన్నతాధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సాగునీటి రంగంలోని ఇంజనీరింగ్ విభాగాలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని సీఎం కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు అనుబంధంగా ఉన్న సాగునీటి ఇంజనీరింగ్ విభాగాలను పునర్ వ్యవస్థీకరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను ఆదేశించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా, సాగునీటి లక్ష్యాల సాధనకు సాగునీటి ఇంజనీరింగ్ విభాగాల పునర్ వ్యవస్థీకరణ ఆవశ్యకమని స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఏటా 530 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తి పోసేందుకు ఇంజనీరింగ్ అధికారులు సన్నద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. మేలో రాష్ట్రంలోని అన్ని సాగునీటి కాల్వలకు అవసరమైన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. సాగునీటికి సంబంధించిన అన్ని ఇంజనీరింగ్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తేవాలని సూచించారు. సాగునీటి ఇంజనీరింగ్ వ్యవస్థను 11 సర్కిళ్లుగా విభజించనున్నట్లు చెప్పారు. సర్కిల్ అధిపతిగా చీఫ్ ఇంజనీర్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో సాగునీటికి సంబంధించి ఏ అంశంపై అయినా సంబంధిత చీఫ్ ఇంజనీర్ బాధ్యత వహిస్తారని తెలిపారు.

జూన్‌లోగా ఇరిగేషన్ విభాగంలో ఖాళీల భర్తీ

జూన్‌లోగా ఇరిగేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఖాళీలు భర్తీ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆపరేషన్ మెయింటెనెన్స్ ప్రభావవంతంగా చేపట్టేందుకు వీలుగా ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి సంబంధిత ప్రాజెక్టుల వద్ద కనీస వసతి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని క్వార్టర్స్, ఇతర అవసరాల కోసం రూ.120 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ఈ పనులు వెంటనే ప్రారంభించి ఏప్రిల్‌లోగా ఇరిగేషన్ అధికారులు, సిబ్బందికి క్వార్టర్స్ నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు.

530 టీఎంసీల గోదావరి జలాల ఎత్తిపోత లక్ష్యంగా..

గోదావరి జలాలను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 530 టీఎంసీల మేర ఎత్తి పోసేందుకు అధికారులు అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం, ఎల్లంపల్లి రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీటిని ఏప్రిల్ 10లోగా ఖాళీ చేయాలన్నారు. తద్వారా వర్షాకాలంలో మరింతగా గోదావరి జలాలను ఒడిసి పట్టే ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల నుంచి క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మధ్య సమాచారం చేరేందుకు వీలుగా వైర్‌లెస్‌సెట్లు కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల ఆపరేషన్ రూల్స్ కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. గోదావరి ప్రధాన ఉపనది అయిన ప్రాణహితలో వాస్తవ నీటి పరిమాణాన్ని తెలుసుకునేందుకు వీలుగా కాళేశ్వరం నుంచి తమ్మిడిహెట్టి వరకు 5 నుంచి 6 చోట్ల గేజ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

భగీరథ నల్లాలు విరగ్గొడితే జరిమానా

ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టిందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ పథకం ద్వారా 56 లక్షల కనెక్షన్లు ఇచ్చినట్లు వివరించారు. కొన్ని గ్రామాల్లో ఉద్దేశపూర్వకంగా కొందరు వ్యక్తులు నల్లాలను విరగ్గొడుతున్నారన్న ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి ముందుగా నోటీసులు జారీ చేయాలన్నారు. అప్పటికీ వినకపోతే రూ.5 వేల జరిమానా విధించాలని సీఎం సూచించారు.

చెరువులన్నీ నింపాలి

రాష్ట్రంలోని అన్ని చెరువులను నింపేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి కాలువలకు మే ఆఖరులోగా అవసరమైన అన్ని మరమ్మతులు చేపట్టాలన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే మంజూరు చేసిన 161 చెక్ డ్యాంల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఇరిగేషన్ అధికారులను సీఎం ఆదేశించారు. మే 15లోగా చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు మరిన్ని చెక్ డ్యాంలు కావాలని కోరుతున్నందున ఆ దిశగా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

పనిచేయని ఏజెన్సీలపై ఉక్కుపాదం

ప్రభుత్వ నిర్దేశిత రేటుకు అతి తక్కువగా కోట్ చేస్తూ పనులు దక్కించుకున్న ఏజెన్సీలు సకాలంలో పనులు పూర్తి చేయట్లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. తద్వారా ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరట్లేదని, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అలాంటివి గుర్తించి ఆయా ఏజెన్సీలను పనుల నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. భవిష్యత్తులో కూడా తిరిగి పనులు అప్పగించకుండా చూడాలన్నారు.

కరీంనగర్, నిజామాబాద్‌కు కొత్త కలెక్టరేట్‌లు

కరీంనగర్‌తో పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో కొత్త కలెక్టరేట్ల నిర్మాణానికి సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ల స్థానంలో కొత్త కలెక్టరేట్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ కె.విజయ, ఎమ్మెల్యేలు రవిశంకర్, రసమయి బాలకిషన్, కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈద శంకర్ రెడ్డి, కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ వై.సునీల్‌రావు, ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి రజత్ కుమార్, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, కరీంనగర్ కలెక్టర్ శశాంక, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్, అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, నగర మున్సిపల్ కమిషనర్ వి.క్రాంతి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

కాళేశ్వరంలోని ముక్తేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సీఎం కేసీఆర్

గోదావరికి చీర, సారె సమర్పిస్తున్న సీఎం కేసీఆర్, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తదితరులు

చిన్ననాటి స్నేహితుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం కేసీఆర్

చిన్ననాటి సహచరుడితో

మాటాముచ్చట

పలుకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న సీఎం కేసీఆర్

కరీంనగర్: కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు తీగలగుట్టపల్లి ఉత్తర తెలంగాణ భవన్ నుంచి వెళ్తుండగా.. గురువారం ఉదయం తనను కలిసేందుకు వచ్చిన తన చిన్ననాటి స్నేహితుడిని సీఎం కేసీఆర్.. చిరునవ్వుతో పలకరించారు. ఆప్యాయతతో అక్కున చేర్చుకొని కుశల ప్రశ్నలు వేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామానికి చెందిన ఆ చిన్ననాటి స్నేహితుడి పేరు సంపత్‌కుమార్. తనింట్లో జరిగే శుభకార్యానికి రావాలని ఆహ్వానిస్తూ సంపత్ పత్రిక అందజేశారు. సంపత్‌ను అక్కడున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు కేసీఆర్ పరిచయం చేశారు. హైదరాబాద్‌లో ఒకే గదిలో కలసి ఉన్నప్పటి.. జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కాగా, కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగే సమావేశానికి వెళ్తున్న కేసీఆర్‌కు ముద్దులొలికే ఓ చిన్నారి ఎదురుపడటంతో ఆమెను ఎత్తుకొని కొద్దిసేపు ముద్దు చేశారు.

చిన్నారిని ఎత్తుకున్న కేసీఆర్

చుక్క నీరూ వృథా కావొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాణహిత గోదారి గంగ పవిత్ర జలాలను తలపై చల్లుకుని నాణెలు వదిలి పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత గోదావరి ఘాట్ నుంచి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం చేరుకుని పూజలు చేశారు. దర్శనం అనంతరం లక్ష్మి (మేడిగడ్డ) బ్యారేజ్ వద్దకు చేరుకునే క్రమంలో లక్ష్మీ బ్యారేజ్ వద్ద నిండు కుండను తలపిస్తున్న ప్రాణహిత నదీ జలాలను ఏరియల్ సర్వే ద్వారా వీక్షించారు. అనంతరం లక్ష్మీ బ్యారేజ్ వద్దకు చేరుకున్న సీఎం కేసీఆర్.. బ్యారేజ్ మీద నుంచి నదీ జలాల్లో నాణాలు వదిలి, ఉద్యమ కాలం నాటి మొక్కు చెల్లించుకున్నారు.

సాగునీటి సద్వినియోగంపై అధికారులకు క్లాస్

మేడిగడ్డ వ్యూ పాయింట్ వద్ద ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే వర్షాకాలం వరద నీరు ఉధృతంగా చేరుతుందని, ఈ నేపథ్యంలో లక్ష్మి బ్యారేజ్ నుంచి ఎప్పటికప్పుడు నీటిని తోడుకోవాలని, అందుకు సంబంధించిన వ్యవస్థను సిద్ధం చేసుకోవాలని ఈఎన్‌సీలు మురళీధర్‌రావు, వెంకటేశ్వర్లు, ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే సహా పలువురు ఇంజనీర్లు, ఉన్నతాధికారులకు సూచనలు చేశారు. 'ప్రాజెక్టుల నిర్మాణం, నీటి సరఫరా విషయంలో ఎక్కడికక్కడ పని విభజన చేసుకుని పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ వ్యవస్థను పటిష్ట పరుచుకోవాలి. అవసరమైతే పోలీసుల మాదిరి వైర్‌లెస్, వాకీటాకీ వ్యవస్థ ఏర్పాటు చేసుకుని పని చేయాలి. సమాచారాన్ని ప్రతి క్షణం చేరవేసుకుంటూ ఎప్పుడు ఏ మోటార్ నడుస్తోంది.. ఏ పంపు పోస్తోంది.. ఎంత నీరు ఎత్తిపోయాలి.. ఎప్పుడు ఆపాలే.. ఎప్పుడు నీటిని కిందికి వదలాలే వంటి పలు విధాలైన నీటి పంపిణీ సాంకేతిక అంశాలపై కాళేశ్వరం టీం మొత్తానికి అవగాహన ఉండాలి'అని కేసీఆర్ తెలిపారు. సమన్వయంతో పనిచేస్తేనే గోదావరి జలాలను నూరు శాతం సద్వినియోగపర్చుకోవడం సాధ్యమవుతుందని సీఎం పేర్కొన్నారు. అందుకు సంబంధించి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పిన సీఎం.. మేడిగడ్డ వద్ద మధ్యాహ్నం భోజనానంతరం కరీంనగర్ బయల్దేరారు.

ముక్తేశ్వర స్వామికి పూజలు..

లక్ష్మీ బ్యారేజీ సందర్శన కంటే ముందు.. కాళేశ్వర క్షేత్రాన్ని సీఎం కేసీఆర్ సందర్శించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ముక్తేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. తొలుత ఆలయానికి చేరుకున్న సీఎం కేసీఆర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతకు ముందు పుష్కరఘాట్‌లో గోదావరిమాతకు సీఎం కేసీఆర్ పూజలు చేశారు. గోదావరిలో నాణేలు వదిలిన కేసీఆర్.. చీర, సారె సమర్పించారు. సీఎం కేసీఆర్ వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్, ఎమ్మెల్యేలు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గండ్ర వెంకటరమణా రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, ఐజీ నాగిరెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అజీం, ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్, ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ మురళీధర్ రావు, కాళేశ్వరం ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు గండ్ర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించి అనేక పత్రాలతోపాటు ఈ-మెయిళ్లు, వాట్సప్ మెసేజీలను సేకరించింది. విదేశీ అక్రమ లావాదేవీలకు సంబంధించిన పత్రాలను గుర్తించింది. 3 కాంట్రాక్టు సంస్థల నుంచి బోగస్ సబ్ కాంట్రాక్టు సంస్థల ద్వారా రూ.2 వేల కోట్లకుపైగా నగదును అక్రమంగా తరలించినట్లు తేల్చింది.

తప్పుడు చిరునామాలు.. షెల్ కంపెనీలు

చిన్న చిన్న సబ్ కాంట్రాక్టు సంస్థలను సృష్టించారని, వాటి రిజిస్ట్రేషన్‌లో చూపిన చిరునామాలో ఆ సంస్థలు లేకపోగా.. షెల్ కంపెనీలు ఉన్నట్లుగా ఐటీ శాఖ గుర్తించింది. ఈ బోగస్ సబ్ కాంట్రాక్టు సంస్థలు దాఖలు చేసిన ఆదాయపు పన్ను రిటర్న్‌లు.. మూడు ప్రధాన కాంట్రాక్టు సంస్థలు దాఖలు చేసిన ఆదాయపు పన్ను రిటర్న్‌లు ఒకే ఐపీ అడ్రస్ (కంప్యూటర్) నుంచి దాఖలు చేసినట్లుగా తేల్చింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రూపంలో ఒక ప్రధాన కాంట్రాక్టు సంస్థకు వచ్చిన మొత్తాన్ని బోగస్ కాంట్రాక్టు సంస్థలకు మళ్లించినట్లు గుర్తించింది. వీటికి సంబంధించి ముఖ్యుడి (చంద్రబాబు)కిసుదీర్ఘకాలంవ్యక్తిగతసహాయకుడు (పీఎస్)గా వ్యవహరించిన పెండ్యాల శ్రీనివాస్ నుంచి కీలకమైన ఆధారాలను సేకరించినట్లుగా ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ సురభి అహ్లూవాలియా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు మూడు ప్రముఖ కాంట్రాక్టు సంస్థలు.. బోగస్ సబ్ కాంట్రాక్టు సంస్థలపై హైదరాబాద్, విజయవాడ, కడప, ఢిల్లీ, పూణేలలో 40 చోట్ల ఐటీ అధికారులు సోదాలు జరిపిన విషయం విదితమే. ఈ సోదాల్లో లెక్క చూపని నగదు రూ.85 లక్షలు.. రూ.71 లక్షల విలువైన ఆభరణాలతోపాటు 25 బ్యాంక్ లాకర్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

కమీషన్లే పరమావధి

2014 జూన్ 8న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి 2019 మే 29 వరకు అక్రమార్జనే ధ్యేయంగా వ్యవహరించారు. పనుల అంచనా వ్యయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచేయడం, కాంట్రాక్టు సంస్థలతో బేరసారాలు జరపడం.. ఎక్కువ మొత్తంలో కమీషన్‌లు ఇచ్చిన సంస్థకే పనులు దక్కేలా నిబంధనలతో టెండర్లు నిర్వహించడం.. అనుకున్న మేరకే అధిక ధరలకు ఆ సంస్థకు పనులు అప్పగించి కమీషన్‌లు వసూలు చేసుకోవడాన్ని చంద్రబాబు వ్యాపకంగా చేసుకున్నారు. ముంబై కేంద్రంగా పని చేసే ఒక బడా కాంట్రాక్టు సంస్థ కార్యాలయంలో ఐటీ శాఖ నిర్వహించిన సోదాల్లో రూ.150 కోట్లకుపైగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యుడికి అక్రమంగా చేరినట్లు ఐటీ శాఖ ఇటీవల ప్రకటించింది. ఆ సంస్థలో నిర్వహించిన సోదాల్లో లభ్యమైన ఒక ఆధారంతో చంద్రబాబుకు సన్నిహితులైన కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రా, ఆర్వీఆర్ ఇన్‌ఫ్రా, లోకేష్ బినామీ నరేన్ చౌదరికి చెందిన డీఎన్‌సీ ఇన్‌ఫ్రా కార్యాలయాలపై ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకూ ఐటీ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో చంద్రబాబు కమీషన్ల బాగోతం బట్టబయలైంది. కాంట్రాక్టు సంస్థల నుంచి కమీషన్ల రూపంలో చంద్రబాబు కొల్లగొట్టిన వేలాది కోట్ల రూపాయల నల్లధనాన్ని విదేశాలకు తరలించి.. అక్కడి నుంచి తనకు చెందిన సంస్థల్లోకి వచ్చేలా చేశారు.

కమీషన్ల వసూలులో చాణక్యం

కాంట్రాక్టు సంస్థల నుంచి కమీషన్ల వసూలులో చంద్రబాబు తనదైన శైలిలో చాణక్యాన్ని ప్రదర్శించారు. కాంట్రాక్టులు దక్కించుకున్న సంస్థల వద్ద సబ్ కాంట్రాక్టు పనులు చేస్తున్నట్లు బోగస్ సంస్థలను సృష్టించారు. ఆ సంస్థలు పనులు చేయకున్నా, చేసినట్లు చూపి.. బిల్లులు చేసుకున్నారు. ఈ అక్రమాల నుంచి ఐటీ, ఈడీ వంటి సంస్థల కన్నుగప్పేందుకు బోగస్ సబ్ కాంట్రాక్టు సంస్థల వార్షిక టర్నోవర్ రూ.2 కోట్లకు మించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీని వల్ల ఇన్‌కమ్ ట్యాక్స్ ఆడిటింగ్ చేయాల్సిన అవసరం ఉండదు. పుస్తకాలను నిర్వహించాల్సిన అవసరం కూడా ఉండదు. ఇలా కేవలం మూడు ప్రధాన కాంట్రాక్టు సంస్థల నుంచి బోగస్ సబ్ కాంట్రాక్టు సంస్థల ద్వారా రూ.2,000 కోట్లను చంద్రబాబు కొల్లగొట్టినట్లు ఐటీ శాఖ దర్యాప్తులో వెల్లడైంది.

ఆ డైరీల్లో పూసగుచ్చినట్లు..

రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)లో పని చేస్తున్న పెండ్యాల శ్రీనివాస్.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ అధికారంలో ఉన్నప్పుడూ రెండు దశాబ్దాల పాటు చంద్రబాబుకు వ్యక్తిగత సహాయకుడి(పీఎస్)గా వ్యవహరించారు. చంద్రబాబుకు సంబంధించిన లావా దేవీలన్నీ శ్రీనివాసే నిర్వహించే వారని టీడీపీ వర్గాలు బాహాటంగా చెబుతున్నాయి. శ్రీనివాస్ నివాసాల్లో ఐటీ శాఖ నిర్వహించిన సోదాల్లో ఆయన డైరీలను స్వాధీనం చేసు కుంది. చంద్రబాబుకు ఏ ఏ కాంట్రాక్టు సంస్థల నుంచి ఏ తేదీన ఎంత మొత్తంలో ఏ ఏ సబ్ కాంట్రాక్టర్ల పేర్లతో కమీషన్‌ల రూపంలో వసూలు చేసిందీ.. వాటిని ఏ ఏ సంస్థలకు మళ్లించిందీ.. నల్లధనాన్ని ఎలా విదేశాలకు మళ్లించిందీ.. చంద్రబాబు కుటుంబ సంస్థలకు నగదు రూపంలో వచ్చిన వివరాలు.. చంద్రబాబు, లోకేష్‌లకు నగదు రూపంలో ఇచ్చిన వివరాలు ఆ డైరీల్లో శ్రీనివాస్ స్పష్టంగా పేర్కొన్నారు. వాటి ఆధారం గా ఐటీ శాఖ అధికారులు లోతుగా దర్యాప్తు చేయడంతో రూ.రెండు వేల కోట్ల నల్లధనం కుంభకోణం బయటపడింది.

రెండో రోజు మేడారం ఆదాయం రూ. 1.91 కోట్లు

హన్మకొండ కల్చరల్: మేడారం జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు కొనసాగుతోంది. హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండలంలో లెక్కింపు చేపట్టగా రెండో రోజైన గురువారం రూ.1,91,26,000 ఆదాయం నమోదైంది. ఈ మేరకు నగదును ఆంధ్రా బ్యాంక్‌లో డిపాజిట్ చేశామని ఈఓ రాజేందర్ తెలిపారు. సమ్మక్క గద్దె వద్ద ఉన్న 65 హుండీల్లోని నగదును రెండో రోజు లెక్కించారు. కాగా, రెండు రోజుల ఆదాయం రూ.2,92,76,000గా నమోదైంది. ఇక ఆభరణాలు, విదేశీ కరెన్సీని చివరలో లెక్కించనున్నారు.

ముల్కనూరులోని సహకార పరపతి సంఘం ఎదుట విదేశీ ప్రతినిధులు

గంగదేవిపల్లి, ముల్కనూరులో 16 దేశాల ప్రతినిధులు

గీసుకొండ: వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లితో పాటు వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని సహకార పరపతి సంఘాన్ని 16 దేశాల ప్రతినిధులు గురువారం సందర్శించారు. అంతర్జాతీయ మహిళా శిక్షణ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన వీరు శిక్షణ పొందుతున్నారు. ఇప్పటికే బాల వికాస ఆధ్వర్యాన పలు అంశాలపై అవగాహన పెంపొందించుకున్న ఆయా దేశాలకు చెందిన 26 మంది ప్రతినిధులు గురువారం గంగదేవిపల్లి, ముల్కనూరును సందర్శించారు. ఈ మేరకు గంగదేవిపల్లిలో అభివృద్ధి తీరుతెన్నులపై పరిశీలించడంతో పాటు ముల్కనూరు సహకార పరపతి సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్, సూపర్ బజార్, పారాబాయిల్డ్ రైస్ మిల్, కాటన్ జిన్నింగ్ మిల్లు వివరాలు తెలుసుకున్నారు.

సదానందను విచారించిన ఎస్సీ శ్వేత

హుస్నాబాద్: రిమాండ్ నుంచి వారం రోజుల పాటు కస్టడీలోకి తీసుకున్న సదానందంను గురువారం సిద్దిపేట ఇన్‌చార్జి (కామారెడ్డి ఎస్సీ) శ్వేత హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారించినట్లు సమాచారం. కస్టడీకి తీసుకున్న సదానందంను సిద్దిపేట నుంచి మధ్యాహ్నం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కన్నపేటలో కాల్పులు జరిపిన అనంతరం సదానందం తలదాచుకున్న బొడిగెపల్లెతో పాటు ఎక్కడెక్కడ తిరిగాడో మరోసారి ఆ ప్రాంతాలకు వెళ్లి విచారించినట్లు తెలిసింది. కాల్పుల ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపడంతో తుపాకులను సదానందం పోలీస్ స్టేషన్ నుంచి ఎలా అపహరించాడు? ఎవరైనా సహకరించారా అనే విషయాలను కూపీలాగుతున్నట్లు తెలుస్తోంది. తుపాకులు మాయమైన సమయంలో స్టేషన్‌లో సీసీ కెమెరాలున్నాయా? లేదా? ఉంటే అవి ఎందుకు పనిచేయలేదనే విషయాన్ని ఆరా తీస్తున్నట్లు తెలిసింది. వారం రోజుల్లో ఈ విషయంపై ఓ స్పష్టత రానుంది.

అడవి ఆముదం గింజలు తిని..

19 మంది విద్యార్థులకు అస్వస్థత ముగ్గురి పరిస్థితి విషమం

తాంసి(బోథ్): అడవి ఆముదం చెట్టు గింజలు తిని 19 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం తాంసి(కె) ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశాక విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఉన్న అడవి ఆముదం చెట్టు గింజలను తిన్నారు. తరగతి గదులకు వెళ్లాక ఒక్కొక్కరు వాంతులు చేసుకోవడంతో ఉపాధ్యాయులు ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కార్తీక, ప్రశాంత, సాయికృష్ణ విద్యార్థుల పరిస్థితి కొంత విషమంగా ఉందని రిమ్స్ డైరెక్టర్ బలరాం రాథోడ్ తెలిపారు. కాగా ఘటనకు గల కారణాలను డీఈవో రవీందర్ రెడ్డి కూడా ఆరా తీశారు.

లైంగిక దాడి కేసులో నిందితుల అరెస్టు

కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

జహీరాబాద్: మహిళపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ గణపత్ జాదవ్ తెలిపారు. గురువారం కేసు వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 11న సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలో ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితులైన ఒంగోలు జిల్లా కొమురోలు మండలం ఎడమాకుల గ్రామానికి చెందిన బండి పవన్‌కుమార్ (29), కాజీపేట పట్టణం దర్గా ఫాతిమానగర్‌కు చెందిన బ్రహ్మచారి (38)లను అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరుపర్చారు. పవన్‌కుమార్ ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. అలాగే ఉప్పల్‌లో సిర్థపడిన ఖాజీపేటకు చెందిన బ్రహ్మచారిపై పలు కేసులు ఉన్నాయి. గతంలో ఓ కేసులో ఐదేళ్లు జైలు శిక్ష అనుభవించాడు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న సోమాచారి (45) బుధవారం రాయికోడ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కేసులో ఎ-1 నిందితుడు పవన్‌కుమార్‌ను గంగ్వార్ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకోగా విషయాన్ని గమనించి తమ వెంట తెచ్చుకున్న కారులో బ్రహ్మచారి, సోమచారిలు రాయికోడ్ వైపు పరారయ్యారు. కారును వేగంగా నడపడంతో బోల్తాపడి సోమాచారి అక్కడికక్కడే మరణించగా బ్రహ్మచారి గాయపడ్డాడు. దీంతో బ్రహ్మచారికి ఆస్పత్రిలో చికిత్స అందించి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.

యురేనియం గరళం!

'అణు ఇంధన శాఖ పరిధిలోని ఏఎండీ (ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్) లంబాపూర్-పెద్దగట్టు ప్రాంతంలోని 25 బోరుబావులు, చేతిపంపుల నుంచి సేకరించిన నీటిలో యురేనియం ఉన్నట్లు గుర్తించింది. ఏఈఆర్‌బీ (ఆటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు) విధించిన పరిమితి 60 పీపీబీ (పార్ట్ పర్ బిలియన్)కి లోబడి కొన్ని నమూనాల్లో, పరిమితికి మించి ఎంతో ఎక్కువ స్థాయిలో ఉన్నట్లు గుర్తించింది. సేకరించిన నీటి నమూనాల్లో 1పీపీబీ నుంచి 2,618 పీపీబీ వరకు యురేనియం ఉన్నట్లు తేలింది.'

- లోక్‌సభలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి రత్తన్ లాల్ కటారియా

నల్లగొండ నీటిలో మోతాదుకు మించి ఉన్నట్లు గుర్తింపు

- తాగు, సాగు నీటిలోనూ ఆనవాళ్లు
- లంబాపూర్-పెద్దగట్టు చుట్టుపక్కల 21 బోరుబావులు, నాలుగు చేతి పంపుల నుంచి నీటి నమూనాలు సేకరణ
- చేతిపంపుల నీటిలో 1 పీపీబీ నుంచి 48 పీపీబీ వరకు యురేనియం
- తాగడానికి పనికిరావని తేల్చిన పరిశోధకులు
- ఆందోళన చెందుతున్న రైతులు, గిరిజనులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ జిల్లా భూగర్భంలో ఫ్లోరైడే కాదు.. ఇప్పుడు మరో కొత్త గరళం యురేనియం కూడా ఉందని తేలింది. ఏడు దశాబ్దాలుగా ఫ్లోరైడ్ సమస్యతో సతమతమవుతున్న జిల్లా ప్రజలకు ఇప్పటికీ శాశ్వత పరిష్కారం దొరకలేదు. మరోవైపు యురేనియం నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయని గుర్తించిన దేవరకొండ నియోజకవర్గం పెద్ద అడిశర్లపల్లి పరిధిలోని పెద్దగట్టు-లంబాపూర్ ప్రాంతంలోని నీటిలో యురేనియం ఆనవాళ్లు ప్రమాదరకర స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడ యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించిన కేంద్రం.. ప్రాజెక్టును (మైనింగ్) ఏర్పాటు చేయకున్నా ఈ ప్రాంతం నుంచి నిత్యం నీటి నమూనాలు సేకరించి పరిశోధనలు చేస్తూనే ఉంది. ఇప్పుడు ఆ పరిశోధనల ఫలితాలు వెలుగులోకి వచ్చాయి. ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి పార్లమెంటు సమావేశాల్లో అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి రత్తన్‌లాల్ కటారియా సమాధానం ఇచ్చారు. ఆయన సమాధానంతో యురేనియం నిక్షేపాలు ఉన్న లంబాపూర్, పెద్దగట్టు ప్రాంతంలోని తాగు, సాగు నీటిలో యురేనియం ఆనవాళ్లు ఉన్నాయని స్పష్టమైంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ఇదీ.. కథ!

దేవరకొండ నియోజకవర్గం పెద్ద అడిశర్లపల్లి (పీఏ పల్లి) మండలంలోని లంబాపూర్, నామాపురం, ఎల్లాపురం, పులిచర్ల, పెద్దగట్టు తదితర ప్రాంతాల్లో 11.02 మిలియన్ టన్నుల యురేనియం నిక్షేపాలు 1,326 ఎకరాల్లో విస్తరించి ఉన్నట్లు గుర్తించారు. ఒక ఓపెన్ కాస్ట్ గనితో పాటు, మరో మూడు భూగర్భ గనుల్లో యురేనియం తవ్వకాలు చేపట్టాలని నిర్ణయించి, 2003 వరకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఏ) రూపొందించారు. ఈ గనులకు అనుబంధంగా మల్లాపూర్‌లో ట్రీట్‌మెంట్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదన. అయితే అన్ని వర్గాల నుంచి వచ్చిన వ్యతిరేకతతో యూసీఐఎల్ అధికారులు వెనక్కి తగ్గారు. వాస్తవానికి ఈ గనులకు 1,301.35 ఎకరాలు అవసరమని గుర్తించగా ఇందులో 1,104.64 ఎకరాలు రిజర్వు అటవీ భూమి కావడంతో అనుమతులు అవసరమయ్యాయి. మరో 196.71 ఎకరాలు మాత్రమే అనుమతులు అక్కర్లేని భూమిగా గుర్తించారు. ఇక మల్లాపూర్ వద్ద ఏర్పాటు చేయాలని తలపెట్టిన ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం 760 ఎకరాల భూమి అవసరం అవుతుందని అంచనా వేశారు. మైనింగ్ మొదలుపెట్టే ముందు కేంద్ర అణు ఇంధన శాఖ ఆ ప్రాంతంలోని నీటి నమూనాలు సేకరించి విశ్లేషించడం పరిపాటి. దీనిలో భాగంగానే 2010-2011 మధ్య 468 నీటి శాంపిళ్లను సేకరించి విశ్లేషించారు. 2018 నవంబర్-2019 జూలై మధ్య ఎంపిక చేసిన 25 బోరు బావులు, చేతి పంపుల నుంచి నమూనాలు సేకరించారు.

యూసీఐ ప్రతినిధుల వాహనంలో ఉన్న నీటి నమూనాలు

తాజా పరిశోధనల ప్రకారం లంబాపూర్-పెద్దగట్టు చుట్టుపక్కల 8 కిలోమీటర్ల పరిధిలోనే ఎంపిక చేసిన 21 బోరుబావులు, 4 చేతి పంపుల నుంచి నీటి నమూనాలు సేకరించారు. ఇందులో 1 పీపీబీ నుంచి 2,618 పీపీబీ వరకు యురేనియం ఆనవాళ్లను కనుగొన్నారు. 13 చోట్ల 60 పీపీబీకి తక్కువగా యురేనియం ఆనవాళ్లు ఉన్నాయని, మిగిలిన 12 చోట్ల 1 పీపీబీ నుంచి 2,618 పీపీబీ అంటే.. అత్యధిక స్థాయిలో ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. తాగే నీటిలో 60 పీపీబీ వరకు యురేనియం ఉండొచ్చని ఆటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్ (ఏఈఆర్‌బీ) రక్షిత పరిమితులు విధించిందని చెబుతున్నారు. కానీ యునైటెడ్ స్టేట్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (యూఎస్ఈపీఏ) మాత్రం నీటిలో 30 పీపీబీ వరకు యురేనియం ఉంటేనే ఆ నీరు తాగడానికి రక్షితమని నిర్దేశించినట్లు చెబుతున్నారు. నమూనాలు సేకరించిన 4 చేతి పంపుల నీటిలో 1 పీపీబీ నుంచి 48 పీపీబీ వరకు యురేనియం ఉన్నట్లు పరిశోధన అధ్యయనాలు తేల్చాయి కాబట్టి, ఆ చేతి పంపుల నీరు తాగడానికి పనికి రాదంటున్నారు. ఈ లెక్కన యూసీఐఎల్ అధికారులు సేకరించిన 25 చోట్ల నీటి నమూనాల్లో యురేనియం ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లేనని విశ్లేషిస్తున్నారు. వందలాది బోరు బావులతో రైతులు వ్యవసాయం చేస్తున్నారు. 50 వేల మంది వరకు దీనివల్ల ప్రభావితమయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రమాదకర స్థాయిలో యురేనియం ఆనవాళ్లు

50 ఏళ్లుగా తాగుతున్నాం..

అధికారులు నీటి నమూనాలు సేకరించిన బోరుబావుల నీటినే 50 ఏళ్లుగా తాగుతున్నాం. నీటి నమూనాలలో యురేనియం ఆనవాళ్లు ఉన్నాయంటున్నారు. అధికారుల నుంచి దీనిపై ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ నీటిని తాగకూడదని అధికారులు ఇప్పటివరకు చెప్పలేదు. అధికారులు మాత్రం నీటి నమూనాలు సేకరిస్తూనే ఉన్నారు.

- నరేందర్‌నాయక్, సర్పంచ్, పెద్దగట్టు

స్పష్టత ఇవ్వాలి

మండలంలోని పెద్దగట్టు గ్రామంలో యూసీఐ అధికారులు తాగునీటి బోరుబావుల నుంచి గతేడాది జూలై వరకు నెల, రెండు నెలలకోసారి నీటి నమూనాలను సేకరించారు. ఈ సేకరించిన నీటిలో యురేనియం ఆనవాళ్లు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాలి.

- గోవింద్ యాదవ్, యల్లాపురం

కొత్త చట్టంతో మెరుగైన పాలన

మున్సిపల్ చట్టంపై ప్రజలకు అవగాహన: హరీశ్‌రావు

- మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పన పాలకవర్గాలదే..

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త మున్సిపల్ చట్టం ద్వారా పట్టణాల్లోని ప్రజలకు మెరుగైన పాలన, సేవలు అందే అవకాశం ఉందని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ చట్టం ద్వారా భవన నిర్మాణాల అనుమతులు సులభతరం అవ్వడంతో పాటు నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలకు ఆస్కారం ఉంటుందన్నారు. గురువారం సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మహాశివరాత్రి సందర్భంగా మంచు శివలింగ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్థానిక ఖిద్మత్ 3వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా మున్సిపల్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఆయా మున్సిపాలిటీ చైర్మన్‌లు, కమిషనర్‌లకు నూతన మున్సిపల్ చట్టంపై కలెక్టర్ వెంకట్రామిరెడ్డితో కలసి అవగాహన కల్పించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించడంలో మున్సిపల్ నూతన చట్టం ఎంతో ఉపయోగపడనుందని పేర్కొన్నారు. ఈ 'చట్టాన్ని అమలు చేయడంలో జిల్లాల కలెక్టర్లకు, మంత్రులకు, చైర్మన్లకు, కమిషనర్లకు పరీక్షలాంటిందన్నారు. ఆయా మున్సిపాలిటీలపై పూర్తిస్థాయి అజమాయిషీ జిల్లా కలెక్టర్లకు అప్పగిస్తూ చట్టాన్ని రూపొందించామన్నారు. ప్రజల మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను అమలు చేయడంలో పాలకవర్గాలు బాధ్యతయుతంగా పనిచేయాలని సూచించారు. మున్సిపల్ వ్యవహారాలన్నీ నూతన చట్టానికి అనుగుణంగా పారదర్శకంగా ఉండనున్నాయని పేర్కొన్నారు. జిల్లాల్లోని ఆయా మున్సిపాలిటీల్లో ప్రతి వార్డుల్లో 4 కమిటీలు ఏర్పాటు చేసి, అవి వార్డు ప్రగతిని నిరంతరం పర్యవేక్షించనున్నాయని తెలిపారు. టీఎస్ ఐపాస్ పద్ధతిలో మున్సిపాలిటీల్లో నూతన భవనాల అనుమతులను పారదర్శకంగా చేపడతామన్నారు. అంతకుముందు డిగ్రీ కళాశాలలోని మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఆయన అమర్‌నాథ్, హిమలయాలు, ద్వాదశ జ్యోతిర్లింగాల భారీ సెట్టింగుల గురించి అడిగి తెలుసుకున్నారు. మహా శివరాత్రి నేపథ్యంలో మూడ్రోజుల పాటు సిద్దిపేటలో ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆరుగురు పీఠాధిపతులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. 12 గంటల పాటు 500 మంది కళాకారులతో శివ తాండవం, శివ నృత్యం ప్రదర్శన ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. హిందూ, ముస్లింల ఐక్యతకు సిద్దిపేట వేదికగా మారిందన్నారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

మ్యాజిక్ భాస్కర్‌ను సన్మానిస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ వరప్రసాద్ రెడ్డి

తల్లి సాక్షిగా చెబుతున్నా..

సిద్దిపేటను చూసి ముగ్ధుడయ్యా..!

ఈ స్థాయిలో అభివృద్ధి చేశారని అనుకోలేదు..

- శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు వరప్రసాద్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): సిద్దిపేటకు మొదటిసారి వచ్చానని, తల్లి సాక్షిగా చెబుతున్న ఇక్కడ అభివృద్ధిని చూసి ముగ్ధుడ్ని అయ్యానని ప్రముఖ వ్యాపార వేత్త శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు వరప్రసాద్ రెడ్డి అన్నారు. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో గురువారం రాత్రి నిర్వహించిన మ్యాజిక్ భాస్కర్ మ్యాజిక్ షోలో వరప్రసాద్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావులు పాల్గొన్నారు. వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. 'మంత్రి హరీశ్‌రావు చాతుర్యం తెలుసు. కానీ ఈ స్థాయిలో జిల్లాను అభివృద్ధి చేశారని అనుకోలేదు. ఒక జిల్లా ఇంత గొప్పగా ఉంటుందా. జాతీయ భావం కలిగిన నాయకుడు హరీశ్‌రావు. మెజిషీయన్ భాస్కర్‌ను ప్రోత్సాహించేందుకే ఇక్కడికి వచ్చా. ఒలింపిక్స్‌లో మ్యాజిక్‌కు ఒక్క పతకం లేదు. అంతర్జాతీయ అవకాశం కోసం మన అందరం ప్రయత్నించాలి. సరైన వ్యక్తికి సరైన గుర్తింపు రావాలి. రాష్ట్ర అవార్డు లభిస్తే అంతర్జాతీయ స్థాయిలో అవార్డు తీసుకువచ్చే అవకాశం ఉంటుంది'అని అన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జరిమానా లేకుండానే స్వదేశానికి..

ఇరాక్‌లో ఫలించిన టీజీఈడబ్ల్యూఏ ప్రయత్నం

- రేపు స్వగ్రామాలకు చేరుకోనున్న 15 మంది తెలంగాణ కార్మికులు

మోర్తాడ్: ఇరాక్‌లో అఖామా రెన్యూవల్ కాక నాలుగు నెలల పాటు అవస్థలు పడిన తెలంగాణ వాసులు ఎట్టకేలకు స్వదేశం చేరుకోవడానికి మార్గం సుగమం అయ్యింది. ఇరాక్‌లోని తెలుగు గల్ఫ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (టీజీఈడబ్ల్యూఏ) చొరవతో ఎలాంటి జరిమానా చెల్లించాల్సిన అవసరం లేకుండానే 15 మంది తెలంగాణ కార్మికులు గురువారం స్వదేశానికి బయలుదేరారు. వీరు శనివారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. నకిలీ అఖామాలను సృష్టించిన కారణంగా ఇరాక్ ప్రభుత్వం వీరి రెన్యూవల్‌ను నిలిపివేసింది. దీంతో గడువు ముగిసిపోవడంతో తెలంగాణ జిల్లాలకు చెందిన కార్మికులు ఒక్కొక్కరు రూ.10 లక్షల జరిమానా చెల్లించాలి. లేదా జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. అయితే.. తెలుగు గల్ఫ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, ఉపాధ్యక్షుడు రాంచందర్‌లు స్పందించి మన విదేశాంగ శాఖ అధికారుల సహకారంతో కుర్దిస్తాన్ ప్రభుత్వంతో చర్చించారు. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని విన్నవించడంతో కుర్దిస్తాన్ ప్రభుత్వం కార్మికులు చెల్లించాల్సిన జరిమానా రద్దు చేసి ఇంటికి వెళ్లడానికి అనుమతి ఇచ్చింది.

ఇరాక్‌లో తెలంగాణ వాసులు వీరే

నిట్‌తో సీమెన్స్, ఎంటీసీ ఒప్పందం

ఎంయూఓ విలువ రూ.172 కోట్లు

- విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు

కాజీపేట అర్బన్ : సీమెన్స్ సాఫ్ట్‌వేర్, ఎంట్యాబ్ టెక్నాలజీ సెంటర్లు వరంగల్ అర్బన్ జిల్లాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)తో రూ.172 కోట్ల విలువైన ఎంఓయూ (మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్) కుదుర్చుకున్నాయి. కాజీపేటలోని నిట్‌లో గురువారం నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు, సీమెన్స్ కంట్రీ సేల్స్ లీడర్ మాథ్యూ థామస్, ఎంటీసీ డైరెక్టర్ శశి శ్రీమనన్ పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు మాట్లాడుతూ ఎంహెచ్‌ఆర్డీ ద్వారా ఆమోదం పొందిన టర్కీ ప్రాజెక్టులో భాగంగా సీమెన్స్, ఎంటీసీ కంపెనీలతో ఒప్పందం కదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ ఎంఓయూలో భాగంగా డిజైన్, డిజిటలైజేషన్, ఇండస్ట్రీ-4.0 రంగంలో విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడంతో పాటు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, డీన్ వేణుగోపాల్, సీఎస్ఆర్‌కే.ప్రసాద్, సీమెన్స్ రీజినల్ డైరెక్టర్ గోపాల్ నాయుడు, ఎంటీసీ ప్రతినిధి ఫెడ్రిక్ భాస్కర్ పాల్గొన్నారు.

ఎంఓయూ మార్చుకుంటున్న నిట్ డైరెక్టర్ రమణారావు, సీమెన్స్, ఎంటీసీ ప్రతినిధులు

శివాలికి 5 అసిస్ట్ వరల్డ్ రికార్డులు

పటాన్‌చెరు: గీతం విద్యార్థిని శివాలి శ్రీవాస్తవ, ఆమె తల్లిదండ్రులు ఐదు అసిస్ట్ వరల్డ్ రికార్డులు సాధించారు. ఇప్పటికే 10 అసిస్ట్, 9 గిన్నిస్, ఒక యూనిక్ వరల్డ్ రికార్డు సాధించిన ఆ కుటుంబం తాజాగా మరో 5 రికార్డులను సొంతం చేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని గీతం హైదరాబాద్ క్యాంపస్‌లో బీటెక్ సీఎస్ఈ నాలుగో సంవత్సరం చదువుతున్న శివాలి శ్రీవాస్తవ కొన్నేళ్లుగా కాగితంతో బొమ్మలు తయారు చేస్తూ గిన్నిస్ రికార్డులు సాధించారు. రెండ్రోజుల క్రితం తాజాగా గిన్నిస్ వరల్డ్ రికార్డు కోసం మరో ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనకు సంబంధించి అసిస్ట్ వరల్డ్ రికార్డ్స్ ఫౌండేషన్ వారు తాజాగా 5 అవార్డులను ఆమెకు అందించారు. అత్యధిక సంఖ్యలో 15,952 ఆరెగామీ, 11,234 క్విల్లింగ్ వస్తువులను ఆమె ప్రదర్శించడంతో ఈ అర్హత సాధించారు. కాగితాన్ని మలవడం (ఆరెగామీ)తో 2,500 పెంగ్విన్, 1,451 మాప్లే ఆకులు, 6,000 లెమన్ బొమ్మలు తయారు చేశారు. కాగితాన్ని మెలితిప్పడం (క్విల్లింగ్)తో 1,111 నగలు, 7,011 పూలు, 2,111 బొమ్మలు, 1,001 ఇళ్లను వారు ప్రదర్శనలో పెట్టి రికార్డు సాధించారు. శివాలితోపాటు ఆమె తల్లిదండ్రులు జోహ్రీ శ్రీవాస్తవ, అనిల్ శ్రీవాస్తవలు ఆ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఐదో దశకు ఆధునీకరణ

కేటీపీఎస్‌లో 500 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసి 22 ఏళ్లు

- రూ.100 కోట్లతో పునరుద్ధరణ పనులు
- బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించిన జెన్‌కో యాజమాన్యం

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్)లో 500 మెగావాట్ల సామర్థ్యం గల ఐదో దశను ఆధునీకరించేందుకు టీఎస్ జెన్‌కో యాజమాన్యం కసరత్తు చేస్తోంది. కర్మాగారం స్థాపించి 22 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఉత్పత్తిలో తలెత్తే సాంకేతిక సమస్యలకు చెక్ పెట్టాలని భావించిన జెన్‌కో.. రూ.100 కోట్లతో ప్రతిపాదనలు చేసి పనులను బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించింది. కేటీపీఎస్ ఐదో దశ కర్మాగారంలోని 250 మెగావాట్ల సామర్థ్యం గల 9వ యూనిట్‌ను 1997 అక్టోబర్ 1న, మరో 250 మెగావాట్ల 10వ యూనిట్‌ను 1998 సెప్టెంబర్ 1న ప్రారంభించారు. ఈ రెండు యూనిట్లలో కలిపి 500 మెగావాట్ల ఉత్పత్తి వస్తుంది. 5వ దశ నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటడంతో తరచూ సాంకేతిక సమస్యలు ఏర్పడి ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. ఈ క్రమంలో ఆర్‌అండ్‌ఎం (రెన్నోవేషన్ అండ్ మోడర్నైజేషన్) చేయాలని నిర్ణయించారు. ప్లాంట్ జీవిత కాలం 25 ఏళ్లు కాగా 15 సంవత్సరాలు దాటిన తర్వాత కర్మాగారం పరిస్థితిని బట్టి ఆధునీకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో 22 ఏళ్ల తర్వాత పనులు చేపడుతున్నారు. దీనివల్ల మరో ఇరవై ఏళ్ల పాటు విద్యుత్ ఉత్పత్తి కొనసాగే అవకాశం ఉంది. కాగా, కర్మాగారంలో కంట్రోల్ అండ్ ఈన్స్ట్రుమెంటేషన్ (సీఅండ్ఐ)కి రూ.70 కోట్లు, ఎయిర్ హీటర్లకు రూ.20 కోట్లు, ఇతర పనులకు రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.100 కోట్లు బీహెచ్‌ఈఎల్‌కు విడుదల చేశారు. దీంతో బీహెచ్‌ఈఎల్ అధికారులు.. ఆధునీకరణకు అవసరమైన సామగ్రిని వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించి కర్మాగారంలో నిల్వ చేస్తున్నారు. అయితే 800 మెగావాట్ల కేటీపీఎస్ 7వ దశలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో గత నవంబర్ 28న ఉత్పత్తి నిలిపివేశారు. మరమ్మతు పనులు మార్చి వరకు పూర్తయ్యే అవకాశం ఉంది. 7వ దశలో ఉత్పత్తి అందుబాటులోకి రాగానే ఐదో దశలో ఆధునీకరణ పనులు చేపట్టాలని అధికార

నిధుల విడుదలపై బీజేపీ దుష్ప్రచారం

సాక్షి, హైదరాబాద్: ఐదేళ్లలో తెలంగాణకు కేంద్రం విడుదల చేసిన నిధులకు సంబంధించి రాష్ట్ర బీజేపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ ఆరోపించారు. నిధుల గణాంకాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటు వేదికగా ప్రకటించినా.. బీజేపీ నేతలు అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణకు కేంద్రం మంజూరు చేసిన నిధులకు సంబంధించి రాష్ట్ర బీజేపీ నేతలు చేస్తున్న ప్రకటనలను ఖండించారు. 2014 నుంచి 2019 వరకు ఐదేళ్ల కాలంలో పన్నుల రూపంలో కేంద్రానికి రాష్ట్రం నుంచి రూ.2.72 లక్షల కోట్లు వెళ్లగా, కేంద్రం నుంచి రాష్ట్రానికి మాత్రం రూ. 1.12 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయని గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించిన గణాంకాలపై రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ విమర్శిస్తే బీజేపీ నేతలు ఉలికిపడుతున్నారన్నారు. ప్రగతిశీల రాష్ట్రాలకు నిధులు కేటాయింపు పెంచాలని సీఎం పలు సందర్భాల్లో విజ్ఞప్తి చేసినా కేంద్రం పెడచెవిన పెట్టిందన్నారు. తెలంగాణ కు నిధుల విడుదల కోసం కేంద్రంపై ఒత్తిడి చేయాలని బీజేపీ నేతలకు సూచించారు.

రిజర్వేషన్లను ఎత్తేసేందుకు బీజేపీ కుట్ర

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తమ పార్టీ కల్పించిన రిజర్వేషన్లను ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు ఎత్తివేసే కుట్ర చేస్తున్నాయని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా ఆరోపించారు. తద్వారా ఆయా వర్గాలు నష్టపోయే ప్రమాదముందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి కార్యకర్తలు, నాయకులు ఈ అంశంపై పోరాటాలకు సిద్ధం కావాలని గురువారం ఒక ప్రకటనలో ఆయన పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల విషయంలో బీజేపీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇందిరాపార్కు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుంతియా పిలుపునిచ్చారు.

రాష్ట్ర ఖజానా కల్వకుంట్ల కుటుంబం పాలు

సాక్షి, హైదరాబాద్: నదీజలాలు సముద్రం పాలవుతుంటే రాష్ట్ర ఖజానా కల్వకుంట్ల కుటుంబం పాలవుతోందని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటున్నారే తప్ప దాని వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 105 రోజుల్లో మూడు బ్యారేజీల నుంచి మిడ్‌మానేరుకు ఒక్క చుక్కయినా నీరు వచ్చిందా అని ప్రశ్నించారు. కాళేశ్వరం మీద రూ.50 వేల కోట్లు ఖర్చు పెట్టినా ఇప్పటివరకు ఒక్క చుక్క కూడా నీరు వాడుకోలేదన్నారు.

రిజర్వేషన్లకు తూట్లు పొడిచింది కాంగ్రెస్సే..

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు తూట్లు పొడిచింది కాంగ్రెస్ పార్టీనే అని, ఈ విషయంలో బహిరంగ చర్చకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సిద్ధమా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలకు బీజేపీ చేరువవుతుంటే సహించలేక కాంగ్రెస్ దివాళా కోరు రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. నిన్నటి వరకు సీఏఏపై కుట్రలు కుతంత్రాలు చేసిన కాంగ్రెస్ ఇప్పుడు మరో అంశాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. రాజకీయంగా అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అణచివేసిందన్నారు. జగ్జీవన్‌రామ్‌ను ప్రధాని కాకుండా అడ్డుకుంది ఆ పార్టీయేనని, దాని దుకాణం తెలంగాణలో బంద్ చేసుకుంటే మంచిదని సలహా ఇచ్చారు.

'ఏబీవీ' బినామీ భూ బాగోతం

తెలంగాణలో భారీగా భూములు కొన్న ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ● నారాయణపేట జిల్లాలోని రెండు గ్రామాల్లో 117.14 ఎకరాలు కొనుగోలు

(ముహమ్మద్ ముజాహిద్ బాబ, సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్): ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు బినామీ బాగోతం బట్టబయలైంది. తెలంగాణలోని నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పసుపుల, చిట్యాల గ్రామాల్లో 117.14 ఎకరాల భూములను 11 మంది బినామీల పేరిట ఆయన కొనుగోలు చేసిన ఉదంతం వెలుగుచూసింది. 1989 ఏపీ క్యాడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన వెంకటేశ్వరరావు ఏడీజీపీగా పని చేసిన కాలంలో నిఘా పరికరాల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలడం తెలిసిందే. దీనిపై ఏపీ డీజీపీ ఇచ్చిన నివేదిక మేరకు ఏపీ ప్రభుత్వం క్రమశిక్షణ చర్యల కింద వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసింది. అయితే వెంకటేశ్వరరావు తన హోదాను అడ్డుపెట్టుకొని భారీ మొత్తంలో ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మక్తల్ మండల పరిధిలోని పసుపుల, చిట్యాల గ్రామాల్లో బినామీల పేరిట 117.14 ఎకరాల భూములు కొనుగోలు చేసినట్లు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది. భూముల కొనుగోలు సమయంలో ఎవరికీ అనుమానం రాకుండా బంధువులు, కుటుంబ సభ్యులతోపాటు తన నమ్మకస్తుల పేరిట పట్టా చేయించారు.

రెండు గ్రామాలు... 117.14 ఎకరాలు

పదేళ్ల క్రితం నుంచే పసుపుల గ్రామంలో 52.19 ఎకరాలు, చిట్యాలలో 64.35 ఎకరాల చొప్పున మొత్తం 117.14 ఎకరాలను వెంకటేశ్వరరావు బినామీల పేరిట కొనుగోలు చేశారు. ప్రత్యక్షంగా భూ లావాదేవీలు కొనసాగిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని ముందే ఊహించిన ఆయన... ముందు జాగ్రత్తగా భూముల కొనుగోళ్ల విషయంలో మండలానికి చెందిన ఓ రాజకీయ నాయకుడిని రంగంలో దింపారు. ఆయన మధ్యవర్తిత్వంతో ఆయా గ్రామాల్లో భూములను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన భూముల్లో సాగు చేస్తున్న వెంకటేశ్వరరావు... రైతులతో సాగు చేయిస్తే విషయం బయటకు పొక్కుతుందని భావించి ఆధునిక పద్ధతులను ఎంచుకున్నారు. మందుల పిచికారీ, నూర్పిడి, విత్తనాలు విత్తడం వంటి పనులను యంత్రాల ద్వారా నిర్వహిస్తూ కూలీల అవసరాన్ని తగ్గించి జాగ్రత్తపడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. పొలంలోనే ఫాం హౌస్ ఏర్పాటు చేసుకున్న వెంకటేశ్వరరావు... నెలకోసారి కచ్చితంగా వ్యవసాయ క్షేత్రానికి వచ్చి వెళతారని గ్రామస్తులు తెలిపారు.

కృష్ణా నది టు వ్యవసాయ క్షేత్రం..

తన వ్యవసాయ క్షేత్రం నుంచి సుమారు 3 కి.మీ. మేర కృష్ణా నది ఒడ్డున ఉన్న దత్తాత్రేయస్వామి ఎత్తిపోతల పథకం పక్కనే దానికి సమాంతరంగా మరో చిన్నపాటి ఎత్తిపోతలను వెంకటేశ్వరరావు ఏర్పాటు చేసుకున్నారు. నాలుగు 10 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేసి కృష్ణా నది భూగర్భం నుంచి పెద్ద పైప్‌లైన్ల ద్వారా నీటిని వ్యవసాయ క్షేత్రానికి తరలిస్తున్నారు. ఇదే తరహాలో చిట్యాల వాగులోనూ 10 హెచ్‌పీ మోటారును ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి తరలిస్తున్న నీటిని వ్యవసాయ క్షేత్రంలో భారీగా నిర్మించిన సంప్‌లో నిల్వ చేస్తున్నారు. అక్కడ ప్రత్యేక మోటార్ల ద్వారా పంటలకు సాగునీరు చేరవేస్తున్నారు. వాటికి తోడు పొలంలో అక్కడక్కడా మరో 8 బోర్లు కూడా వేశారు. గతంలో పండ్ల తోటలు వేసిన ఆయన తర్వాత వరిని సాగు చేస్తున్నారు. కృష్ణా నది గర్భం నుంచి నేరుగా తన పొలాలకు సాగునీరు చేరవేస్తున్న వెంకటేశ్వరరావు తీరుపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భూముల కొనుగోళ్ల విషయంలోనూ తమ కుటుంబానికి అన్యాయం జరిగిందని పసుపుల గ్రామానికి చెందిన ఆనంద్‌గౌడ్ ఆరోపిస్తున్నాడు. తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

ఏబీ వెంకటేశ్వర్‌రావు పొలంలో వేసిన వరినాట్లు

కృష్ణానది వద్ద మోటార్లు బిగించి నీటిని తోడుకుంటున్న దృశ్యం

పడకేసిన లిఫ్టు..

3,500 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో పసుపులలో రూ. 76 లక్షలతో 1987లో నిర్మించిన దత్తాత్రేయ ఎత్తిపోతల పథకం ప్రస్తుతం పడకేసింది. దాని నిర్వహణ బాధ్యతను మొదట్లో ప్రభుత్వమే చూసుకున్నా 2002లో రైతులకు అప్పగించడంతో నిర్వహణ భారమై రైతులు ఉపయోగించుకోలేకపోయారు. తాజాగా ఆ లిఫ్టుకు పక్కనే ఆ పథకానికి సమాంతరంగా వెంకటేశ్వరరావు భారీ మోటార్లతో నీటిని తరలించడం గ్రామస్తులను విస్మయానికి గురి చేస్తోంది.

భారీగా విద్యుత్ వినియోగం..

వ్యవసాయ క్షేత్రానికి నీటి తరలింపు కోసం ఏర్పాటు చేసిన మోటార్లతో విద్యుత్ వినియోగం భారీగా ఉంటోంది. కృష్ణా తీరం వద్ద ఉన్న నాలుగు 10 హెచ్‌పీ మోటార్లలో ఒక్కొక్కటి 12 గంటలు పని చేస్తే.. ఏడు కిలోవాట్ల విద్యుత్ వినియోగం జరుగుతుందని, దీన్ని కమర్షియల్‌గా లెక్కిస్తే రూ. 900 బిల్లు అవుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. అదే 5 హెచ్‌పీ మోటార్లు పనిచేస్తే రూ. 450 వరకు బిల్లు వస్తుందన్నారు. ఈ లెక్కన ఏళ్ల నుంచి నిరంతరంగా పని చేస్తున్న ఈ భారీ మోటార్లతో విద్యుత్ వినియోగం ఏ మేరకు ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అయితే సర్వీసు చార్జీల కింద రైతులు ప్రతి నెలా చెల్లించే రూ. 30 మాదిరిగానే ఈ భారీ మోటార్లకూ వెంకటేశ్వరరావు అదే చెల్లింపులు చేయడం గమనార్హం.

11 మంది మీద పట్టాలు...

రెండు గ్రామాల్లో తాను కొనుగోలు చేసిన 117.14 ఎకరాలను వెంకటేశ్వరరావు 11 మంది పేరిట పట్టాలు చేసినట్లు రెవెన్యూ రికార్డులు చూపుతున్నాయి. అయితే వారందరూ స్థానికేతరులు కావడం గమనార్హం. వారు ఎవరో? ఎక్కడి వారో తెలియదని గ్రామస్తులు చెబుతున్నారు. పట్టాలు పొందిన వారిలో కొరుమర్ల వెంకట సత్యనాగమణి తప్ప మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం నుంచి రైతు బంధు పేరిట ఆర్థిక సహాయాన్ని సైతం పొందడం గమనార్హం. 2018 ఖరీఫ్, రబీ, 2019 ఖరీఫ్‌లో పెట్టుబడి సాయం కింద మొత్తం రూ. 9,23,900 లబ్ధి పొందారు. మరో రూ. 10,98,400 మంజూరై చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఏబీ వెంకటేశ్వరరావు బినామీల పేరిట చేపట్టిన భూ కొనుగోళ్లు ఇలా.. (నోట్: ఎకరం=40 గుంటలు)

పసుపుల గ్రామంలో....

పేరు	సర్వే నం.	విస్తీర్ణం (ఎకరాలు, గుంటల్లో)	రైతు బంధు (రూ.)	పెండింగ్
సీహెచ్ సీతమ్మ	19/2అ/1	4.26	84,500	32,500
	20/అ/2	1.34		
మొత్తం	–	6 ఎకరాల 20 గుంటలు		
కొరుమళ్ల వెంకట సత్యనాగమణి		5.00	–	–
బి. నాగ శ్రీ	20/ఈ	2.20	65,000	25,000
	21/ఈ	2.20		
మొత్తం	–	5 ఎకరాలు		
ఆలూరి దీప్తి చౌదరి	167/ఉ	4.37	1,28,800	1,61,000
	168/అ	5.16		
	168/ఆ	5.31		
మొత్తం	–	16 ఎకరాల 4 గుంటలు		
ఆలూరి జయప్రద	19/2అ/2	2.20	83,000	1,03,750
	50/ఈ2/1/1/1	0.32		
	149/ఆ1	2.00		
	150/ఎ	2.21		
	150/లు	1.11		
	150/లూ	1.11		
మొత్తం	–	10 ఎకరాల 15 గుంటలు		
ఎ.నవోదయకుమారి	171/ఆ	5.30	1,23,500	47,500
	168అ	1.27		
	168అ1	2.03		
మొత్తం	–	9 ఎకరాల 20 గుంటలు		

చిట్యాల గ్రామంలో...

పేరు	సర్వే నం.	విస్తీర్ణం (ఎకరాలు, గుంటల్లో)	రైతు బంధు (రూ.)	పెండింగ్
మధు కల్యాణ్	139అఆ	1.10	1,28,000	1,60,000
	139ఆ	1.10		
	139ఆఅ	1.10		
	139ఉఈ	1.10		
	140అ	11.00		
మొత్తం	–	16 ఎకరాలు		
ఎన్. హరిత	138ఆ	6.00	89,900	3,14,650
	140ఆ	6.06		
	141	7.13		
	142అ/ఇ	3.00		
మొత్తం	–	22 ఎకరాల 19 గుంటలు		
ఆలూరి కవిత	139అ	3.30	90,400	1,13,000
	139ఈ	3.31		
	139ఈ1	1.11		
	139ఉఅ	1.10		
	139ఉఆ	1.10		
మొత్తం	–	11 ఎకరాల 12 గుంటలు		
ఆలూరి దీప్తి చౌదరి	138ఆ	2.00	26,000	10,000
సీహెచ్ సీతమ్మ	138అ	10.24	1,04,800	1,31,000
	139ఇ/ఆ	1.10		
	139ఇ/ఆ1	1.10		
మొత్తం	–	13 ఎకరాల 4 గుంటలు		

భూమికి భూమి ఇస్తామని ఇవ్వలేదు...

మేం ఆరుగురు అన్నదమ్ములం. గ్రామంలో మాకు 12.24 ఎకరాల భూమి ఉండేది. అందులో రెండెకరాల భూమిని అన్నదమ్ములం అందరి సమ్మతంతో మా గ్రామానికి చెందిన ఆశప్పకు అమ్మినం. 2005లో మా గ్రామానికి చెందిన ఓ పెద్ద మనిషి నా దగ్గరికి వచ్చి వెంకటేశ్వరరావు సార్ మీ పదెకరాల భూమి అడుగుతుండ్రు. దానికి బదులు మరోచోట పంటలు బాగా పండే భూమి ఇస్తరు అన్నరు. అప్పుడు మేం ఇద్దరినీ నమ్మి భూమి రిజిస్ట్రేషన్ చేసినం. అప్పట్నుంచీ ఇప్పటివరకు మాకు ఎక్కడా భూమి ఇవ్వలేదు. రూ. 20 వేలు మాత్రమే ఇచ్చారు. భూమి ఇప్పించాలని అడుగుతుంటే మా గ్రామ పెద్ద మనిషి తిప్పించుకుంటున్నడు. నాకు న్యాయం చేయండి.

– ఆనంద్‌గౌడ్ (పసుపుల గ్రామం)

తక్కువ ధరలకు భూములు కొన్నారు..

ఎవరో డీఐజీ సార్ అట. అప్పట్లో తక్కువ ధరలకు ఇక్కడ భూములు కొన్నారు. కృష్ణా నది నుంచి పైప్‌లైన్ల ద్వారా నేరుగా పొలాలకు నీరు తీసుకెళ్తున్నరు. డబ్బున్న వాళ్లకు ఏదైనా చెల్లుతది. మా లాంటి వాళ్లకు అన్నీ ఆంక్షలే.

– లక్ష్మణ్, స్థానికుడు

పీఆర్‌సీ గడువు మరోసారి పొడిగింపు?

▶ మొదటి పేజీ తరువాయి

కొంత ఉపశమనం కలించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

డీఏ మెర్జ్ చేయడమా.. ఐఆర్ ఇవ్వడమా?

పీఆర్‌సీ అమలు ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్లు తెలిసింది. మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వడమా? లేక పీఆర్‌సీ అమలు చేయాల్సిన 1-7-2018 నాటికి ఉన్న డీఏను బేసిక్ పేలో కలిపి కొత్త బేసిక్‌తో వేతనాలు చెల్లించడమా? అని ఆలోచిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఉద్యోగులకు ఐఆర్ ఇవ్వాల్సి వచ్చినా ప్రభుత్వంపై అధికంగా ఆర్థికభారం పడుతుంది. ఒక్క శాతం ఐఆర్ ఇవ్వాలంటే ఏటా రూ.225 కోట్ల చొప్పున వెచ్చించాల్సి వస్తుందని ఆర్థిక శాఖ గతంలోనే అంచనా వేసింది. ఈ లెక్కన 27 శాతం ఇవ్వాలంటే రూ.6,075 కోట్లు అవసరమవుతాయి. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 27 శాతం ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో అంతకంటే తక్కువ ఇస్తే ఉద్యోగుల నుంచి అసంతృప్తి వ్యక్తమయ్యే ప్రమాదం ఉంది. కానీ, ప్రస్తుతం ఉన్న ఆర్థిక సమస్యల నేపథ్యంలో అంత పెద్ద మొత్తాన్ని వెచ్చించే పరిస్థితి ప్రభుత్వానికి లేదు. దీంతో ఐఆర్ కాకుండా పీఆర్‌సీ అమలు చేయాల్సిన తేదీ 1-7-2018 నాటికి ఉన్న కరువు భత్యాన్ని (డీఏ) ప్రస్తుతం ఉన్న పాత బేసిక్ పేలో కలిపి కొత్త వేతనం ఇవ్వాలని యోచిస్తున్నట్టు తెలిసింది. 1-7-2018 నాటికి 30,292 శాతం డీఏ ఉండగా, ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు 3.244 శాతం డీఏ పెరిగి ప్రస్తుతం 33.536 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో పీఆర్‌సీ అమలు తేదీ నాటికి ఉన్న డీఏను మెర్జ్ చేసి కొత్త బేసిక్ పేతో వేతనం ఇస్తే ఉద్యోగులకు కొంత ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) పెరుగుతుంది. దానికి మిగతా 3.244 డీఏ, ఇతర అలవెన్స్‌లు కూడా కలుస్తాయి. దీనివల్ల ప్రభుత్వంపై పడే భారం తక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పైగా హెచ్‌ఆర్‌ఏపై రూ.20వేల పరిమితి ఉంది. అంటే రూ.66,640 బేసిక్ పే దాటితే ఆయా ఉద్యోగులకు కొత్త వేతనం వస్తుందే తప్ప.. హెచ్‌ఆర్‌ఏ పెరగదు. అయితే బేసిక్ పే రూ.66,640లోపు ఉన్న ఎక్కువ మంది ఉద్యోగులకు మాత్రం హెచ్‌ఆర్‌ఏ రూపంలో ప్రయోజనం చేకూరనుంది.

పదవీ విరమణ వయసు పెంపు..

ఉద్యోగులకు కొంత ప్రయోజనం చేకూర్చడంతోపాటు పదవీ విరమణ వయసును 61 ఏళ్లకు పెంచడం ద్వారా వారికి కొంత శాంతపరచవచ్చని, ఫలితంగా పీఆర్‌సీ ఆర్థిక భారం నుంచి మినహాయింపు పొందవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పదవీ విరమణ వయసు పెంపునకు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆ మేరకు ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తద్వారా 2023 మార్చి 31 నాటికి రిటైరయ్యే 26,133 మంది ఉద్యోగులకు లబ్ధి కలగనుంది. వీటిన్నింటినీ వచ్చే ఏప్రిల్ నుంచి అమలు చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

ఇదీ వేతన లెక్క...

జిల్లాల్లో రూ.42,490-96,110 స్కేల్‌లో పనిచేసే ఉద్యోగికి ప్రస్తుతం వస్తున్న వేతనం (రూ.లలో)	
బేసిక్ పే	77,030
ప్రస్తుత డీఏ (33.5366 శాతం)	25,833
హెచ్‌ఆర్‌ఏ (12 శాతమైతే)	9,244
మొత్తం	1,12,107
డీఏ మెర్జ్ చేస్తే వచ్చే వేతనం (రూ.లలో)	
బేసిక్ పే	77,030
1-7-2018 నాటికి ఉన్న డీఏ (30,292 శాతం)	23,334
ఆ డీఏ కలిపితే వచ్చే బేసిక్ పే	1,00,364
1-7-2018 తరువాత పెరిగిన డీఏ (3.244 శాతం)	3,256
హెచ్‌ఆర్‌ఏ (12 శాతమైతే..)	12,044
మొత్తం వేతనం	1,15,664
అదే ఉద్యోగికి 27 శాతం ఐఆర్ ఇస్తే..	
బేసిక్ పే	77,030
ఇప్పటివరకు ఉన్న డీఏ (33.536 శాతం)	25,833
హెచ్‌ఆర్‌ఏ (12 శాతమైతే)	9,244
ఐఆర్	20,798
మొత్తం వేతనం	1,32,905

..జాతీయ పార్టీలేవీ లేవు

▶ మొదటి పేజీ తరువాయి

వంటి అంశాలు కీలకంగా ఉంటాయన్నారు.

రాష్ట్రాలు ఇస్తేనే కదా..

'రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం తన సొంత నిధులు ఇస్తుందన్న ఆలోచన సరికాదు. రాష్ట్రాలు కూడా కేంద్రానికి నిధులు సమకూరుస్తుందన్న విషయం మరవకూడదు. తెలంగాణ నుంచి గడిచిన ఐదేళ్లలో రూ.2.72 లక్షల కోట్లు కేంద్రానికి పన్నుల రూపంలో ఇస్తే తిరిగి తెలంగాణకు కేంద్రం రూ.1.12 లక్షల కోట్లు మాత్రమే ఇచ్చింది. తెలంగాణ లాంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలు కేంద్రానికి చెల్లిస్తున్న పన్నులతో పోల్చుకుంటే.. కేంద్రం అన్ని నిధులను రాష్ట్రానికి తిరిగి ఇవ్వలేని విషయాన్ని గుర్తుంచుకోవాలి'అని అన్నారు.

రాజకీయ ప్రత్యర్థులుగానే చూస్తాం

'బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను శత్రువులుగా భావించట్లేదు. రాజకీయ ప్రత్యర్థులుగా మాత్రమే భావించి ఎన్నికల్లో పోరాడుతాం. అలాంటి పార్టీలతో వ్యక్తిగత శత్రుత్వం లేదు. తమ వాదన లేదా సైద్ధాంతికతకు వ్యతిరేకంగా నిలిచి ఉన్నంత మాత్రాన.. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం రాష్ట్రాలను, లేదా ఇతర పార్టీలను శత్రువులుగా చూడాల్సిన అవసరం లేదు. కేంద్రం చేపట్టిన అనేక చర్యలను అంశాల వారీగా మద్దతిచ్చిన మేం.. ప్రజా వ్యతిరేకమైన అసంబద్ధమైన చర్యలనూ వ్యతిరేకించాం'అని పేర్కొన్నారు.

నోట్ల రద్దుపై మా నిర్ణయం తప్పు..

'పెద్ద నోట్ల రద్దు ద్వారా దేశానికి మంచి జరుగుతుంది.. సంపూర్ణ క్రాంతి వస్తుందన్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం అన్న మాటలు నమ్మి మద్దతిచ్చాం. కానీ పెద్ద నోట్ల రద్దు ద్వారా దేశానికి నష్టం జరిగిన విషయం తేలిన తర్వాత మా నిర్ణయం తప్పని తేలింది' అని కేటీఆర్ వివరించారు. 'టీఆర్ఎస్.. బీజేపీ 'బీ'టీమ్ అని కాంగ్రెస్ వ్యాఖ్యానిస్తోంది. టీఆర్ఎస్ కాంగ్రెస్ 'బీ'టీం అని బీజేపీ వ్యాఖ్యానిస్తోంది. మేం తెలంగాణ ప్రజలకు 'ఏ'టీం మాత్రమే. ఎవరికీ మేం 'బీ'టీం కాదు'అని చర్చలో పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ కూటమికి అవకాశాలు

'గత కొంతకాలంగా జరుగుతూ వస్తున్న ప్రతి ఎన్నికల్లోనూ ప్రాంతీయ పార్టీలే బలమైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతూ వస్తున్నాయి. భవిష్యత్తులో కచ్చితంగా ప్రత్యామ్నాయ కూటమికి అవకాశాలు ఏర్పడుతున్నాయి. రెండు జాతీయ పార్టీలు దేశాన్ని ఇప్పటికే నిరాశ పరిచాయి. ఆర్థిక అభివృద్ధి, మౌలిక వసతుల సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన వంటి అంశాల్లో దేశ ప్రజల ఆకాంక్షలను అందుకోలేకపోయాయి. ఈ విషయాన్ని దేశ ప్రజలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు'అని కేటీఆర్ వివరించారు.

రెండో రాజధానిగా ప్రజలు స్వాగతిస్తారో లేదో తెలియదు

'జీవించడానికి అనుకూలమైన అత్యుత్తమ నగరాల్లో మెర్సర్ గత ఐదేళ్లుగా హైదరాబాద్‌కు అగ్రస్థానం కల్పిస్తూ వస్తోంది. భారతదేశాన్ని రెండో జాతీయ రాజధానిగా ప్రకటించాల్సి వస్తే హైదరాబాద్ ప్రజలు అంగీకరిస్తారో లేదో అనే విషయంలో నాకు అనుమానం ఉంది'అని పేర్కొన్నారు.

సమాఖ్య స్ఫూర్తి ఏది?

'కో-ఆపరేటివ్ ఫెడరలిజం, టీమిండియా వంటి మాటలు చెప్పే ప్రధానమంత్రి.. ఆ భావనల స్ఫూర్తి ఆధారంగా పని చేయాలని కోరుకుంటున్నాం. నీతి ఆయోగ్ తెలంగాణ ప్రభుత్వానికి ఆర్థికంగా సహకరించాలని అనేక సూచనలు చేసినా, ఇప్పటిదాకా మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు వంటి వాటికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు'అని దుయ్యబట్టారు. కేంద్రం ఆర్థిక సంస్కరణలు, ఎఫ్ఆర్‌బీఎం పరిమితులు వంటి అంశాల్లో మరింత లిబరల్‌గా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అప్పుడే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అంతంతే

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు రావాల్సిన నిధులు పూర్తి నిరాశాజనకంగా, అసంబద్ధంగా ఉన్నాయని ఐటీ, మున్సిపల్ మంత్రి కేటీఆర అన్నారు. గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి పీయూష్ గోయెల్‌ను కలసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల పట్ల కేంద్రం ఉదార పూర్వకంగా ఉండాలని, నిజమైన పని రాష్ట్రాల్లోనే జరగుతుందని, అందుకు రాష్ట్రాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రావాల్సిన జీఎస్టీ బకాయిలు ఇవ్వాలని ఇప్పటికే సీఎం కేసీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఒక విడత బకాయిలు విడుదల చేశారని, త్వరలోనే మిగతా విడత బకాయిలు విడుదల చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. తమకు హక్కుగా రావల్సిన దానికంటే ఎక్కువ ఇచ్చినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో కేంద్రానికి పన్నుల రూపంలో తెలంగాణ 2.7 లక్షల కోట్లు చెల్లిస్తే.. తెలంగాణకు కేంద్రం 1.15 లక్షల కోట్లు మాత్రమే ఇచ్చిందని చెప్పారు. దేశంలో ప్రాంతీయ పార్టీలు మరింత బలపడతాయని, సీఎం కేసీఆర్ చెప్పే నిజమైన ఫెడరల్ స్ఫూర్తితో దేశం నడిచే రోజు వస్తుందని పేర్కొన్నారు.

అంచనాలకు మించి..

▶ మొదటి పేజీ తరువాయి

రూ.5,261 కోట్లు (85 శాతం) ఆదాయం లభించింది. మాంద్యం ప్రభావం రియల్ రంగంపై పడుతుందనే అపోహలను పటాపంచలు చేస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ భారీ ఆద

నెట్‌లో నేరచరితుల చిట్టా!

'చట్ట' సభ్యుల వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టాలని పార్టీలను ఆదేశించిన సుప్రీంకోర్టు

- ఎంపిక చేసిన మూడు రోజుల్లోపే వారి వివరాలు వెల్లడించాలి
- అన్ని రాజకీయ పార్టీలూ పాటించాల్సిందేనని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: చట్టసభల్లో నేరచరితుల సంఖ్య పెరిగిపోతూండటంపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్న వారిని ఎన్నికల్లో అభ్యర్థులుగా ఎందుకు నిర్ణయించారో వివరణ ఇవ్వడంతోపాటు ఆయా కేసుల జాబితాను రాజకీయ పక్షాలన్నీ తమ వెబ్‌సైట్లలో ఉంచాలని స్పష్టంచేసింది. ఎన్నికల్లో విజయం సాధించగలరన్న ఒకే ఒక్క కారణంతో నేర చరితులకు టిక్కెట్లు ఇచ్చామని పార్టీలు చెప్పజాలవని, వారి అర్హతలు, సమర్థత వంటి అంశాలను ప్రస్తావిస్తూ తగిన కారణాలు చూపాలని జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్, జస్టిస్ రవీంద్రభట్‌ల బెంచ్ స్పష్టం చేసింది. రాజకీయాలు నేరపూరితం కావడంపై కోర్టు 2018 సెప్టెంబర్‌లో ఇచ్చిన తీర్పు(అభ్యర్థులపై ఉన్న క్రిమినల్ నేరాల వివరాలు బహిర్గతం చేయాలి) అమలు కావడం లేదని, ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. రాజకీయ పార్టీలన్నీ అభ్యర్థులను ఎంపిక చేసిన 48 గంటల్లోగా లేదా నామినేషన్ల దాఖలు ప్రారంభమయ్యే తేదీకి కనీసం రెండు వారాల ముందు వారి నేర చరిత్రను ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి అన్ని సోషల్ మీడియా వేదికలపై వెల్లడించాలని, జాతీయ, స్థానిక వార్తా పత్రికల్లోనూ ప్రకటనలు జారీ చేయాలని ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను పాటిస్తున్నట్లు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు లిఖిత పూర్వకంగా తెలపాలని, అభ్యర్థులను ఎంపిక చేసిన మూడు రోజు(72 గంటలు)ల్లోగా ఈ పని పూర్తి చేయాలని వివరించింది. ఎవరైనా ఈ ఆదేశాలను పాటించని పక్షంలో ఆ వివరాలను తమకు ఇవ్వాలని ఈసీకి చెప్పింది.

నేర చరితులు పెరుగుతున్నారు

గత నాలుగు ఎన్నికలను పరిశీలిస్తే చట్టసభల్లో నేర చరితులు ఎక్కువవుతున్నట్లు స్పష్టమవుతోందని సుప్రీంకోర్టు ఈ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది. నేరచరితులను పోటీలో నిలిపిన పార్టీలకు లేదా అభ్యర్థులకు జరిమానా విధించాలన్న అంశంపై కొంత జాగరూకత అవసరమని, రాజకీయ కారణాలతో అభ్యర్థులపై తీవ్ర ఆరోపణలు వచ్చే అవకాశం ఉండటం ఇందుకు కారణమని కోర్టు వివరించింది. 2018 సెప్టెంబర్‌లో ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఒక ఏకగ్రీవ తీర్పునిస్తూ.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తమపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను ఈసీకి వెల్లడించాలని, ఆ వివరాలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల ద్వారా ప్రచారం కూడా కల్పించాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. రాజకీయాలు నేరపూరితం కావడమన్న రోగానికి పార్లమెంటు తగిన చికిత్స చేయాలని, నేర చరితులు చట్టసభల్లో ప్రవేశించకుండా చట్టాలు చేయాలని, కలుషితమైన రాజకీయాలను ప్రక్షాళన చేయాల్సిన సమయం వచ్చిందని తన ఆదేశాల్లో పేర్కొంది. నేర చరితులకు టికెట్లిస్తే అందుకు వివరణ ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను ప్రధాని మోదీ ఉల్లంఘించారని కాంగ్రెస్ ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా ఆరోపించారు.

ప్రజాస్వామ్యం మరింత బలోపేతం: బీజేపీ

రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల నేరచరిత్రను ఆన్‌లైన్‌లో ఉంచాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులపై బీజేపీ హర్షం వ్యక్తం చేసింది. ఈ చర్య ద్వారా ఎన్నికల్లో ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని పేర్కొంది.

ఎంపీల్లో 40 శాతం మందిపై కేసులు: ఈసీ

పార్లమెంట్‌లోని కనీసం 43 శాతం ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఈసీ గురువారం సుప్రీంకోర్టుకు తెలిపింది. కోర్టు ధిక్కరణకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా నేరచరితుల వివరాలను, వారి ఎంపికకు కారణాలను, క్రిమినల్ కేసులు లేని వారిని ఎందుకు ఎంపిక చేయలేదో తమతమ వెబ్‌సైట్లలో పార్టీలు వెల్లడించడాన్ని తప్పనిసరి చేయాలన్న బీజేపీ నేత, పిటిషనర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ తరపు న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ సూచనను ఈసీ అంగీకరించింది. ఈ మేరకు 2018 అక్టోబరు 10వ తేదీన ఫార్మ్ -26లో కొన్ని మార్పులు చేస్తూ నేర చరిత్ర వివరాలను అందించాల్సిందిగా రాజకీయ పార్టీలకు ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ విషయంలో ఎలక్షన్ సింబల్ ఆర్డర్-1968లోగానీ, ఎన్నికల నిబంధనావళిలోగానీ తగు మార్పులు చేయకపోవడం వల్ల 2018 అక్టోబర్ నాటి నోటిఫికేషన్‌కు న్యాయబద్ధత లేకుండా పోయిందన్న అశ్వినీకుమార్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తాజా ఆదేశాలను జారీ చేసింది.

కేజ్రీవాల్ వేషధారణలో అవ్‌యాన్ తోమర్

కేజ్రీవాల్ ప్రమాణానికి రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం నో

న్యూఢిల్లీ: ముచ్చటగా మూడోసారి ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఆమ్‌ఆద్మీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ ఈసారి ప్రమాణస్వీకార కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రముఖులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించడం లేదు. ఈనెల 16వ తేదీన ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి సీఎంలు, రాజకీయ నాయకులెవరినీ ఆహ్వానించడం లేదని ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్‌రాయ్ చెప్పారు. కేజ్రీవాల్ తన నాయకత్వంపై విశ్వాసం ఉంచి, మూడోసారి గెలిపించిన ఢిల్లీ ప్రజల మధ్యనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఆయన తెలిపారు. తన ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రజలే అతిథులని కేజ్రీవాల్ భావిస్తున్నారని వివరించారు.

ఏడాది బుడతడికి పిలుపు

అవ్‌యాన్ తోమర్ అనే చిన్నారికి మాత్రం ప్రత్యేకంగా ఆప్ నుంచి ప్రత్యేకంగా పిలుపు అందింది. కేజ్రీవాల్ మాదిరిగా టోపీ, స్వెట్టర్, మఫ్లర్, కళ్లజోడు ధరించిన ఈ ఏడాది వయస్సున్న ఈ బుడతడు ఢిల్లీలోని ఆప్ కార్యాలయం దగ్గర ఫలితాల వెల్లడిరోజు అందరి దృష్టినీ ఆకర్షించిన విషయం తెలిసిందే. 'బేబీ మఫ్లర్ మాన్'గా పేరొందిన తోమర్ తల్లిదండ్రులు ఆప్ కార్యకర్తలు.

24 గంటల్లో 11 లక్షల కొత్త సభ్యులు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయంతో 24 గంటల్లో దేశవ్యాప్తంగా 11 లక్షల మంది పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించినట్టు ఆప్ వెల్లడించింది. పార్టీ సభ్యత్వం తీసుకోదలిచిన వారికోసం ఆ పార్టీ ఓ ఫోన్ నంబర్‌ను ప్రత్యేకంగా కేటాయించింది. పార్టీలో జాయిన్ అవడానికి ఆ నంబర్‌కి మిస్డ్ కాల్ ఇస్తే సరిపోతుంది.

మోదీకి 'షహీన్‌బాగ్' వాలంటైన్స్ డే ఆహ్వానం

న్యూఢిల్లీ: వాలంటైన్స్‌డే సందర్భంగా ప్రధాని మోదీకి అనూహ్య ఆహ్వానం అందింది. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కి వ్యతిరేకంగా ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో నిరసనలు కొనసాగిస్తున్న ఆందోళనకారులు ప్రధానిని ఆహ్వానించారు. 'ప్రేమికుల దినం నాడు కలిసి వేడుక చేసుకుందాం రండి' అంటూ షహీన్‌బాగ్ ప్రాంతంలో పోస్టర్లు వెలిశాయి. 'ప్రధాని మోదీ, షహీన్‌బాగ్‌కు రండి. మాతో మాట్లాడి, బహుమతి పట్టుకెళ్లండి' అని ఉన్న పోస్టర్లు, ప్రేమ గీతం సామాజిక మాధ్యమాల్లోనూ చక్కర్లు కొడుతున్నాయి. 'ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, మంత్రులెవరైనా సరే, ఇక్కడికి వచ్చి, మేం సిద్ధంగా ఉంచిన బహుమతి తీసుకెళ్లొచ్చు. సీఏఏ రాజ్యాంగ విరుద్ధం కాదని వారు మమ్మల్ని ఒప్పించగలిగితే వెంటనే నిరసనలను ఆపేస్తాం' అని షహీన్‌బాగ్ ఆందోళనల్లో పాల్గొంటున్న సయ్యద్ తనీర్ తెలిపారు.

ట్రంప్‌కు పేదలు కనిపించరాదని..

- మోదీ-ట్రంప్ రోడ్ షో మార్గంలో కిలోమీటర్ మేర గోడ నిర్మాణం
- అమెరికా అధ్యక్షుడి పర్యటనకు ముస్తాబవుతున్న అహ్మదాబాద్

ట్రంప్ ప్రయాణించనున్న మార్గంలోని మురికివాడల వద్ద నిర్మిస్తున్న గోడ

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఘన స్వాగతం పలికేందుకు కేంద్రం భారీగా ఏర్పాట్లు చేస్తుండగా గుజరాత్ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. 24వ తేదీన అహ్మదాబాద్‌లో మోదీ-ట్రంప్ రోడ్ షో జరిగే మార్గంలో ఉన్న మురికివాడలు కనిపించకుండా ఉండేందుకు గోడ నిర్మాణం చేపడుతోంది. అమెరికా అధ్యక్షుడికి పేదరికం ఛాయలు కనిపించకుండా ఉండేందుకు గాంధీనగర్ నుంచి అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు వరకు ఉన్న మార్గంలోని పేదల ఇండ్ల పొడవునా కిలోమీటర్ పొడవైన గోడను నిర్మిస్తోంది. ట్రంప్ ప్రయాణించే మార్గంలో ఉన్న 500 పూరిగుడిసెలు కనిపించకుండా చేసేందుకు సర్దార్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇందిరా బ్రిడ్జి వరకు దాదాపు 7 అడుగుల ఎత్తైన ఈ గోడను నిర్మించడంతోపాటు, దాని పొడవునా ఖర్జూర మొక్కలు నాటి ఆ మార్గాన్ని అందంగా తయారుచేయనున్నారు. ట్రంప్ పర్యటన పుణ్యమా అని ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకుండా అధ్వాన స్థితిలో ఉన్న 16 ప్రధాన మార్గాల్లో కొత్తగా రోడ్లు వేస్తున్నారు. ఆ మార్గాల్లో మొక్కలు నాటడం, రంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడం వంటి పనుల్లో యంత్రాంగం బిజీగా ఉంది. ఈ మొత్తం పనుల కోసం అహ్మదాబాద్ అధికారులు రూ.50 కోట్లు వెచ్చిస్తున్నట్లు మీడియా పేర్కొంది. జపాన్ ప్రధాని షింజో ఆబే(2017), చైనా అధ్యక్షుడు జిన్ పింగ్(2014) పర్యటనలప్పుడు కూడా గుజరాత్ ప్రభుత్వం సుందరీకరణ పనులు భారీ ఎత్తున చేపట్టింది. 2017లో ట్రంప్ కుమార్తె ఇవాంకా పర్యటన సమయంలో హైదరాబాద్‌లో ఆమె పర్యటించే ప్రాంతాల్లో ఉండే బిచ్చగాళ్లందరినీ తెలంగాణ యంత్రాంగం వేరే చోటికి తరలించిన విషయం తెలిసిందే.

భారత పర్యటనపై మెలానియా ఉత్సాహం

భారత్‌లో పర్యటనకోసం తానెంతో ఉత్సుకతతో ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భార్య మెలానియా చెప్పారు. అహ్మదాబాద్, న్యూఢిల్లీలో పర్యటనకు తమను సాదరంగా ఆహ్వానిస్తోన్న భారత ప్రధాని మోదీకి ట్విట్టర్ ద్వారా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటన ద్వారా ఇరుదేశాల మధ్య బలపడనున్న బంధాన్నీ సెలబ్రేట్ చేసుకొనేందుకు ఉత్సాహంగా ఉన్నామని మెలానియా ప్రకటించారు. తమ ఈ పర్యటన చాలా ప్రత్యేకమైనదనీ, ఇది భారత్-అమెరికాల మధ్య స్నేహ బంధాల్ని బలోపేతం చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందనీ ఆమె ట్విటర్‌లో వ్యాఖ్యానించారు.

ప్రధాని భద్రత బడ్జెట్‌పై విమర్శలు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ భద్రతను పర్యవేక్షించే 'స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్(ఎస్పీజీ)'కి ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ. 600 కోట్లను కేటాయించడంపై ట్విట్టర్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక, మాజీ ప్రధాని మన్మోహన్‌లకు కల్పించిన ఎస్పీజీ భద్రతను గత సంవత్సరం కేంద్రం ఉపసంహరించింది. ప్రధాని, ఆయన అధికార నివాసంలో ఆయనతో ఉండే కుటుంబ సభ్యులకు ఎస్పీజీ భద్రత కల్పించేలా ఇటీవల ఎస్పీజీ చట్టంలో సవరణ చేశారు. రూ.600కోట్ల కెటాయింపుపై సోషల్ మీడియాలో విమర్శలు పెరిగాయి. 'ప్రధాని మోదీ 'ఫకీరీ' దేశ ఖజానాపై రోజుకు రూ. 1.62 కోట్ల భారం మోపుతోంది' అని అఖిల భారత మహిళాకాంగ్రెస్ ట్వీట్ చేసింది. 'జేఎన్‌యూలో 8 వేల మంది విద్యార్థులున్నారు. వారిపై ప్రభుత్వం గ్రాంట్లు, సబ్సిడీల పేరుతో ఏటా రూ. 400 కోట్లను ఖర్చు చేస్తోంది. ఒక స్వయం ప్రకటిత ఫకీరు భద్రత ఖర్చు ఏటా రూ. 563 కోట్లా?' అని ట్విట్టర్ యూజర్ పేర్కొన్నారు. 'మోదీజీ.. మీ భద్రతకు అయ్యే ఖర్చు తగ్గించండి. మీ దుబారాతో ఖజానా ఖాళీ అవుతోంది. మీరొక ఫకీరు. సింపుల్ మ్యాన్. భద్రతను పక్కనబెట్టి స్వేచ్ఛగా తిరగండి' అని మరో ట్విట్టర్ యూజర్ పేర్కొన్నారు. 'ప్రధాని భద్రత ఖర్చు ఏడాదికి రూ. 592 కోట్లు అంటే.. రోజుకు రూ. 1.62 కోట్లు. గంటకు రూ. 6.75 లక్షలు. నిమిషానికి రూ. 11,263' అని మరో యూజర్ ట్విట్టర్‌లో లెక్కలు గట్టాడు.

స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో భాగంగా మహారాష్ట్రలో వాడేసిన బాటిళ్లతో ఏనుగు శిల్పం రూపొందిస్తున్న కరాడ్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది

బ్రిటన్ ఆర్థిక మంత్రిగా 'ఇన్ఫోసిస్' మూర్తి అల్లుడు

రిషి సునక్

లండన్: 'ఇన్ఫోసిస్' నారాయణమూర్తి అల్లుడు, భారత సంతతి బ్రిటిష్ ఎంపీ రిషి సునక్(39) భారీ ప్రమోషన్ కొట్టేశారు. బ్రిటన్ కేబినెట్‌లో చోటుచేసుకున్న భారీ మార్పుల్లో భాగంగా ప్రధాని తర్వాత రెండో స్థానంగా భావించే ఆర్థిక మంత్రి పోస్టు ఆయనకు దక్కింది. ప్రధాని జాన్సన్ చీఫ్ స్పెషల్ అడ్వైజర్ డొమినిక్ కమ్మింగ్స్‌తో తలెత్తిన విభేదాల కారణంగా ఆర్థిక మంత్రి, పాక్ సంతతికి చెందిన సాజిద్ జావిద్ అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో ఆ తర్వాతి పోస్టు, ఆరిక శాఖ చీఫ్ సెక్రటరీగా ఉన్న రిషి ఆ బాధ్యతల కోసం ప్రధాని ఎంపిక చేశారు. తాజా పరిణామంతో భారత సంతతికి చెందిన హోంమంత్రి ప్రీతీ పటేల్, రిషి సునక్ కీలక బాధ్యతల్లో ఉన్నట్లయింది. వీరితోపాటు ఆగ్రాలో జన్మించిన అలోక్ శర్మ(52)కు వాణిజ్యం, ఇంధన, పరిశ్రమల విధానం శాఖ మంత్రి, సుయెల్లా బ్రావర్‌మాన్(39)ను అటార్నీ జనరల్‌గా బాధ్యతలు అప్పగించారు. ఎక్కువ మంది భారతీయులు కీలకపోస్టుల్లో ఉన్న ఈ మంత్రి వర్గాన్ని 'దేశి కేబినెట్ ఇన్ యూకే హిస్టరీ'గా పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఆర్థిక మంత్రిగా తనపై చాలా బాధ్యతలు ఉన్నాయని రిషి అన్నారు. వచ్చే నెలలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాల్సిన బడ్జెట్‌ను రూపొందించాల్సి ఉంది. రిషి తండ్రి వైద్యుడు కాగా, తల్లి ఫార్మసిస్ట్. పంజాబ్‌కు చెందిన వీరు లండన్‌లో స్థిరపడ్డారు. 1980లో జన్మించిన రిషి వించెస్టర్ కాలేజీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీల్లో చదివారు. రిషి సునక్ నారాయణమూర్తి కుమార్తె అక్షతను వివాహం చేసుకున్నారు.

'ఢిల్లీ ఫలితాలు కాంగ్రెస్‌కి కరోనాలా తగిలాయి'

కొచ్చి: మైనార్టీ మతవాదంపై కాంగ్రెస్ పార్టీ సామరస్య ధోరణితో ఉంటుందన్న ప్రచారంపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు జైరామ్ రమేష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), షహీన్‌బాగ్ నిరసనల్ని ప్రచార అస్త్రంగా చేసుకొని బీజేపీ ఓట్లను చీల్చడం వల్ల ఆ పార్టీ గెలవలేదు కానీ, ఎక్కువ నష్టం జరిగింది కాంగ్రెస్‌కేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారిగా కరోనా వైరస్ సోకినట్టుగా భారీగా నష్టం జరిగిందన్నారు. మెజార్టీ ప్రజల మనోభావాల పట్ల కూడా సున్నితంగా వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏకే ఆంటోని చేసిన వ్యాఖ్యల్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మతవాదం ఏ రూపంలో ఉన్నా తాము గట్టిగా తిప్పికొడతామని, కానీ ముస్లిం మతవాదంపై తాము చూసీ చూడనట్టు వ్యవహరిస్తామన్న దుష్ప్రచారం సాగుతోందని జైరామ్ రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు.

నిర్భయ కేసు విచారణ నేటికి వాయిదా

న్యూఢిల్లీ: నిర్భయపై సామూహిక అత్యాచారం, హత్య కేసులో దోషులను వేర్వేరుగా ఉరితీయాలంటూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణని సుప్రీంకోర్టు శుక్రవారానికి వాయిదావేసింది. అలాగే రాష్ట్రపతి కోవింద్ క్షమాభిక్ష తిరస్కరణను చాలెంజ్ చేస్తూ దోషుల్లో ఒకరైన వినయ్ శర్మ దాఖలు చేసుకున్న పిటిషన్‌నూ శుక్రవారం విచారిస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. తన పాత లాయర్‌ను తొలగించారని, కొత్త లాయర్‌ను నియమించుకోవడానికి సమయం అవసరమని దోషి పవన్ గుప్తా కోర్టుకు విన్నవించారు. దీంతో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ(డీఎల్ఎస్ఏ) మరో లాయర్‌ను సూచించగా అందుకు పవన్ సుముఖంగా లేనట్టు తీహార్ జైలు అధికారులు ఢిల్లీ కోర్టుకు తెలిపారు. విచారణ ఆలస్యం కావడంతో జడ్జి ధర్మేంద్ర.. పవన్ తరపున వాదించేందుకు రవి క్వాజీ అనే లాయర్‌ను కొత్తగా నియమించారు.

ఒక్కరోజే 254 మంది మృతి

- హడలెత్తిస్తున్న కోవిడ్-19
- మొత్తం మృతుల సంఖ్య 1,376

బీజింగ్‌లోని ఓ నివాస సముదాయం గేట్ వద్ద ఏర్పాటు చేసిన డిస్‌ఇన్ఫెక్షన్ దారి

బీజింగ్/న్యూఢిల్లీ: కోవిడ్-19(కరోనా వైరస్) రోజు రోజుకీ విజృంభిస్తోంది. కరోనా వైరస్ మొదటిసారిగా బయటకొచ్చి చైనాలోని హుబాయి ప్రావిన్స్‌లో రోజు రోజుకి మృతుల సంఖ్య పెరిగిపోతోంది. బుధవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 254 మంది మరణించారు. ఇప్పటివరకు వ్యాధి బారిన పడి 1,367 మంది మరణించారు. తాజాగా మరో ఇద్దరు భారతీయులకి కోవిడ్ వ్యాధి సోకినట్టు అనుమానిస్తున్నారు. బ్యాంకాక్ నుంచి భారత్‌కు వచ్చిన హిమాద్రి బర్మన్, నగేంద్ర సింగ్ అనే ఇద్దరు వ్యక్తులకు ఈ వైరస్ సోకిందని అనుమానాలున్నాయని కోల్‌కతాలోని ఎన్ఎస్‌సీబీఐ విమానాశ్రయం డైరెక్టర్ కౌషిక్ భట్టాచార్జీ వెల్లడించారు. బెలియాఘాటా ఐడీ ఆస్పత్రిలో వారిద్దరినీ అందరికీ దూరంగా వారిని ఉంచి చికిత్స అందిస్తున్నారు.

మంత్రుల బృందం సమీక్ష

కరోనా వైరస్ తన ప్రతాపం చూపిస్తుండడంతో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి మంత్రుల బృందం పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. గురువారం నాడు వీరంతా సమావేశమై భారత్‌లో వైరస్ విస్తరణ, దానిని ఎదుర్కోవడానికి అవసరమైన ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ సమావేశానంతరం కేంద్ర మంత్రి హర్షవర్ధన్ విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు కేరళలో మూడు కరోనా కేసులు మాత్రమే నమోదయ్యాయని స్పష్టం చేశారు. కోల్‌కతాలో ఎవరికీ వ్యాధి నిర్ధారణ కాలేదని ఆ వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ప్రత్యేక ఆస్పత్రిలో ఉంచి చికిత్స చేస్తున్నామన్నారు.

కొత్త విధానంతో పెరిగిన మృతులు

చైనాలో రాత్రికి రాత్రి కోవిడ్ కేసులు అసాధారణంగా పెరిగిపోవడానికి కారణాలున్నాయి.ఇన్నాళ్లు కరోనా వైరస్‌ను గుర్తించడానికి వైరాలజీ ల్యాబ్‌లో న్యూక్లిక్ యాసిడ్ అనే ఒక పరీక్షని నిర్వహించేవారు. అందులో పాజిటివ్ వస్తేనే వ్యాధి ఉన్నట్టు ధ్రువీకరించేవారు. ఇప్పుడు అలా కాదు ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఉన్నట్టుగా సిటీ స్కానింగ్‌లో బయటకు వచ్చినా కరోనా వైరస్ సోకినట్టే లెక్కలు వేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా కొత్త కేసులు పెరిగిపోయాయి. ఒకే రోజు 242 మంది మరణించడానికి, 14,840 కేసులు వెలుగులోకి రావడానికి కొత్త విధానం ద్వారా గణించడమే కారణమైందని హువాన్ వైద్యులు వెల్లడించారు.

'టెరి' వ్యవస్థాపక డైరెక్టర్ ఆర్కే పచౌరి మృతి

న్యూఢిల్లీ: ప్రముఖ పర్యావరణవేత్త, 'ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్(టెరి)' మాజీ చీఫ్ ఆర్‌కే పచౌరి(79) గురువారం కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన హృదయ సంబంధ వ్యాధితో బాధ పడుతున్నారు. 'టెరి'కి వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఆయన సేవలందించారు. ఢిల్లీలోని ఎస్కార్ట్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్లో మంగళవారం పచౌరికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. లైంగికంగా వేధించారని ఒక సహ ఉద్యోగిని ఆరోపణలు చేయడంతో 2015లో 'టెరి' నుంచి పచౌరి వైదొలిగారు. 'టెరి'కి పచౌరి అందించిన అనుపమాన సేవలను సంస్థ చైర్మన్ నితిన్ దేశాయి ఒక ప్రకటనలో కొనియాడారు. 1974లో 'టెరి'ని స్థాపించారు. విద్యుత్, పర్యావరణం, సమ్మిళిత అభివృద్ధి రంగాల్లో ఈ సంస్థ కృషి చేస్తోంది.

దూకుడు తగ్గించడమా? పెంచడమా?

పశ్చిమబెంగాల్ ఎన్నికల ప్రచారంపై పునరాలోచనలో బీజేపీ

కోల్‌కతా/న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంతో.. రానున్న పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై భారతీయ జనతా పార్టీ పునరాలోచనలో పడింది. గతంలో మాదిరిగానే పౌరసత్వ సవరణ చట్టం అమలు, జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ)లపై దూకుడుగా వెళ్లాలా? లేక ప్రత్యామ్నాయ వ్యూహాలను తెరపైకి తేవాలా? అనే విషయంలో పార్టీ రాష్ట్ర నేతలు భిన్నాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2021లో పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ.. అధికార టీఎంసీని ఎదుర్కొనేందుకు అన్ని రకాలుగా సమాయత్తమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన ఫలితాలే అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతం కాబోవని తాజా ఢిల్లీ ఎన్నికలు స్పష్టం చేశాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లో బీజేపీ మంచి ఫలితాలను సాధించింది. మొత్తం 42 స్థానాలకు గానూ 18 సీట్లను గెలుచుకుంది. లోక్‌సభ ఎన్నికలతో పోల్చుకుని.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ మెరుగైన ఫలితాలు సాధిస్తామని భావించలేమని పార్టీ రాష్ట్ర నేతలు పేర్కొంటున్నారు. వారు ఢిల్లీ ఫలితాలను ఉదాహరణగా చూపుతున్నారు. ఢిల్లీలో 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 7 స్థానాలను గెలుచుకున్న బీజేపీ.. అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి ఊహించని పరాజయాన్ని మూటకట్టుకుంది. 'ఢిల్లీలో కొన్ని నెలల వ్యవధిలోనే రెండు విభిన్న ఫలితాలు వచ్చాయి. అందువల్ల లోక్‌సభ ఎన్నికల్లో 18 సీట్లు గెలుచుకున్నాం కాబట్టి అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుస్తామని ధీమాగా ఉండలేం' అని వారు వివరించారు. 'రాష్ట్ర ఎన్నికలకు వ్యూహాలను మార్చాల్సి ఉంటుంది. జాతీయ ఎన్నికల్లో పనిచేసిన అంశాలు రాష్ట్రాల ఎన్నికల్లో పనిచేయకపోవచ్చు. సీఏఏ, ఎన్నార్సీల అమలుపైననే మా ప్రచారం ఉండకూడదు. సుపరిపాలనకు సంబంధించిన ఇతర అంశాలనూ తెరపైకి తేవాలి' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక సీనియర్ బీజేపీ నేత అభిప్రాయపడ్డారు. ఈ వాదనకు విరుద్ధంగా మరో వాదనను మరి కొందరు నేతలు వినిపించారు. 'సీఏఏ, ఎన్నార్సీలకు సంబంధించి వ్యూహాలను మార్చాల్సిన అవసరం లేదు. వాటిపై దూకుడుగా ముందుకు వెళ్లడమే మంచిది. గతంలో అలా దూకుడుగా వెళ్లిన సందర్భంగా మంచి ఫలితాలు వచ్చిన ఉదాహరణలు ఉన్నాయి. తృణమూల్ వంటి పార్టీని ఎదుర్కోవాలంటే.. ఆవేశపూరిత, ఉద్వేగ భరిత వ్యూహాలనే అమలు చేయాలి. ఒకవేళ వ్యూహాలను మారిస్తే వెనకడుగు వేసినట్లవుతుంది. ఇది పార్టీ శ్రేణుల్లోకి తప్పుడు సందేశం తీసుకువెళ్తుంది' అని పశ్చిమబెంగాల్ బీజేపీ చీఫ్ దిలీప్ ఘోష్‌కు సన్నిహితులైన కొందరు సీనియర్ నేతలు అభిప్రాయపడ్డారు.

ద్విముఖ పోరు వల్లనే ఓటమి

'ఢిల్లీ' పరాజయంపై బీజేపీ సమీక్ష ప్రారంభించింది. గతం కన్నా ఈ సారి ఓటు శాతం పెంచుకున్నప్పటికీ.. ద్విముఖ పోటీ నెలకొనడం వల్లనే ఓటమి పాలయినట్లు పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నిక

సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 14

చిత్తశుద్ధి లేని చర్య

ముంబై మహానగరంపై పన్నెండేళ్లక్రితం జరిగిన ఉగ్రవాద దాడి సూత్రధారి, జమాత్ ఉద్ దవా(జేయూడీ) చీఫ్ హఫీజ్ సయీద్‌కు పాకిస్తాన్ కోర్టు బుధవారం 11 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ఇది విని అమెరికా హర్షం వ్యక్తంచేసింది గానీ పాకిస్తాన్ న్యాయస్థానాల తీరుతెన్నులు, అక్కడి పాలకుల ఎత్తుగడలు తెలిసినవారికి ఈ పరిణామం పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు ముసుగు సంస్థగా రంగంలోకొచ్చిన జేయూడీ మన దేశంలో 173 మందిని పొట్టనబెట్టుకున్న ముంబై ఉగ్రవాద దాడి కేసులో మాత్రమే కాదు... 12 మంది మరణించిన 2001 పార్లమెంటు దాడి, 209 మంది చనిపోయిన 2006 నాటి ముంబై రైలు పేలుళ్ల కేసు వగైరాల్లో ప్రధాన పాత్ర పోషించింది. ఈ కేసుల్లో హఫీజ్‌ను అప్పగించాలని మన దేశం డిమాండ్ చేస్తోంది. ముంబై ఉగ్ర దాడికి సంబంధించి నిర్దిష్టమైన సాక్ష్యాధారాలు కూడా సమర్పించింది. కానీ ఇచ్చిన సాక్ష్యాలు సరిపోవని, మరిన్ని వివరాలు కావాలని పదే పదే అడగటం తప్ప పాక్ చేసిందేమీ లేదు. ముంబై ఉగ్రదాడి జరిగిన ఏడాది తర్వాత అమెరికా పోలీసులకు చిక్కి ప్రస్తుతం అక్కడే జైలుశిక్ష అనుభవిస్తున్న పాకిస్తానీ అమెరికన్ డేవిడ్ హెడ్లీ సైతం ఆ దాడిలో పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ప్రమేయం, లష్కర్‌తో దానికున్న సంబంధాలు, హఫీజ్ సయీద్ పోషించిన పాత్ర వగైరాలపై పూస గుచ్చినట్టు చెప్పాడు. అలాంటి హఫీజ్‌కు ఇప్పుడు ఉగ్రవాదానికి ఆర్థిక సాయం అందించిన కేసులో శిక్ష పడింది. అతగాడి పాపాల చిట్టాతో పోలిస్తే ఈ ఆర్థిక సాయం ఆరోపణ చాలా చిన్నది.

అంతర్జాతీయంగా ఒత్తిళ్లు వచ్చినప్పుడు హఫీజ్‌ను జైలుకు పంపడం, అవి చల్లారగానే అతన్ని విడుదల చేయడం రివాజుగా మారింది. మధ్యమధ్య గృహ నిర్బంధంలో ఉంచడం కూడా సర్వసాధారణం. గత పదేళ్లుగా ఈ తంతు నడుస్తూనేవుంది. 90వ దశకం చివర లష్కరే సంస్థను నిషేధించినప్పుడు అప్పటికి ఉనికిలో లేని జమాత్ ఉద్ దవావల్ ఇర్షాద్ అనే సంస్థ పంచన చేరిన హఫీజ్ 2002లో దాన్ని జేయూడీగా మార్చుకున్నాడు. అది ధార్మిక సంస్థ అని చెప్పుకున్నాడు. దానిద్వారా భారీయెత్తున నిధులు సేకరించడం, ఆ నిధుల్ని ఖర్చుపెట్టి ఉగ్రవాద మూకలను తయారు చేయడం వంటి చర్యలు కొనసాగిస్తున్నా పాకిస్తాన్ ప్రభుత్వాలు కళ్లు మూసుకున్నాయి. జేయూడీకి సైన్యం అండదండలుండటమే ఇందుకు కారణం. పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నిరుడు అమెరికా పర్యటనలో వుండగా ఇలాంటి ఉగ్ర మూకల గురించి తీవ్రంగానే మాట్లాడారు. అఫ్ఘానిస్తాన్, కశ్మీర్‌లలో పోరాడిన సాయుధ మిలిటెంట్లు 30,000 నుంచి 40,000 వరకూ పాక్‌లో ఉన్నారని ప్రకటించారు. పాక్‌ను గతంలో ఏలినవారంతా ఈ నిజాన్ని దాచి దేశానికి నష్టం కలగజేశారని ఆరోపించారు. ఈ మాదిరి మిలిటెంట్లపై తాము చర్యలు తీసుకోవడం మొదలుపెట్టామని కూడా చెప్పారు. కానీ అందులో అర్ధసత్యమే ఉందని ప్రపంచానికంతకూ తెలుస్తునే వుంది. అందుకు హఫీజ్ సయీద్ ఉదంతమే పెద్ద ఉదాహరణ. నిజంగా తన దేశంలో సాయుధ మిలిటెంట్ల బెడద వుండకూడదనుకుంటే హఫీజ్‌పైనా, అలాంటి మరికొందరిపైనా పకడ్బందీ సాక్ష్యాలు సేకరించి, వారందరికీ ఎప్పుడో శిక్ష పడేలా చర్యలు తీసుకునేవారు. కానీ ఆ విషయంలో చిత్తశుద్ధి కనబడటం లేదు. ఇప్పుడైనా శిక్ష పడిన సందర్భమేమిటో గమనిస్తే చివరకు ఈ కేసు ఏమవుతుందో సులభంగానే తెలుస్తుంది. జీ-7 దేశాల చొరవతో 1989లో ఏర్పడి, పారిస్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ ఉగ్రవాద లావాదేవీల నిఘా సంస్థ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) ఉగ్రవాదుల కదలికలను, వారి లావాదేవీలను గమనిస్తూ వుంటుంది. ఏ దేశమైనా ఇలాంటి లావాదేవీలను నిరోధించలేకపోయినా, వాటిని ప్రోత్సహిస్తున్నట్టు అనుమానం కలిగినా, ఉగ్ర సంస్థల నిధుల వ్యవహారాన్ని దర్యాప్తు చేయడంలో సహకరించకపోయినా అనుమానిత దేశాల జాబితాలో లేదా కుమ్మక్కయిన దేశాల జాబితాలో చేరుస్తుంది. పర్యవసానంగా ప్రపంచ దేశాలనుంచి వాటికి ఆర్థిక సాయం నిలిచిపోతుంది. బ్లాక్ లిస్టులో చేరిన దేశాలపై ఇతరత్రా ఆంక్షలు కూడా విధిస్తారు. ఇరాన్, ఉత్తర కొరియాలపై ఈ వంకనే ఆంక్షలు అమలవుతున్నాయి. ఆ సంస్థ నిరుడు జూన్‌లో సమావేశమైనప్పుడు పాకిస్తాన్‌ను తీవ్రంగా హెచ్చరించింది. 2020 ఫిబ్రవరి 20కల్లా చర్య తీసుకోకపోతే చర్యలు తప్పవని తెలిపింది. ఉగ్రవాద సంస్థలను నియంత్రించడంలో సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారని చీవాట్లు పెట్టింది. నిజానికి అప్పట్లోనే కఠిన చర్య తీసుకోవాల్సివున్నా చైనా, టర్కీ, మలేసియా, సౌదీ అరేబియా, గల్ఫ్ సహకార మండలి జోక్యం చేసుకుని ఆ దేశానికి మరికొంత సమయం ఇద్దామని నచ్చజెప్పాయి. మరో మూడురోజుల్లో పారిస్‌లో ఎఫ్ఏటీఎఫ్ సమావేశాలు జరగబోతున్నాయి. ఈసారి హఫీజ్‌పై చర్యకు వెనకాడితే ఎవరూ తనను సమర్థించరన్న భయం పాకిస్తాన్‌కు వుంది. అలాగే అఫ్ఘానిస్తాన్ ఊబిలో కూరుకుపోయిన అమెరికా సాధ్యమైనంత త్వరగా అక్కణ్ణించి బయటపడాలని చూస్తోంది. పాక్ అండ లేకుంటే అది సాధ్యం కాదు గనుక, ఎఫ్ఏటీఎఫ్ బెడద తప్పించుకోవడానికి వెనువెంటనే ఏదో ఒక చర్య తీసుకోమని అమెరికా సలహా ఇచ్చి వుండొచ్చు కూడా.

మొత్తానికి ఇలా స్వీయ ప్రయోజనాలను ఆశించి ఉగ్రవాదంపై భిన్న వైఖరులు తీసుకునే దేశాల వల్లే పాకిస్తాన్ ఇష్టానుసారం వ్యవహరించగలుగుతోంది. ఇది అంతిమంగా ఉగ్రవాదులకు ఊతం ఇస్తోంది. ఎఫ్ఏటీఎఫ్ సమావేశాలు ముగిశాక పాక్‌లో మరో న్యాయస్థానం హఫీజ్ నిర్దోషి అని తీర్పిచ్చినా ఆశ్చర్యం లేదు. సంస్థల నిషేధం, వ్యక్తుల అరెస్టులు మించి అదనంగా పాక్ ఏం చేస్తున్నదో నిశితంగా గమనించాల్సిన అవసరం... అది అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడేలా చూడాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలకుంది. ముఖ్యంగా ఉగ్రవాదం రాజ్య విధానంగా లేదా దాని ఉపకరణంగా మారకూడదన్న స్పష్టత అందరికీ ఉండాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.షష్ఠి రా.1.16 వరకు, తదుపరి సప్తమి నక్షత్రం చిత్త ప.1.10 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం సా.6.23 నుంచి 7.55 వరకు, దుర్ముహూర్తం ఉ.8.48 నుంచి 9.33 వరకు, తదుపరి ప.12.37 నుంచి 1.22 వరకు అమృతఘడియలు... ఉ.7.09 నుంచి 8.35 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.58
రాహుకాలం : ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

బీసీ జనగణన ఎప్పుడు?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులాల అభివృద్ధికి విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు.. ఆర్థిక, రాజకీయ రంగాలలో అభివృద్ధికై అనేక స్కీములు అమలు జరుపుతున్నాయి. అలాగే రిజర్వేషన్లను గ్రూపులుగా వర్గీకరణ చేస్తున్నాయి. కానీ బీసీ జనాభాకు చెందిన లెక్కల వివరాలు లేకపోవడంతో రిజర్వేషన్ల శాతం నిర్ణయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పడుతున్నాయి. బీసీ జనాభా లెక్కలు లేని కారణంగానే సుప్రీంకోర్టు, హైకోర్టులు రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడాన్ని కొట్టి వేస్తున్నాయి. జనాభా లెక్కలు సమగ్రంగా లేనందువలన రిజర్వేషన్లను ఎంత శాతం నిర్ణయించాలనే అంశంపై మొదటినుంచి బీసీ కమిషన్లు ఇబ్బందులు పడుతున్నాయి. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి జనాభా గణనలో బీసీ కులాల వారీగా లెక్కలు తీసే విధంగా తగు ఆదేశాలు జారీ చేయవలసిన అవసరం ఉంది.

విశ్లేషణ

ఆర్. కృష్ణయ్య

భారత రాజ్యాంగం కులాల ప్రాతిపదికన ఎస్సీ/ఎస్టీ/బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక, అభివృద్ధి పథకాలు పెట్టాలని నిర్దేశించింది. ఇందులో భాగంగా ఎస్సీ/ఎస్టీ/మైనార్టీ సామాజిక వర్గాల పేరుమీద జనాభా గణన మొదటి నుంచి తీస్తున్నారు. అలాగే లింగ విభజన పేరుమీద మహిళా-పురుష జనాభా గణన ఉంది. కానీ బీసీ కులాల జనాభా వివరాలు కావాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నా, ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నా, హైకోర్టు-సుప్రీంకోర్టులు ఆదేశిస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఒక బీసీ కులాల కాలమ్ పెట్టడానికి ముందుకు రావడం లేదు. దీనిపై కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

కేంద్ర ప్రభుత్వం 2021లో భారతదేశ జనగణన చేపట్టడానికి విడుదల చేసిన నమూనా పట్టికలో వివరాల కోసం 32 కాలమ్స్ నమూనా పత్రం విడుదల చేశారు. కేంద్రప్రభుత్వం హోంశాఖ ద్వారా జారీ చేసిన నమూనా పత్రంలో ఎస్సీ/ఎస్టీల వివరాలు కాలం, అలాగే హిందూ, ముస్లిం, క్రిస్టియన్ తదితర మతాల వివరాలు ఇతర వివరాలకు సంబంధించిన కాలమ్స్ నమూనా పత్రాన్ని జారీ చేశారు. కానీ ఈ జనాభా లెక్కల పట్టికలో బీసీ కులాల వివరాలకు సంబంధించిన కాలమ్ పెట్టలేదు. బీసీ జనాభా లెక్కల వివరాలు సేకరించవలసిన ఆవశ్యకత ఉంది. విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల కేటాయింపు-పంచాయతీరాజ్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీసీ జనాభా లెక్కల వివరాలు అవసరం అవుతున్నాయి.

జనాభా లెక్కలు లేనందున సుప్రీంకోర్టు-హైకోర్టులు రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడాన్ని కొట్టి వేస్తున్నాయి. ఏయే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ లను బీసీలకు కేటాయించాలి, ఎంత శాతం కేటాయించాలనే విషయంలో బీసీ జనాభా లెక్కలు లేక, న్యాయపరమైన చట్టపరమైన కోర్టు కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను గ్రూపులుగా వర్గీకరించడానికి జస్టిస్ రోహిణి నేతృత్వంలో కమిటీని నియమించింది. బీసీ కులాలవారీగా జనాభా లెక్కలు లేకపోవడంతో ఈ కమిటీ వర్గీకరణ చేసి ఏయే గ్రూపుకు ఎంత శాతం రిజర్వేషన్లు నిర్ణయించాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

కేంద్ర ప్రభుత్వ స్పందన ఏమిటి?

1931లో అంటే 90 ఏళ్ల క్రితం బ్రిటిష్ ప్రభుత్వం కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించారు. ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం బీసీ జనాభా లెక్కలు తీయడానికి ఊగిసలాడుతూ వచ్చింది. బీసీ సంక్షేమ సంఘం అనేక వీధి పోరాటాలు న్యాయపోరాటాలు చేసిన తర్వాత స్పందించి 2010లో కులాల వారీ లెక్కలు తీయడానికి నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించింది. అయితే అప్పటికే జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభమైంది. దీనితో ప్రత్యేకంగా బీసీ జనాభా లెక్కలు తీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 8 వేల కోట్లు కేటాయించి కులాల వారీ జనాభా లెక్కల్ని ప్రత్యేకంగా తీశారు. ఈ లెక్కలతో సమగ్ర పట్టిక తయారు చేయడానికి మాజీ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌తో ఒక కమిటీ వేశారు. కానీ ఆ తర్వాత వాటి వివరాలు,

జనాభా సంఖ్య ఇంతవరకు ప్రకటించలేదు.

గతంలో అంటే 2010లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా బీసీ జనాభా కులాల వారిగా లెక్కలు తీయాలని భారతీయ జనతాపార్టీ పార్లమెంటులో డిమాండ్ చేసింది. బీజేపీ కోరినందుకే అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కులాల వారీగా లెక్కలు తీయాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉంది. కావున కులాలు వారీ లెక్కలు తీయవలసిన బాధ్యత అవసరం-ఆవశ్యకత ఉంది. పైగా దీనికి ప్రత్యేక బడ్జెట్ అవసరం లేదు. ఒక రూపాయి ఖర్చు లేకుండా జనాభా లెక్కలు వస్తాయి. 01.08.2018 నాడు అప్పటి హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో జరిపిన హోంశాఖ ఉన్నతస్థాయి సమావేశంలో జనాభా గణనలో బీసీ కులాల వారీగా లెక్కలు తీయాలని నిర్ణయం కూడా తీసుకున్నారు. కానీ రెండవ సారి ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే ఎందుకు మార్పు వచ్చింది?

జనాభా లెక్కలు తీస్తే తరాలుగా అణచివేతకు గురైన కులాలు తామే అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలిస్తే వారు తిరగబడి.. దేశవనరుల్లో, అధికారంలో తమ వాటా తమకు ఇవ్వాలని అడుగుతారేమోనని పాలకవర్గాలు భయపడుతున్నట్లు కనిపిస్తోంది. అంతే కాదు.. వేల సంవత్సరాలు తమ అగ్రకులాలకు సేవలు చేస్తున్న ఊడ్చేపని, స్కావెంజర్ పని, వంట చేసే పని, బట్టలుతికే వారు, హెయిర్ కటింగ్ చేసే వారు ఇలా ఇంటి పని, పొలం పనులు చేసే వారు దొరకరని భయపడి జనాభా లెక్కలు తీయడం లేదా!! అలాగే ఇన్ని రోజులు తమ కాళ్ళ కాడ పడి ఉన్న ఈ పేద కులాల వారికి అధికారంలో వాటా ఇస్తే వీరు కలెక్టర్, ఆఫీసర్, ఎమ్మెల్యే, మంత్రులయి తమ పక్కన కూర్చుంటారని భయమా!! అలాగే జనాభా లెక్కలు తేలితే విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్లు పెంచాలని అలాగే స్థానిక సంస్థల్లోనూ రిజర్వేషన్లు పెట్టాలని డిమాండ్ బలంగా ముందుకు వస్తుందని భయమా! భయపడవలసిన అవసరం లేదు. మీరు జనాభా లెక్కలలో కులాల వారీ లెక్కలు తీసినంత మాత్రాన ఈ కులాలు తమ డిమాండ్లను తెరమీదకి తీసుకురావు. ఇప్పటివరకు రిజర్వేషన్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో ఏమైనా అవలక్షణాలు దొర్లాయా?

రాజ్యాంగం రక్షణ సదుపాయాలు

రాజ్యాంగంలోని 15 (4) (5) మరియు 16 (4) (5) ప్రకారం బీసీ కులాలకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెట్టాలని స్పష్టంగా ఉంది. జనాభా లెక్కలు లేకుండా రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికన పెడతారు? రాజ్యాంగంలోని 243 డి-(6) 243-టి-6 ప్రకారం స్థానిక సంస్థలు బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఉంది. కానీ జనాభా లెక్కలు లేకుండా రిజర్వేషన్ల శాతం ఎలా నిర్ణయిస్తారు? రాజ్యాంగంలోని 339-బి-ప్రకారం జాతీయ బీసీ కమిషన్ ఏర్పాటు చేశారు. కానీ బీసీల సమగ్రాభివృద్ధికి ఏ సిఫార్సు చేయాలన్నా జనాభా లెక్కలు కావాలి. రాజ్యాంగం కల్పించిన సదుపాయాలు, రక్షణలు, రిజర్వేషన్ల కోసం జనాభా లెక్కలు అవసరం. రాజ్యాంగంలో బీసీ కులాల రక్షణకు, అభివృద్ధికి సంబంధించి అనేక ప్రోవిజన్స్-ఆర్టికల్స్ ఉన్నాయి. వాటిని అమలు చేయాలంటే బీసీ కులాల లెక్కలు కావాలి.

కోర్టు తీర్పు ప్రకారం లెక్క తీయాలి

రిజర్వేషన్లు ప్రవేశపెట్టినపుడు లేదా రిజర్వేషన్లు పెంచిన ప్రతి సందర్భంలో హైకోర్టు-సుప్రీంకోర్టులు జోక్యం చేసుకొని జనాభా లెక్కలు లేకుండా ఏ ప్రాతిపదికన రిజర్వేషన్లు పెడతారని లేదా పెంచుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. మండల్ కమిషన్ కేసు సందర్భంగా బీసీ రిజర్వేషన్లు పెట్టినప్పుడు జనాభా లెక్కలు లేకుండా ఏ ప్రాతిపదికన రిజర్వేషన్ల శాతం నిర్ణయిస్తారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశంలో ప్రతీ రాష్ట్రంలో నియమించిన ప్రతి కమిషన్ జనాభా లెక్కలు తీయాలని సిఫారసు చేసింది. కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అనేక రాష్ట్రాలు కులాల వారిగా జనాభా లెక్కలు తీశాయి. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కేటాయింపు కోసం, ఇతర రిజర్వేషన్ల కోసం ఇతర అవసరాల కోసం ఎప్పటికప్పుడు ఆయా రాష్ట్రాలు బీసీ జనాభా లెక్కలు తీశాయి. కానీ వీటికి చట్టబద్ధత లేదని కోర్టులు కొట్టివేశాయి.

ఈ దేశంలో అన్ని వర్గాల వివరాలను జనాభా గణన ద్వారా సేకరిస్తున్నారు. చివరకు పులులు-జంతువుల వివరాలు కూడా ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. కానీ బీసీ కులాల వారిగా జనాభా లేకపోవడం అన్యాయం. బీసీ జనాభా లెక్కలు సేకరిస్తే జరిగే నష్టం ఏమిటి? అనే ప్రశ్నకు జవాబు లేదు. కేవలం ఊహాజనితంగా కులాల వారి లెక్కలు తీయడం వలన కులతత్వం పెరుగుతుందని పసలేని విమర్శలు చేస్తుంటారు. ఇది ఊహమాత్రమే; ఎందుకంటే మతాల లెక్కలు తీస్తున్నారు. మతతత్వం పెరుగుతుందా!

అలాగే ఎస్సీ/ఎస్టీ కులాల వారి లెక్కలు తీయడం లేదా? ఏమైనా కులతత్వం పెరిగిందా? ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు, రిజర్వేషన్లకు, పరిపాలన సౌకర్యంకోసం కులాల వారీ లెక్కలు ఉపయోగపడుతాయి. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి జనాభా గణనలో బీసీ కులాల వారి లెక్కలు తీసే విధంగా తగు ఆదేశాలు జారీ చేయవలసిన అవసరం ఉంది. జనాభా గణన కాలమ్స్‌లో ఒక కాలమ్ పెరుగుతుంది. ఒక పైసా అదనంగా ఖర్చు కాదు. పైగా ప్రభుత్వానికి చట్టపరమైన, పాలనాపరమైన, అభివృద్ధి - సంక్షేమ కార్యక్రమాలకు అన్ని విధాలుగా ఉపయోగపడుతుంది. కావున వెంటనే ప్రభుత్వం వారు స్పందించి కులాల వారి కాలమ్ చేర్చాలని ప్రజలు-అన్ని పార్టీలు కోరుతున్నాయి.

వ్యాసకర్త అధ్యక్షులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆహుతి



"అహ్మదాబాద్ వెళ్లే రైలులోని ఒక కోచ్‌లో కొంతమంది హిందువులు సత్సంగ్ చేసుకుంటూ, పక్కనే ఉన్న నలుగురు ముస్లింలు ప్రార్థనలు జరుపుకుంటూ, ఇంకో పక్కన ఇద్దరు నర్సులు బైబిల్ చదువుతూ కనిపించిన దృశ్యమంతా కలిపి ఒక ఫొటోగా తీయదగినదనీ, భారతీయ జనతా పార్టీని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అంటున్నారు. కానీ, బీజేపీ అధికారంలో ఉంది కాబట్టే ఎవరి ప్రార్థనలు వారు చేసుకుంటూ... అందరూ కలిసి అలా ఐకమత్యంగా ప్రయాణం చేయగలుగుతున్నారు. అదే కాంగ్రెస్ పాలనలో అయితే ఈపాటికి ఆ రైలు తగలబడిపోయేది"

- వివేక్ అగ్నిహోత్రి, ఫిల్మ్ మేకర్

కృత్రిమం

"ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించడంపై మీడియా హడావుడి కృత్రిమమైనది. ఐదేళ్ల క్రితం నరేంద్ర మోదీ ప్రధాని బాధ్యతలు స్వీకరించిన కొత్తలో ఆ పార్టీ ఇంతకంటే ఎక్కువ స్థానాలు, ఓట్ల శాతంతో పెద్ద విజయమే సాధించింది. ఆర్థిక వ్యవస్థ పతనమైన ప్రస్తుత తరుణంలో ఆప్ సాధించిన విజయం అంతగా గొప్పదేం కాదు"

- సుబ్రమణ్య స్వామి, బీజేపీ నేత

చట్టం

"ఉత్తరప్రదేశ్‌లో ఏమాత్రమైనా చట్టం అమలు అవుతోందా? ఈ నెల పదో తేదీన అలీగఢ్ కోర్టు డాక్టర్ కఫీల్ ఖాన్‌కు బెయిల్ మంజూరు చేసింది. అయినా, ఇప్పటి వరకు అతడిని విడుదల చేయలేదు. గోరఖ్‌పూర్‌లోని బిఆర్డీ ఆసుపత్రిలో పసిపిల్లల మరణాలను అడ్డుకుని, యూపీ ప్రభుత్వ తీరును బయటపెట్టినందుకు ఇంకా ఆయనపై ప్రభుత్వం కక్షసాధిస్తూనే ఉంది "

- ఉమర్ ఖలీద్, విద్యార్థి నేత

రెండోసారి

"షహీన్‌బాగ్ నిరసనకారులతో మాట్లాడటానికి ప్రభుత్వం రెండోసారి ప్రయత్నం చేస్తోంది. నిర్మాణాత్మక చర్చలకు వారిని న్యాయశాఖమంత్రి ఆహ్వానించిన తరువాత, తనను సంప్రదిస్తే మూడు రోజుల్లో వారికి అపాయింట్‌మెంట్ ఇస్తానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ శాంతి ప్రతిపాదనను నిరసనకారులు అంగీకరిస్తారా?"

- మర్యా షకీల్, జర్నలిస్ట్

వాదన

"క్రికెట్ బుకీ సంజీవ్ చావ్లా కస్టడీ విషయంలో ఢిల్లీ పోలీసుల తరఫున ఎవరు ప్రాతినిధ్యం వహించాలనే అంశంపై ఇద్దరు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు వాదులాడుకున్నారు. ఇద్దరు కూడా తమనే అందుకు నియమించారని వాదించారు. ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరొకరితో 'బయటికి పద, డైరెక్టర్‌తో మాట్లాడదాం'అని సవాల్ చేశారు"

- నళిని, జర్నలిస్ట్

సంతృప్తి

"ఢిల్లీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి లభించిన ఎనిమిది స్థానాలతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంతృప్తిగానే ఉన్నట్టు కనిపిస్తున్నారు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీకి సున్నా స్థానాలు వచ్చాయి కదా"

- క్రిషన్ ప్రతాప్ సింగ్, రచయిత

ఇన్‌బాక్స్

అమరుల త్యాగానికి ఏడాది

దేశంలోని ప్రజలు ఈరోజు సురక్షితంగా సంతోషంగా ఉంటున్నారంటే దానికి కారణం దేశ సరిహద్దుల్లో ఈ దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నటువంటి ఆర్మీ జవానే, సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజు (14-02-2019) దేశం మొత్తం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జమ్మూకశ్మీర్ పుల్వామా జిల్లాలో ఆర్మీ జవాన్ల వాహనశ్రేణిపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 60 మంది భారతీయ సైనికులు చనిపోయారు. దేశం మొత్తం తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన విధంగా బాధను వ్యక్తం చేశారు. ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలి అని దేశం మొత్తం ఒక్కటై నినదించింది. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై చర్యలు తీసుకుంటూనే పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్ రూపంలో తగిన గుణపాఠం చెప్పింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 72 ఏళ్లు అయినా ఇతర దేశాలతో పోల్చుకుంటే రక్షణ రంగంలో మనం చాలా వెనకబడి ఉన్నాం. పుల్వామా దాడి ముమ్మాటికీ నిఘా వైఫల్యమే. అందుకే మనం 60 మంది జవాన్ల ప్రాణాల్ని కోల్పోయాం. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం రఫేల్ యుద్ధ విమానాలను దిగుమతి చేసుకోవడం, ఆర్మీ జవాన్లకు రక్షణ కవచాలను అందించడం, బుల్లెట్ ప్రూఫ్ హెల్మెట్ అందించడం, అమరవీరుల స్మారక చిహ్నాలను ఏర్పాటు చేయడం, సరిహద్దులో దారులను పటిష్టం చేయడం లాంటి చర్యలు స్వాగతించదగ్గ అంశాలు అయినప్పటికీ ఇంకా రక్షణ రంగాన్ని ఆధునీకరించవలసిన అవసరం ఉంది. ఆర్మీ జవాన్ల ప్రాణాలు పోకుండా భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం నిఘా వ్యవస్థను పటిష్టం చేయడం, అధునాతన ఆయుధాలు అందించాలి. నేడు దేశంలోని యువత రాజకీయ నాయకుల ప్రోత్సాహంతో మన ఆర్మీపై, పోలీసులపై రాళ్లు వేసే పరిస్థితి వచ్చింది. ఇది మంచిది కాదు. అమరవీరుల త్యాగాలు ఆదర్శంగా దేశ సేవకై అంకితం అయినప్పుడే మనం పుల్వామా అమరులకు ఘన నివాళి అర్పించిన వాళ్ళం అవుతాం.

(పుల్వామా జిల్లాలో ఆర్మీ జవాన్ల కాన్వాయ్‌పై ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాది)

- చింత ఎల్లస్వామి, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి(పూర్వ)

రాజ ద్రోహమా? రాజ్యాంగ ద్రోహమా?

విశ్లేషణ

మాడభూషి శ్రీధర్

మాకు జీతాలు పెంచండి అని అడిగారు ఇద్దరు కర్ణాటక పోలీసులు. కర్నాటక రాష్ట్రంలో అఖిల కర్ణాటక పోలీసు మహాసంఘ నాయకుడు శశిధర్ గోపాల్ పైన, కోలార్ కానిస్టేబుల్ బసవరాజ్ పైన 124ఎ కింద జూన్ 4, 2016న రాజద్రోహం కేసులను నమోదు చేశారు. ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేసింది. ఇటువంటి పాలకులుంటే భారత్ ముక్కలవుతుంది అని నినాదాలు చేసినందుకు కన్హయ్యా కుమార్ మీద రాజద్రోహం కేసు పెట్టారు. క్రికెట్ మ్యాచ్ నడుస్తూ ఉంటే పాకిస్తాన్ జట్టుకు మద్దతుగా మాట్లాడినందుకు రాజద్రోహం కేసును వాడారు. పాకిస్తాన్ క్రికెట్ క్రీడాకారుడిని పెళ్లాడిన భారతీయ మహిళపై రాజద్రోహం కేసు పెట్టనందుకు సంతోషించాలి.

2020 ఫిబ్రవరి 6న ఉత్తరప్రదేశ్‌లోని అజంఘర్‌లో పౌరసత్వ చట్టం సవరణ సీఏఏను విమర్శించినందుకు 135 మంది మీద రాజద్రోహం కేసులుపెట్టారు. 20 మందిని అరెస్టు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న 35 మంది మీద, ఎవరో తెలియని 100 మంది మీద ఈ క్రిమినల్ కేసులుపెట్టడం విచిత్రం. రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు అనుసరించడం, భారత రాజ్యాంగ విలువలను తిలోదకాలిచ్చే చట్టాలు చేయడం, భారత ప్రజాస్వామ్య మౌలిక లక్షణాలను భంగపరిచే చట్టాలు తేవడాన్ని విమర్శిస్తే రాజ్య ద్రోహమంటున్నారు. రాజ్యాంగానికి ద్రోహం చేయడం రాజ ద్రోహ

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం
14-2-2020

వాలెంటైన్స్ డే స్పెషల్

వద్దన్న పాట

● మాధవ్ శింగరాజు

కొంచెం టైముందా! లేక.. 'గాట్టా బి ఫ్రెష్. గాట్టా గో డౌన్‌స్టెయిర్స్.. ఇట్స్ ఫ్రైడే..' మూడ్‌లో ఉన్నారా.. బెడ్రూమ్‌లోంచి దిగెళ్లి పళ్లు తోముకుని.. ఇంత తిని.. శుక్రవారపు సోమరి పరిమళాలను అందుకుని కిటికీలోంచి గాల్లో తేలిపోడానికి! ఇట్స్ వాలెంటైన్స్ డే కూడా కదా. ఎవరికీ అందకండి. ఇది మీ లైఫ్. శుక్ర-శని-ఆది.. మీదే లైఫ్. తర్వాతెలాగూ మీ లైఫ్ మీ బాస్‌ది. మీ లైఫ్ మీ ప్రిన్సిపాల్‌ది. మీ లైఫ్ మీ హెడ్‌మాస్టర్‌ది.

ఒక్కమాట. వెళ్తూవెళ్తూనైనా యూట్యూబ్‌లో రెబెక్కా బ్లాక్ - ఫ్రైడే అని కొట్టి చూడండి. పదమూడేళ్ల అమ్మాయి తొమ్మిదేళ్ల క్రితం పాడిన వీడియో సాంగ్ అది. ఆమెను స్మరించుకుంటూ ప్రేమికుల రోజున ఈ పాటను చూడమని కాదు. ఆమె నిక్షేపంగా ఉన్నారు తన ఇరవై రెండేళ్ల వయసులో. రెబెక్కా బ్లాక్ తన పేరు. 'ఫ్రైడే' ఆ పాట పేరు. 3 నిముషాల 47 సెకన్లు ఉంటుంది. వాలెంటైన్స్ డే రోజు అంత టైమ్‌ని వృథా చెయ్యడం అన్యాయమే. బయట గులాబీ పూలకాడలు అయిపోయాయంటే.. వట్టి చేతుల్తో వెళ్లి ఐలవ్యూకి ముందు సారీ చెప్పాల్సి వస్తుంది. సారీ కూడా ప్రేమ సిలబస్‌లో ఒక చాప్టరే. అలాగని బుంగమూతిని తెరిపించే పూలగుత్తేమీ కాదు కదా 'సారీ'. వీడియో చూడకున్నా పర్లేదు. పైపై డీటెయిల్స్ చూడండి. పది లక్షలా పది వేల లైక్‌లు కనిపిస్తాయి. పక్కనే చూడండి. ముప్పై లక్షల అరవై వేల డిస్‌లైక్‌లు ఉంటాయి! రేటింగ్ చూడండి. 'నో మెచ్యూర్ కంటెంట్' అని ఉంటుంది. ఇక పాట చూడ్డానికే ముంటుంది! చూసినా ఏం ఉంటుంది?

●●●

'7 ఎ.ఎం. వేకింగ్ అప్ ఇన్ ది మార్నింగ్ గాట్టా బి ఫ్రెష్.. గాట్టా గో డౌన్ స్టెయిర్స్.. గాట్టా గెట్ డౌన్ టు ద బస్ స్టాప్.. గాట్టా క్యాచ్ మై బస్.. ఐ సీ మై ఫ్రెండ్స్..' పాటంతా ఇదే తొందర. ఫ్రెండ్స్‌తో కలిసి పార్టీ చేసుకోవాలన్న ఓ పదమూడేళ్ల అమ్మాయి తొందర.. రెబెక్కా బ్లాక్ 'ఫ్రైడే' సాంగ్ థీమ్.

జీవితాన్ని ప్రేమిస్తే జీవితం మన చుట్టూ తిరుగుతుంది. వ్యక్తిని ప్రేమిస్తే ఆ వ్యక్తి చుట్టూ మనం తిరగాల్సి వస్తుంది. రెబెక్కా బ్లాక్.. జీవితాన్ని ప్రేమించింది. ప్రేమించి ఊరుకోలేదు. పాటతో ఆ ప్రేమను చూపించింది. ఎవరికీ అర్థం కాలేదు. ఇదేం పాట అన్నారు! ఇది పాటా అన్నారు.

పాటలో కీట్స్ లేదు. షెల్లీ లేదు. బైరన్ లేదు. కనీసం కుర్రవృద్ధుడు జస్టిన్ బీబర్ లేదు.

అసలు పొయెట్రీనే లేదు. శుక్రవారం రాగానే లేవడం, పార్టీలకు పరుగెత్తడం. ఏముంది ఇందులో? లోకం నిక్కచ్చి మాస్టారు. పదమూడేళ్ల పిల్లయినా గెలిచే తీరాలంటుంది. గెలవలేకపోతే 'ఈ లోకంలోకి ఎందుకొచ్చావ్?' అని అడుగుతుంది.

పాడింది మాత్రమే రెబెక్కా. తన ఫీలింగ్స్‌ని వేరెవరికో చెప్పి తనకు కావలసినట్లు పాటను రాయించుకుంది. ప్రపంచంలోని ఒక్క లిరిక్ లవర్‌కి కూడా ఈ పాట నచ్చలేదు. పూర్ గర్ల్ అన్నారు. 'ఎస్టర్‌డే వాజ్ థర్స్‌డే.. టుడే ఈజ్ ఫ్రైడే.. టుమారో ఈజ్ శాటర్ డే' అని పాడుతుంది రెబెక్కా... పాటలో ఓ చోట. 'డే ఆఫ్టర్ టుమారో సండే కదా.. హహహా.. ఈ పిల్లలో విషయం లేదు. కనిగా ఏదో అవ్వాలనుకుని లోకం మీద విసురుగా పడింది' అని కామెంట్స్. సిస్టమ్‌ని షట్ డౌన్ చేసేస్తే ఈ కామెంట్స్ అన్ని మాయమౌతాయి. కానీ స్కూల్ మాయమౌతుందా? సెలవులొచ్చే వరకు ఆన్‌లోనే ఉంటుంది. సెలవులయ్యాక మళ్లీ స్కూల్.

ప్రస్తుతం రెబెక్కా బ్లాక్

తొమ్మిది ఏళ్ల నాటి తన 'ఫ్రైడే' వీడియో పాటలో రెబెక్కా బ్లాక్

పదమూడేళ్ల వయసులో రెబెక్కా బ్లాక్ పాడిన 'ఫ్రైడే' అనే పాటను ప్రపంచం తిరస్కరించింది! పాపం చిన్న పిల్ల కదా అని సరిపెట్టుకోకుండా ఛీ కొట్టింది. నీ ముఖం అంది. 'బి వరస్ట్ సాంగ్ ఎవర్' గా ఆ పాట లోక'ప్రసిద్ధి' చెందింది. రెబెక్కా ఆడి, పాడిన ఆ సింగిల్ సాంగ్ వీడియో పుట్టి తొమ్మిదేళ్లు. తొమ్మిదేళ్లుగా లోకం తిడుతున్న తిట్లను భరిస్తూనే జీవితాన్ని ప్రేమించడం నేర్చుకుంది రెబెక్కా. తిరస్కారాల నుంచే తనను తనను మలుచుకుంది. వద్దన్న పాట నుంచే భవిష్యత్తుకు కొత్త స్వరాలను సమకూర్చుకుంది. ప్రేమ దక్కని వాళ్లు చేయవలసిన పని ఇదే. జీవితానికి దగ్గరవడం.

టీనేజ్ దాటుతుండగా రెబెక్కా ఓ రోజు అద్దంలో తనని తను పరిశీలనగా చూసుకుంది. ఏడ్చినట్లుంది. తనేం ఏడ్వడం లేదు. కానీ ఏడ్చినట్లే ఉంది! కన్నీళ్లొస్తే చేతులతో తుడుచుకుంటాం. ఏడుపే రాకుండా కన్నీళ్లు కనిపిస్తుంటే.. తుడుచుకోవలసింది కళ్లను కాదు. కళ్లు మూసినా, కళ్లు తెరిచినా తనను ఏడిపిస్తున్న లోకాన్ని! అవును.. లోకాన్ని తన కళ్ల ముందు నుంచి తుడిచేయాలి. కళ్లు మూసుకుంది రెబెక్కా. రెప్పల మాటున అంతవరకు ఉంటూ వచ్చిన అవమానాలన్నీ ఒకటొకటిగా అదృశ్యం అయిపోవడం మొదలైంది. చివరికొక రూపం మిగిలింది. ఆ రూపం రెబెక్కాదే. రెబెక్కా అందంగా ఉంది. ఆత్మవిశ్వాసంతో ఉంది. ఒక కొత్త పాట కోసం తనని తను ట్యూన్ చేసుకుంటోంది!

ఈ ఫిబ్రవరి 10 కి రెబెక్కా పాట 'ఫ్రైడే'.. పదవ సంవత్సరంలోకి ప్రవేశించింది. దీనిపై ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్న పోస్ట్ పెట్టింది రెబెక్కా. 'మీరేమిటన్నది మీ గురించి మీకేం తెలుసో అదే కానీ.. మీ గురించి ఎవరేమనుకుంటున్నారో అది కాదు మీరు' అని. ఇంకా చాలా రాసింది. వాలెంటైన్స్ డే సెలబ్రేషన్స్ అయ్యాక.. ఈ సాయంత్రం రిలాక్స్‌డ్‌గా ఉన్నప్పుడు ఆ పోస్ట్‌ను చదవండి. మీరు జీవితాన్ని ప్రేమిస్తున్నారో, వ్యక్తిని ప్రేమిస్తున్నారో మీ కనురెప్పల లోపలి స్క్రీన్‌పై కనిపిస్తుంది. తర్వాత మీరు.. రెబెక్కా ఇన్నేళ్లలోనూ సొంతంగా, ఎవరి సహాయమూ లేకుండా చేసిన మిగతా సింగిల్స్‌ని (సింగిల్ సాంగ్స్) కూడా వెతకడం మొదలు పెడతారు.

ఆమెదే కొద్దిగా ఫిల్మోగ్రఫీ ఉంది. డిస్కోగ్రఫీ ఉంది. అన్నీ తనకు తానుగా చేసుకున్నవే. జీవితాన్ని ప్రేమించేవారు ఏదైనా సొంతంగా చేసుకోగలరు. దేన్నయినా సొంతంగా సాధించగలరు. మన జీవితమే మనకు వాలంటైన్.

ఫ్లవర్ అరేంజ్‌మెంట్

ఆతిథ్య పరిమళాలు

పూలు మాట్లాడతాయి! అవును. ఇంటికి వచ్చిన అతిథిని మనకంటే ముందు మన ఇంట్లోని ఫ్లవర్ వేజ్‌లు పలకరిస్తాయి. అందులో ఉన్నవి తాజా పూలైతే ఆ వచ్చినవారి దృష్టి మొదట వాటి మీదకే మళ్లుతుంది. మనతో వారి సంభాషణా ఆహ్లాదకరంగా సాగుతుంది. మనకు అందుబాటులో ఉన్న పూలతో ఇంట్లోనే సింపుల్‌గా, కళాత్మకంగా ఫ్లవర్ వేజ్‌ను అలకరించడం ఎలాగో చూద్దాం.

వైట్ ఫ్లవర్ పాట్

రౌండ్ బాటిల్ తీసుకుని అందులో పావు వంతు నీటిని పోయాలి. ఆ నీటిలో నదుల్లో దొరికే నున్నని రాళ్లను అందంగా పేర్చాలి.

ఇప్పుడు పొడవు కాడలున్న తెల్లటి పూలను, కొన్ని కాడలను అమర్చుకోవాలి.

- కాడలను రాళ్ల మధ్య గుచ్చినట్లు అమర్చినట్లయితే ఫ్లవర్ సెట్టింగ్ కదలకుండా ఉంటుంది.
- పూల కాడలు ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌కు కావలసినంత పొడవు లేకుంటే సన్నని ఇనుప తీగె తీసుకుని దానికి పువ్వు లేని కాడను గుచ్చి ఆ పైన పూవును గుచ్చితే సరి. కాడలు కావలసినంత పొడవులేకున్నా ఇదే పద్ధతి. రెండు కాడలను ఒక తీగెకు గుచ్చాలి.
- గది గోడలు, ఫర్నిచర్ ఏ రంగులో ఉన్నప్పటికీ తెల్లని పూలు చక్కగా, స్వచ్ఛతకు ప్రతిబింబంగా ఉంటాయి. లిల్లీ పూలతో కూడా ఇలా అరేంజ్ చేసుకోవచ్చు.

ఫ్లోరల్ మిక్స్ డెకరేషన్

రౌండ్ బాటిల్ తీసుకుని అందులో గులాబీల తోపాటు రకరకాల పూలను, ఆకులను క్రమపద్ధతిలో అలంకరించడమే ఫ్లోరల్ మిక్స్ డెకరేషన్. బాటిల్‌లో పావు వంతు నీటిని పోసి రంగురంగుల రాళ్లను కాని గోళీలను కాని వేయాలి. వీటిని అమర్చడంలోనూ సృజనాత్మకత ఉట్టిపడాలి. ఎన్ని రంగులవి వాడుతున్నామో, అవన్నీ స్పష్టంగా కనిపించే విధంగానూ, వాటిని అమర్చడంలో ఆకర్షణీయమైన ఆకృతి రూపుదిద్దుకునేటట్లు చూడాలి. పువ్వులను కూడా తీసుకున్న రంగులను బట్టి పక్కపక్కన ఒకే షేడ్ రాకుండా జాగ్రత్తపడాలి. పెద్ద పూలను బాటిల్ మూతికి దగ్గరగా వచ్చేటట్లు, చిన్నవిగా, సన్నగా ఉండే పూలను అవసరమైతే వాటి కాడకు ఏదైనా సపోర్టు పెట్టి పైకి కనిపించేటట్లు (ఫొటోలో ఉన్న విధంగా) పెట్టాలి. పెద్ద పూల మధ్య దూరిస్తే అవి కనిపించవు.

దీనిని ఇంట్లో, ఆఫీసులో ఎక్కడ పెట్టినా ఆ గది మరింత ఆకర్షణీయంగానూ, హుందాగానూ కనిపిస్తుంది. టీ పాయ్ మీద, షెల్ఫ్‌లో, రూమ్ కార్నర్‌లో చిన్న టేబుల్ మీద లేదా కార్నర్ స్టాండ్ మీద పెట్టుకోవచ్చు.

సింపుల్ ఫ్లవర్ పాట్

ఈ ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌కు ఇలాంటి గాజు గ్లాసు, పెరట్లో పూసిన ఏ రకమైనా సరే ఒక పువ్వు ఉంటే చాలు.

గ్లాసులో పాతిక వంతు వరకు నీటితో నింపాలి. పువ్వుకు కాడ పొడవుగా ఉంటే సరి, లేకుంటే సన్నని తీగెకు ఒక కాడను గుచ్చి దాని మీద పువ్వును గుచ్చాలి. క్రోటన్(లావుపాటి కాండం ఉన్న) మొక్క స్టెమ్‌ను కత్తిరించి గ్లాసులో అడుగున బేస్ కోసం ఏర్పాటు చేసుకోవాలి. పువ్వును గుచ్చిన తీగెను ఈ స్టెమ్‌కు గుచ్చాలి. ఎల్లో గులాబీ స్నేహానికి చిహ్నం. కాబట్టి స్నేహితులను ఇంటికి ఆహ్వానించినప్పుడు డ్రాయింగ్ రూమ్‌లో ఎల్లో గులాబీ కనిపిస్తే సందర్భోచితంగా ఉంటుంది.

స్టెమ్ కట్ రెడ్‌రోజ్

ఈ రకమైన ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌ను చూడగానే నాజూకుదనం నడిచివచ్చినట్లుంటుంది. ఆఫీస్ రూం, సిట్టింగ్ రూం, బెడ్‌రూం, పిల్లల స్టడీ రూం... ఎక్కడైనా ఇది చక్కగా సూటవుతుంది. సన్నగా పొడవుగా ఉన్న ఫ్లవర్‌వాజ్‌లో ముప్పావు వంతు నీటిని నింపాలి (నీరు తక్కువైతే అడుగు తేలికగా ఉండి పూల బరువుకు వాలిపోయే ప్రమాదం ఉంది). తాజా గులాబీలను కాడ, ఆకులతో సహా కోసి ఫొటోలో ఉన్న విధంగా అమర్చుకోవాలి. పూల కాడలన్నీ నీటిలో మునిగేటట్లు చూసుకోవాలి. వేర్వేరు రంగుల పూలు వాడేటప్పుడు ఒకదానికొకటి కాంట్రాస్ట్‌గా ఉంటే ఫ్లవర్ అరేంజ్‌మెంట్ అందంగా ఉంటుంది.

కొన్ని గులాబీలు... పువ్వు చూడడానికి అందంగా ఉన్నప్పటికీ వాటి కాడ పొడవుండదు. అలాంటప్పుడు విడిగా కాడను కోసి మంచి పువ్వుకు అమర్చి సెలోఫెన్ టేపుతో అతికించుకోవచ్చు. ఇలా చేసినప్పుడు పువ్వుకు కాడ ద్వారా నీరు అందక త్వరగా వాడిపోతుంది కాబట్టి ఉదయం, సాయంత్రం పువ్వు మీద నీళ్లు చిలకరించాలి.

– మంజీర

రెండు విషయాలు

స్టెల్లా మేడమ్

న్యూజిలాండ్ ప్రభుత్వం కృత్రిమ మేధస్సు గల మహిళా ఆఫీసర్‌ను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి తీసుకురాబోతోంది. ఆమె పేరు స్టెల్లా. స్టేషన్‌కు వచ్చిన వాళ్లకు చక్కటి చిరునవ్వుతో స్వాగతం పలుకుతుంది స్టెల్లా. వాళ్లు అడిగిన ప్రశ్నలకు బదులిస్తుంది. మార్దవంగా, ఆహ్లాదకరంగా మాట్లాడుతుంది. సహాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వాళ్లకు ఒకరు చెప్తే తప్ప అప్పటి వరకు తాము మాట్లాడింది మనిషితో కాదని తెలియనంతగా అచ్చం మనిషిలానే ఉంటుంది. ఇరవై ఆరు వేర్వేరు రూపాల మిశ్రమ స్వరూపం స్టెల్లా. ఆ స్వరూపానికి మొదట ఎల్లా అని నామకరణం చేశారు. ఎల్లా అంటే.. ఎలక్ట్రానిక్ లైఫ్-లైక్ అసిస్టెంట్ అని. పోలీసు స్టేషన్‌లలో ఉంచడం కోసం సృష్టించుకున్నారు కనుక స్టేషనరీ అనే పదాన్ని జోడించుకుని స్టెల్లా అని పేరు పెట్టుకున్నారు. స్టేషన్‌కు వచ్చిన వాళ్లు సాధారణంగా అడిగే ప్రశ్నలు స్టెల్లాలో ఫీడ్ అయి ఉంటాయి. వాటికి సమాధానాలను చెబుతుంది స్టెల్లా. నేరాన్ని రిపోర్టు చేసినప్పుడు ఆ సమాచారం రికార్డు అవుతుంది. స్టెల్లా లోపల సీసీటీవీ మానిటరింగ్, అలారం కూడా ఉంటాయి. ఈ నెల 17వ తేదీ నుంచి న్యూజిలాండ్‌లోని విల్లింగ్టన్, జాన్సోవిల్లె, ఫెదర్‌స్టన్ పోలీస్ స్టేషన్‌లలో స్టెల్లా దర్శనం ఇస్తుంది. కృత్రిమ మేధ ప్రయోగాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఈ మూడు పోలీస్ స్టేషన్‌లలో పరిచయం చేస్తున్నారు. ఈ సర్వీస్‌ను ప్రజలు స్వీకరిస్తే దేశమంతటా విస్తరించే ఆలోచనలో ఉంది న్యూజిలాండ్. అన్నట్లు.. కృత్రిమ మేధతో పని చేసే తొలి ఏవన్ గ్రేడ్ ఆఫీసర్ స్టెల్లా.


స్టెల్లా : కృత్రిమ మేధస్సుతో న్యూజిలాండ్ సృష్టించిన పోలీస్ ఆఫీసర్

న్యూస్ యాంకర్ శ్రీజ

బ్రేకింగ్ న్యూస్

ఈమె పేరు శ్రీజ. కేరళ న్యూస్ ఛానెల్ 'మాతృభూమిలో' చీఫ్ సబ్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. న్యూస్ ప్రజెంటర్ కూడా. వార్తల స్వభావాన్ని బట్టి గొంతులో భావాలను పలికిస్తూ మాట్లాడ్డం శ్రీజ ప్రత్యేకత. న్యూస్ యాంకర్‌గా ఆమెకు ఎంతోమంది అభిమానులు కూడా ఉన్నారు. ఎప్పటిలా ఆమె బుధవారం కూడా న్యూస్ యాంకరింగ్ చేస్తున్నారు. మధ్యలో బ్రేకింగ్ న్యూస్ వచ్చింది. అదే ఫ్లోలో ఆ న్యూస్‌ని కూడా ఆమె చదవాలి. అయితే చదవలేకపోయారు శ్రీజ. కొద్ది క్షణాలు ఫ్లో ఆగిపోయింది. కేరళ ప్రభుత్వం బెస్ట్ జర్నలిస్ట్‌గా శ్రీజకు అవార్డు ప్రకటించిన వార్త అది. అది చూసి శ్రీజ ఉద్వేగానికి లోనయ్యారు. వెంటనే తేరుకుని తనపై వచ్చిన ఆ వార్తనూ చదవగలిగారు కానీ, అప్పటికే ఆమె 'చదవలేకపోవడం' వైరల్ అయింది. శ్రీజ వార్తలు చదవడమే కాదు.. చదవలేకపోవడం కూడా ఆమె ఫ్యాన్స్‌ని ఆకట్టుకున్నట్లుంది.

చెట్టు నీడ

కృష్ణ విందా

మిత్రవింద కృష్ణునికి సాక్షాత్తు మేనత్త కూతురు. ఆమె తండ్రి జయసేనుడు అవంతీ రాజ్యానికి అధిపతి. మిత్రవిందకి చిన్నప్పటి నుంచి శ్రీ కృష్ణుడంటే చాలా అభిమానం. వయసుతో పాటుగా ఆ అభిమానం ప్రేమగా మారింది. కృష్ణునికి కూడా ఆమెంటే ఇష్టమే! కానీ ఆమె సోదరులైన విందు, అనువిందులకు మాత్రం కృష్ణుడంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. తమ సోదరిని ఎలాగైనా దుర్యోధనునికి ఇచ్చి కట్టబెట్టేందుకు మిత్రవింద సోదరులు ఒక ఉపాయం పన్నారు. యుక్తవయసుకి వచ్చిన మిత్రవిందకి రాచరికపు సంప్రదాయం ప్రకారం స్వయంవరాన్ని ఏర్పాటు చేశారు. కృష్ణుడిని పిలవలేదు. కృష్ణుడు లేని ఆ స్వయంవరంలో మిత్రవింద గత్యంతరం లేక దుర్యోధనుడినే వరిస్తుందని వాళ్ల వ్యూహం. మిత్రవిందకు స్వయంవరం జరుగుతున్న విషయం బలరామునికి తెలిసింది. వెంటనే కృష్ణునికి విషయాన్ని చేరవేశాడు. కృష్ణుడు వెంటనే అవంతీ రాజ్యానికి బయల్దేరాడు. అవంతికి చేరుకున్నాడన్నమాటే కానీ, ఆయన మనసులో చిన్న శంక మెదలసాగింది. మిత్రవింద తనను ప్రేమిస్తున్న విషయం ఎప్పుడూ బాహాటంగా చెప్పలేదు. ఒకవేళ ఆమె మనసులో కనుక తాను లేకపోతే, ఆమెను బలవంతంగా దక్కించుకున్నట్లు అవుతుంది. అందుకని ఆమె మనసును తెలుసుకునేందుకు తన సోదరి సుభద్ర సాయం కోరాడు. అక్కడ మిత్రవిందతో మాటలు కలిపిన సుభద్ర, ఆమె మనసులో కృష్ణునికి తప్ప మరొకరికి చోటు లేదని తెలుసుకుంది. ఆ మాటతో కృష్ణుడు అడుగు ముందుకేశాడు. స్వయంవరంలో అందరూ చూస్తుండగానే కృష్ణుడు, మిత్రవిందను తీసుకువెళ్లేందుకు సిద్ధపడ్డాడు. ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్న మిత్రవింద సోదరులు ఇద్దరూ కృష్ణుని చేతిలో చిత్తుగా ఓడిపోయారు. అలా కృష్ణుడు మిత్రవిందను ద్వారకకు తీసుకువచ్చి, శాస్త్రోక్తంగా వివాహం చేసుకున్నాడు. మిత్రవింద, కృష్ణుల ప్రేమకథ ఇది.

ప్రశ్న జవాబు

వాలంటైన్స్ డే

హృదయాలు రెండైనా.. స్పందనలు ఒకటే

♥ 'వాలంటైన్స్ డే' రోజు ఎవరైనా ఎవరికైనా 'ఐ లవ్ యూ' చెప్పొచ్చా?

చెప్పకూడదు. అది ప్రేమికుల రోజు. ప్రేమలో ఉన్నవారు మాత్రమే ఒకరికొకరు 'ఐ లవ్ యూ' చెప్పుకునే రోజు.

♥ ఒక అబ్బాయి ఒక అమ్మాయికి లేదా ఒక అమ్మాయి ఒక అబ్బాయికి తొలిసారి 'ఐ లవ్యూ' చెప్పడానికి వాలంటైన్స్ డే ఒక మంచి సందర్భం అవుతుందా?

ప్రేమను సున్నితంగా వ్యక్తం చేయగలిగి, తిరస్కారాన్ని బాధపడకుండా స్వీకరించగలిగే వారు 365 రోజుల్లో ఏ రోజైనా తమ మనసులోని మాట చెప్పవచ్చు. వాలంటైన్స్ డే రోజు 'ఐ లవ్ యూ' చెబితే ప్రేమకు అంగీకారం దొరకాలనేం లేదు. వాలంటైన్స్ డే రోజు ఎవరైనా ఐ లవ్ యూ అంటే, వారి ప్రేమను ఒప్పుకుని తీరాలనీ ఏం లేదు.

♥ మరి వాలంటైన్స్ డే వల్ల ఉపయోగం ఏమిటి?

ఉపయోగం కాదు. అదొక వేడుక. ప్రేయసీ ప్రియుల, భార్యాభర్తల ప్రేమోత్సవం.

♥ ఐ లవ్ యూ చెప్పినప్పుడు.. 'సారీ.. నాకు అలాంటి ఉద్దేశం లేదు' అంటూ ఆ ప్రేమను కాదంటే ప్రేమమయుడైన వాలంటైన్ ఆత్మ క్షోభించదా?!

'ఇష్టం లేదు' అంటే వాలంటైన్స్ ఆత్మ క్షోభించదు. ఇష్టం లేకున్నా వెంట పడుతుంటేనే క్షోభిస్తుంది. వాలంటైన్ యువతీ యువకుల్ని స్వేచ్ఛగా ప్రేమించుకోండి అని ప్రబోధించాడే కానీ, ప్రేమను కోరుకోని వాళ్లను ఆ ప్రేమలో బంధించి సంకెళ్లు వెయ్యమని చెప్పలేదు.

♥ మూడో శతాబ్దపు రోమ్ చక్రవర్తి రెండవ క్లాడియస్.. ప్రేమమూర్తి వాలంటైన్‌ను ఉరి తీయించిన రోజు ఫిబ్రవరి 14 అని, అందుకే ఆ రోజు వాలంటైన్స్ డే జరుపుకుంటారనీ అంటారు. వాలంటైన్ పుట్టిన రోజును వాలంటైన్స్ డేగా జరుపుకోవాలి కానీ, వాలంటైన్ చనిపోయిన రోజును వాలంటైన్స్ డేగా జరుపుకోవడం ఏమిటి?

వాలెంటైన్ తను చనిపోయి ప్రేమను బతికించాడు కాబట్టి ఆయన చనిపోయిన రోజే వాలంటైన్ డే అయింది. అంటే.. ప్రేమ పుట్టిన రోజు. యువకులెవరూ పెళ్లిళ్లు చేసుకోకూడదనీ, సైన్యంలో చేరాలని క్లాడియస్ చక్రవర్తి ఆదేశాలు జారీ చేసినప్పుడు.. యుద్ధాలతో జయించడం కాదు, ప్రేమతో జయించాలని వాలంటైన్ ఉద్యమించడంతో క్లాడియస్ అతడిని ఉరి తీయించాడని రోమ్ చరిత్ర చెబుతోంది.

ఏడడుగులేస్తారా?

ఇవాళ ప్రేమికుల దినోత్సవం. ప్రేమోత్సవం. ప్రేయసిని ఎలా సర్‌ప్రైజ్ చేయాలని ఒకరు, ఈరోజు ఎలా అయినా ప్రేమను చెప్పేయాలని ధైర్యం కూడ దీసుకుంటూ ఇంకొకరు బిజీగా ఉంటారు. ఇలా ప్రేమలో పడ్డవాళ్లు, పడబోతున్నవాళ్లకు ఇది స్పెషల్ డే. ప్రస్తుతం కొందరు హీరోయిన్లు ప్రేమలో ఉన్నారు. ప్రేమ జల్లులో తడుస్తూ ఒక జంట, ప్రేమ వరదలో మునుగుతూ ఓ జంట, ప్రేమగాలిలో తేలుతూ ఒక జంట ఉన్నారు. మరి వీళ్లంతా పెళ్లి ఒడ్డుకి చేరుకుంటారా? నేటి ప్రేమికులు రేపటి భార్యాభర్తలవుతారా? కాలమే చెప్పాలి.

నయనతార కాదల్ (ప్రేమ) లో ఉన్నారు. విఘ్నేష్ శివన్ రాసే కథల్లో ఉన్నారు. లేడీ సూపర్‌స్టార్ నయనతార, దర్శకుడు విఘ్నేశ్ శివన్ విడదీయలేని ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. ప్రేమలో ఉన్నాం అని ప్రకటించకపోయినా వాళ్ల ప్రయాణాలు, సోషల్ మీడియా పోస్టులు ఎప్పటికప్పుడు ప్రకటిస్తూనే ఉంటాయి. విఘ్నేష్‌ని హబ్బీ అని కూడా అంటారు నయన్. మరి పెళ్లి ఎప్పుడు? అంటే ఈ ఏడాదిలో పక్కా అనే వార్త వినిపిస్తోంది. దీపికా పదుకోన్ – రణ్‌వీర్, ప్రియాంక చోప్రా – నిక్‌ల తర్వాత బాలీవుడ్ ప్రేక్షకులంతా ఆసక్తిగా గమనిస్తున్న మరో లవ్ స్టోరీ ఆలియా భట్– రణ్‌బీర్ కపూర్‌ల ది. ఆలియా, రణ్‌బీర్ ప్రస్తుతం లవ్‌లో ఉన్నారు. త్వరలోనే వీళ్ల ఇంట్లో వెడ్డింగ్ బెల్స్ మోగబోతున్నాయి అనే వార్తలు వినిపిస్తున్నాయి. మరో యంగ్ బాలీవుడ్ కపుల్ టైగర్ ష్రాఫ్ – దిశా పటానీ. టైగర్‌తో లంచ్, డిన్నర్‌లో తరచూ కనిపిస్తుంటారు దిశా. టైగర్ ఫ్యామిలీ ఫంక్షన్స్‌లో కూడా మిస్ అవ్వకుండా కనిపిస్తారు. మరి పెళ్లి ఎప్పుడంటే నవ్వేస్తారామె. తాప్సీకి కొంతకాలంగా బ్యాడ్మింటన్ మీద ఆసక్తి పెరిగిందని సరదాగా జోక్ చేస్తుంటారు. కారణం బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మథియాస్ బోతో ప్రేమలో పడటమే. కానీ ఈ విషయాన్ని బయట ఎక్కువగా ప్రస్తావించరు. 'ప్రేమకు వయసుతో సంబంధం లేదు' అంటే అవును.. అవును అంటారు సీనియర్ హీరోయిన్లు మలైకా అరోరా, సుస్మితా సేన్. కారణం వాళ్ల కంటే వయసులో చిన్నవాళ్లతో ప్రేమలో ఉండటమే. అర్జున్ కపూర్ (34)– మలైకా అరోరా (46) ప్రేమలో ఉన్నారు. 44 ఏళ్ల సుస్మితా సేన్, 28 ఏళ్ల రోహ్‌మాన్ ప్రేమలో ఉన్నారు. వయసుది ఏముంది? ప్రేమ ముఖ్యం అంటారు వీళ్లు. మరి వచ్చే ఏడాది వేలంటైన్స్ డే లోపల ఈ జంటలన్నీ ఏడడుగులేస్తాయా? అంతదాకా వెళ్లకుండానే బ్రేకప్ అవుతారా? వేచి చూద్దాం.

● విఘ్నేష్, నయనతార

● రోహ్‌మాన్, సుస్మిత

● మథియాస్, తాప్సీ

● రణ్‌బీర్, ఆలియా

● టైగర్ ష్రాఫ్, దిశా

● అర్జున్, మలైకా

సూర్య అద్భుతమైన నటుడు

- మోహన్‌బాబు

''తమిళంలో శివాజీ గణేశన్ తర్వాత అంత గొప్ప నటుడు శివకుమార్. ఆయన కొడుకు సూర్యతో కలిసి 'ఆకాశమే నీ హద్దురా'లో నటించాను. సూర్య అద్భుతమై నటుడు. అటువంటి కొడుకు ఉన్నందుకు శివకుమార్ గర్వపడాలి. దర్శకురాలు సుధ క్రమశిక్షణతో పనిచేస్తారు. ఈ చిత్రం సూపర్‌హిట్ సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు మోహన్ బాబు. సూర్య హీరోగా సుధ కొంగర దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'సూరరై పోట్రు'. తెలుగులో 'ఆకాశమే నీ హద్దురా!' అనే టైటిల్ ఖరారు చేశారు. అపర్ణా బాలమురళి కథానాయికగా నటించారు. సూర్య నిర్మించారు. రాజశేఖర కర్పూర, సుందరపాండ్యన్, గునీత్ మోంగా, ఆలిఫ్ సుర్తి సహ– నిర్మాతలు. ఇందులో మోహన్‌బాబు ఓ కీలక పాత్ర చేశారు. ఎయిర్ దక్కన్ వ్యవస్థాపకులు జీఆర్ గోపీనాథ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం ఇది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమాలోని 'పిల్ల పులి..' అనే పాటను విడుదల చేశారు. ఇప్పటివరకు విమానం ఎక్కని వంద మంది చిన్నారులను ఫ్లయిట్‌లో తీసుకెళ్లి ఈ పాటను విడుదల చేయడం విశేషం. జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరచిన ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాశారు. అనురాగ్ కులకర్ణి పాడారు. సూర్య మాట్లాడుతూ– ''2000 సంవత్సరంలో కేవలం ఒక శాతంలోపు వారే ఆకాశంలో విహరించేవారు. కెప్టెన్ గోపీనాథ్ వచ్చి సామాన్యులు కూడా విమానయానం చేసేలా చేశారు. మోహన్‌బాబుగారు, నా మధ్య వచ్చే సీన్లు హైలైట్‌గా ఉంటాయి. సుధ ఈ సినిమా కోసం దాదాపు పదేళ్లు కష్టపడ్డారు. ఈ చిత్రానికి సంబంధించిన ఏ క్రెడిట్ అయినా ఆమెకే దక్కుతుంది'' అన్నారు సూర్య. ''మంచి ఔట్‌పుట్ ఇచ్చాననే అనుకుంటున్నాను. ఈ సినిమా చేస్తున్న సమయంలో మా నాన్నగారు చనిపోయారు. మోహన్‌బాబు గారిని మా నాన్నగా దత్తత తీసుకున్నాను'' అన్నారు సుధ కొంగర.

● పాట ఆవిష్కరణలో సూర్య, మోహన్‌బాబు, శివకుమార్, సుధ....

● మనోజ్

అహం బ్రహ్మాస్మి

దాదాపు మూడేళ్లు వెండితెరకు దూరంగా ఉన్న మంచు మనోజ్ తన తర్వాతి చిత్రానికి సంబంధించిన వివరాలను గురువారం వెల్లడించారు. మనోజ్ తాజా చిత్రానికి 'అహం బ్రహ్మాస్మి' అనే టైటిల్ ఖరారైంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం మార్చి 6న జరుగుతుంది. ఎంఎం ఆర్ట్స్ బ్యానర్‌పై విద్యా నిర్వాణ, మంచు ఆనంద్ సమర్పణలో మంచు మనోజ్, నిర్మలాదేవి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ''నా తొలి చిత్రం 'దొంగ దొంగది' సమయంలో ఎలాంటి ఉద్వేగానికి లోనయ్యానో ఇప్పుడూ అదే భావోద్వేగంతో ఉన్నా'' అని పేర్కొన్నారు మనోజ్.

''నా సినిమాలకి బజ్ ఉండేది మీవల్లే (అభిమానులు) అని నాకు అర్థమైంది. మీ రౌడీస్ వల్ల, తెలుగు సినిమా ప్రేక్షకుల వల్ల ఈ బజ్ క్రియేట్ అవుతోంది. నేను నటించిన ఏ సినిమాకి వెళ్లినా మీకు ఒక కొత్త అనుభూతి ఉంటుందని గ్యారంటీ ఇస్తున్నా. 'వరల్డ్ ఫేమస్ లవర్' కూడా మీకొక కొత్త అనుభూతి ఇస్తుంది'' అని విజయ్ దేవరకొండ అన్నారు. క్రాంతి మాధవ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. రాశీ ఖన్నా, ఐశ్వర్యా రాజేష్, క్యాథరిన్, ఇజాబెల్లే లెయితే హీరోయిన్లుగా నటించారు. కె.ఎస్. రామారావు సమర్పణలో కె.ఎ. వల్లభ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. వైజాగ్‌లో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''నేను ముంబైలో షూటింగులో ఉండటం వల్ల 'వరల్డ్ ఫేమస్ లవర్' సినిమాకి ఎక్కువగా ప్రమోట్ చెయ్యలేదు. రాశీఖన్నా అయితే 'నువ్వు రావాలి, బజ్ క్రియేట్ చెయ్యాలి, హైప్ క్రియేట్ చెయ్యాలి' అని రోజూ ఫోన్ చేస్తూ నన్ను బెదిరిస్తూ వచ్చింది. ఈ సినిమా ఏమవుతుందో నాకు తెలియదు. మీరే చెప్పాలి'' అన్నారు. ''మా నాన్నగారు 'అభిలాష', 'ఛాలెంజ్' లాంటి సినిమాలు వైజాగ్‌లో తీశారు. 'వరల్డ్ ఫేమస్ లవర్' వేడుకకి ఇక్కడకు రావడం సంతోషంగా ఉంది'' అన్నారు కె.ఎ. వల్లభ. ''మిమ్మల్ని ఎంటర్‌టైన్ చెయ్యడానికి విజయ్ దేవరకొండ నలుగురు అమ్మాయిలతో ఈ సినిమా చేశాడు. థియేటర్‌కు వచ్చి ఎంజాయ్ చెయ్యండి'' అన్నారు క్రాంతి మాధవ్. ''ఈ సినిమా వాస్తవానికి దగ్గరగా ఉంటుంది'' అన్నారు రాశీ ఖన్నా.

రాశీ ఖన్నా బెదిరించేది

● వల్లభ, క్రాంతి మాధవ్, రాశీ ఖన్నా, విజయ్ దేవరకొండ

చావు కబురు చల్లగా

'ఆర్ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ, లావణ్య త్రిపాఠి జంటగా నటించనున్న చిత్రం 'చావు కబురు చల్లగా'. కౌశిక్ పెగళ్లపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పతాకంపై 'బన్ని' వాసు నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ప్రారంభమైంది. మొదటి సన్నివేశానికి హీరో అల్లు అర్జున్ కుమారుడు అల్లు ఆయాన్ కెమెరా స్విచ్చాన్ చేయగా, అల్లు అరవింద్ మనమరాలు బేబి అన్విత క్లాప్ ఇచ్చింది. ఈ సన్నివేశానికి అల్లు అరవింద్ దర్శకత్వం వహించారు. ''ఈ చిత్రంలో కార్తికేయ బస్తి బాలరాజు పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ నెల 19న రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఆమని, శ్రీకాంత్ అయ్యంగార్, మహేష్, భద్రం తదితరులు నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: సునీల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాఘవ కరుటూరి.

● కార్తికేయ

● నాగశౌర్య, రీతూవర్మ

కొత్త ప్రయాణం ప్రారంభం

'అశ్వత్థామ' విజయంతో సక్సెస్ ట్రాక్ ఎక్కారు నాగశౌర్య. తాజాగా ఓ కొత్త సినిమాకు శ్రీకారం చుట్టారు. నాగశౌర్య, రీతూ వర్మ జంటగా నూతన దర్శకురాలు లక్ష్మీ సౌజన్య ఈ సినిమా తెరకెక్కించనున్నారు. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఈ నెల 19న రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానున్న ఈ సినిమాకు కెమెరా: వంశీ పచ్చి పులుసుల, సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

పువ్వులు మనసున సంతోషాన్ని నింపుతాయి
పువ్వులు మదిలో ఉల్లాసాన్ని కలిగిస్తాయి
పువ్వులు పెదవులపై నవ్వులు విరబూయిస్తాయి
పువ్వులు మోమును వికసింపజేస్తాయి
పువ్వులు వేడుకకు కళను తీసుకువస్తాయి
పువ్వుల డ్రెస్సులు వేసుకుంటే..
చుట్టూ చూపులు అల్లేస్తాయి.

పువ్వులను చుట్టేద్దాం

గీతికా కానుమిల్లి,
ఫ్యాషన్ డిజైనర్,
హైదరాబాద్

పువ్వుల ప్రింట్ల దుస్తులు ఏ కాలమైనా కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. అవి సంప్రదాయ చీరలైనా.. వెస్టన్ ఫ్రాక్‌లైనా ప్రత్యేకతను చాటుతుంటాయి.

● ప్లెయిన్ స్కర్ట్ మీదకు పువ్వుల ప్రింట్లు ఉన్న స్లీవ్‌లెస్ కుర్తాని డిజైన్ చేయించుకుంటే ఇలా లుక్‌లో గ్లో వస్తుంది. గెట్ టు గెదర్, ఇండోవెస్టన్ స్టైల్ పార్టీలకు ఈ గెటప్ ఆహ్లాదంగా ఉంటుంది ● ప్లెయిన్ సిల్క్ ట్రౌజర్ మీదకు పువ్వుల ప్రింట్లు ఉన్న స్లీవ్స్ కుర్తా, పువ్వుల డిజైన్ రంగును పోలిన దుపట్టా క్యాజువల్ లుక్‌కి కరెక్ట్‌గా సూటవుతుంది ● ముదురు రంగులోని షిఫాన్ చీరపై గాఢమైన పువ్వుల సింగారం చూపులను తిప్పకోనివ్వదు ● పువ్వుల ప్రింటు లెహంగాకి సిల్వర్ కలర్ అంచు.. అదే కాంబినేషన్‌తో డిజైన్ చేసిన బ్లౌజ్, నెటెడ్ దుపట్టా.. వేడుకల్లో హైలైట్‌గా నిలుస్తుంది ● ఫ్లోరల్ ప్రింట్లు ఉన్న గౌనుకి ప్లెయిన్ ట్రాన్సపరెంట్ లాంగ్ జాకెట్ ప్రధాన హంగుగా అమరింది. క్యాజువల్, కాక్‌టెయిల్ పార్టీలకు కలర్‌ఫుల్‌గా ఉంటుంది ● పువ్వుల ప్రింట్లు ఉన్న కుచ్చుల చీర ఇండోవెస్టన్ స్టైల్ పార్టీలకు స్టైలిష్ లుక్ తీసుకువస్తుంది. ఎక్కడ ఉన్నా ప్రత్యేకత చాటుతుంది.

నిర్వహణ
నిర్మలారెడ్డి

ఆభరణం: మీనకారి

వెండి, బంగారు, ఇత్తడి, రాగి లోహాల డిజైన్లలో పంచెరంగులను ఒక తీరుగా కూరితే అందమైన మీనకారి ఆభరణంగా రూపుదిద్దుకుంటుంది. మీనకారి కళ రంగుల (ఎనామిల్ పెయింట్) తో కూడి ఉంటుంది. ఆభరణంలో ఒకే రంగు లేదా రెండు, ఐదు రంగులతో మీనకారి ఆర్ట్ ఉంటుంది.

పోత పోసిన అందం



మొఘల్ కాలం

ఇది రాజస్థానీ సంప్రదాయ కళ. జనాదరణ పొందిన డిజైన్లు లేదా జంతువుల బొమ్మలు, దేవతామూర్తులు ఉన్న ఆభరణాలలో ఆ చిత్రాలను హైలైట్ చేయడానికి ఈ ఎనామిల్‌ను ఉపయోగిస్తారు. దీనివెనుక ఉన్న అసలు రహస్యం చిత్రం స్పష్టంగా కనిపించడం. మీనకారి ఆభరణాలు ప్రత్యేకతను నింపుకుని ఉంటాయి. అందుకే ధరించిన వారిని ఎంతమందిలో ఉన్నా కళగా, ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా చూపుతాయి. మేవార్‌కు చెందిన రాజా మాన్‌సింగ్ 16వ శతాబ్దంలో జైపూర్‌లో మీనకారి కళకు పోషకుడిగా ఉన్నాడని చరిత్ర చెబుతోంది. లాహోర్ నుంచి నిపుణులైన కళాకారులను రప్పించి ఈ కళకు ప్రాణం పోశాడని ప్రతీతి.

ముత్యాలు, కుందన్లు

ఆభరణాలలో తెలుపుగా ఉంటూ అందాన్ని పెంచే ముత్యాలు, కుందన్లు సరసన మీనకారి ఎక్కువగా జత కడుతుంది. సంప్రదాయ దుస్తుల మీదకు మీనకారి డిజైన్ ఆభరణాలు ఎప్పుడూ ప్రత్యేకతను చూపుతూనే ఉంటాయి. అందుకే వివాహవేడుకలలో వీటిని విరివిగా వాడుతుంటారు.

బ్యూటిప్స్

మృత కణాలు, జిడ్డు తగ్గాలంటే..

● ఐదారు ద్రాక్ష పండ్లను సగానికి కట్ చేసి, ఆ సగం ముక్కలతో ఒకదాని తర్వాత ఒకటిని ఉపయోగిస్తూ ముఖంపైన మృదువుగా రుద్దాలి. ద్రాక్షలోని ఔషధ గుణాల వల్ల మృతకణాలు సులువుగా వదిలిపోతాయి. ఎండ వల్ల కందిన చర్మం పూర్వపు స్థితికి చేరుకుంటుంది.

● నిమ్మరసంలో కొద్దిగా తేనె కలిపి బ్లాక్ హెడ్స్ ఉన్న చోట రాసి, రుద్దాలి. ఐదు నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. రాత్రి పడుకునేముందు రోజూ ఇలా చేస్తూ ఉంటే నిమ్మరసం, తేనెలోని ఔషధ గుణాలు బ్లాక్‌హెడ్స్ తొలగిపోయేలా చేస్తాయి.

● టేబుల్‌స్పూన్ తేనె, రెండు టేబుల్ స్పూన్ల మీగడ కలిపి ముఖానికి పట్టించి, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే చర్మకాంతి ఇనుమడిస్తుంది.

● టేబుల్ స్పూన్ ముడి తేనెను కొద్దిగా వేడిచేయాలి. తట్టుకోగలిగేంత వేడిగా ఉన్నప్పుడు వేళ్లతో ఆ తేనెను తీసుకొని ముఖమంతా రాయాలి. 5-10 నిమిషాలు అలాగే ఉంచాలి. తర్వాత వెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మకాంతి పెరుగుతుంది.

● కీరా రసం, గ్లిజరిన్, రోజ్ వాటర్ కలిపి ఫ్రిజ్‌లో ఉంచాలి. చల్లబడిన తర్వాత ఈ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. ఆరిన తర్వాత చల్లని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇది ఎండ వేడి వల్ల కందిన చర్మానికి ఉపశమనం లభించేలా చేస్తుంది.

● పిగ్మేంటేషన్ వల్ల అయిన నలుపు మచ్చలు పోవాలంటే బంగాళాదుంపను సగానికి కోసి, ఆ ముక్కతో మృదువుగా రుద్దాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే నలుపు తగ్గుతుంది.

పరిపరిశోధన

చర్మం ముద్రించే యంత్రం



కాలిన గాయాలకు చికిత్స కల్పించడం అంత సులువైన విషయమేమీ కాదు. అంతెందుకు.. కాలిపోయి పాడైపోయిన చర్మానికి పూర్తిస్థాయిలో చికిత్స కూడా లేదు. శరీరంలోని ఇతర ప్రాంతాల నుంచి చర్మాన్ని సేకరించి కాలిన చోట్ల పెట్టడం అన్నది ఒక పద్ధతి. ఇలా కాకుండా... వేడి కారణంగా దెబ్బతిన్న చర్మం స్థానంలో అప్పటికప్పుడు కొత్త చర్మాన్ని అతికించగలిగితే ఎలా ఉంటుంది? అద్భుతంగా ఉంటుంది కదూ.. కెనెడా శాస్త్రవేత్తల పరిశోధనల పుణ్యమా అని ఈ అద్భుతం ఇక ఎంతో దూరంలో లేదు. రెండేళ్ల క్రితమే వీరు అవసరానికి తగ్గట్టు చర్మాన్ని ఉత్పత్తి చేయగల ఓ వినూత్న యంత్రాన్ని సిద్ధం చేయగా.. దీన్ని జంతువులపై ఇప్పటికే రెండుసార్లు విజయవంతంగా పరీక్షించారు కూడా. పార్శ్వికలను సీల్ చేసేందుకు ఉపయోగిస్తూంటారే.. డక్ట్ టేప్ డిస్పెన్సర్.. అలాగే ఉంటుంది ఈ కొత్త పరికరం కూడా. కాకపోతే టేప్ స్థానంలో కణజాలంతో కూడిన పట్టీని వదులుతుంది అంతే అని అంటున్నారు ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఆక్సెల్ జి. ఈ కొత్త యంత్రం శరీరంలోని ఇతర ప్రాంతాల నుంచి చర్మాన్ని సేకరించడాన్ని పూర్తిగా పరిహరిస్తుందని ప్రత్యేకమైన బయో ఇంక్ సాయంతో కాలిన గాయమైన చోటే కొత్త చర్మాన్ని అతికిస్తుందని చెప్పారు. ఈ బయోఇంక్‌లో గాయం మానేందుకు అవసరమైన ప్రొటీన్లు, కణాల పెరుగుదలను ప్రోత్సహించే స్టోమల్ సెల్స్ కూడా ఉంటాయని వివరించారు. పూర్తిగా కాలిపోయిన పంది చర్మంపై తాము ప్రయోగాలు చేశామని, ఫలితాలు చాలా సంతృప్తికరంగా ఉన్నాయని చెప్పారు. ఈ కొత్త చర్మపు పొరలు చాలా సురక్షితమైనవని, గాయం తొందరగా మానేందుకూ దోహదపడతాయని వివరించారు. మంట/వాపుల తోపాటు కాలిన గుర్తులూ లేకపోవడం ఈ కొత్త పద్ధతి తాలూకు సానుకూల అంశాలని వివరించారు.

గుండెజబ్బుకు కొత్త మందులు?

రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయేందుకు కారణమయ్యే ప్రొటీన్‌ను గుర్తించారు ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. రక్తనాళాల్లో పేరుకుపోయే కొవ్వు.. గారగా మారి గుండెజబ్బులకు దారితీస్తుందనేది అందరికీ తెలిసిన విషయమే. ధూమపానం చేసే వారిలో, కొవ్వులతో కూడిన ఆహారం తీసుకునే వారి రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోతుందని.. కొంత కాలం తరువాత రక్తప్రవాహం తగ్గడం వల్ల గుండెకు చేరాల్సిన రక్తం చేరకుండా గుండెపోటుకు దారితీస్తుందని మనకు తెలుసు. ఇదెలా జరుగుతుందన్న విషయంపై పూర్తిస్థాయిలో అర్థం కాకపోయినా ప్లెక్సిన్ డీ1 అనే ప్రొటీన్ కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఆక్స్‌ఫర్డ్ శాస్త్రవేత్తలు గుర్తించారు. అత్యంత సూక్ష్మస్థాయిలో ఉండే ఓ అయస్కాంత పటకారను ఉపయోగించి లాగే ప్రయత్నం చేసినప్పుడు ఈ ప్రొటీన్ ఒక సంకేతాన్ని విడుదల చేసిందని.. తద్వారా ఆ ప్రాంతంలో గార పోగుపడటం మొదలైందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఎల్లీ టెజిమా తెలిపారు. ఎలుకల్లోఈ ప్రొటీన్ రెండు రకాలుగా మడుచుకుంటోందని.. కుర్చీ ఆకారంలోది ఒకటైతే.. ఉంగరం ఆకారంలోది రెండోదని ఎల్లీ చెప్పారు. కుర్చీ ఆకారంలో ఉన్న ప్రొటీన్ మాత్రమే అయస్కాంతపు లాగుడుకు స్పందించిందని.. ఉంగరం ఆకారంలోని ప్రొటీన్లు రక్త ప్రవాహంలో వస్తున్న అడ్డంకులను పట్టించుకోలేదని వివరించారు. ఉంగరపు ఆకారంలోని ప్రొటీన్లు మాత్రమే ఉండే ఎలుకలను తయారు చేసి కొవ్వులతో కూడిన ఆహారం ఇచ్చినా రక్తనాళాల్లో గార అతితక్కువగా పేరుకుంటున్నట్లు తెలిసిందని చెప్పారు. కుర్చీ ఆకారంలో ఉన్న ప్రొటీన్‌ను నిలువరించేందుకు ఉన్న మందులను గుర్తించేందుకు ప్రస్తుతం ప్రయత్నిస్తున్నట్లు ఎల్లీ వివరించారు.

సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

శుక్రవారం
14-2-2020



కెరీర్ గైడెన్స్

వెటర్నరీ సైన్స్.. అవకాశాలు భేష్!

వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ.. డిమాండ్ ఉన్న కోర్సు! ప్రస్తుతం జాతీయంగా, అంతర్జాతీయంగా పశువైద్యులకు కొరత నెలకొంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో వెటర్నరీ డాక్టర్ల సేవల అవసరం రోజురోజుకూ పెరుగుతోంది. డెయిరీ,పౌల్ట్రీ రంగాలతోపాటు పెట్‌లు, యానిమల్ హెల్త్‌కేర్‌కు ప్రాధాన్యం పెరగడమే ఇందుకు కారణం! మరోవైపు పెంపుడు జంతువుల ఆరోగ్యంపై ఎన్నడూ లేనంత శ్రద్ధ కనిపిస్తోంది. ఇదే ఇప్పుడు వెటర్నరీ రంగంలో చక్కటి కెరీర్ అవకాశాలకు మార్గం వేస్తోంది. ఈ నేపథ్యంలో.. వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ విభాగంలో కోర్సులు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం...

'వెటర్నరీ సైన్స్ చదివితే.. పశు వైద్యులుగానే స్థిర పడతాం. అవకాశాలు కూడా తక్కువే. ప్రభుత్వ పశువైద్యశాలల్లో మాత్రమే కొలువులు దొరుకుతాయి'-ఇదీ గతంలో వెటర్నరీ సైన్స్ కోర్సుపై నెలకొన్న అభిప్రాయం. కానీ ఇప్పుడు దీనికి భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. వెటర్నరీ సైన్స్ చదివిన అభ్యర్థులు పశు వైద్యులుగానే కాకుండా.. పలు అనుబంధ విభాగాల్లోనూ కొలువులు సొంతం చేసుకునేందుకు వీలుంది. ఇటీవల కాలంలో పెంపుడు జంతువుల పట్ల వ్యక్తుల్లో ఆసక్తి పెరగడం, అవి అనారోగ్యానికి గురైతే ఖర్చు గురించి ఆలోచించకుండా.. పశువైద్యుల దగ్గరకు తీసుకెళ్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో వెటర్నరీ హెల్త్‌కేర్ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఏటా పదిశాతం వృద్ధి రేటు నమోదు చేసుకుంటోంది. దేశ వెటర్నరీ హెల్త్‌కేర్ మార్కెట్ 2024 నాటికి 1.17 బిలియన్ డాలర్లకు చేరుకోనుందని ట్రాన్స్‌పరెన్సీ మార్కెట్ రీసెర్చ్ తాజా నివేదికలో వెల్లడైంది.

పశువైద్యుల కొరత

పలు గణాంకాల ప్రకారం- దేశంలో ప్రస్తుతం దాదాపు 1.8 లక్షల మంది వెటర్నరీ సైన్స్ నిపుణుల అవసరం నెలకొంది. కానీ.. ప్రతి ఏటా సర్టిఫికెట్లతో బయటికి వస్తున్న వారి సంఖ్య 80వేలు దాటడం లేదు. దీన్నిబట్టి వెటర్నరీ రంగంలో వైద్య కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశాలకు ఢోకాలేదని చెప్పొచ్చు. వెటర్నరీ సైన్స్, యానిమల్ హెల్త్‌కేర్ విభాగాలకు సంబంధించి వైద్యులు మొదలు.. రీసెర్చ్ నిపుణుల వరకు డిమాండ్ నెలకొంది. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ(బీవీఎంఎస్) కోర్సు పూర్తిచేస్తే క్షేత్ర స్థాయిలో పశు వైద్యులుగా అవకాశం లభిస్తుంది. ఉన్నత విద్య పరంగా పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో పలు స్పెషలైజేషన్స్‌లో చేరొచ్చు. తద్వారా యానియల్ హెల్త్‌కేర్‌కు సంబంధించి టీకాల తయారీ దిశగా కీలకమైన పరిశోధనలు సాగించే వీలుంది.

పరికరాల తయారీ సంస్థలు

వెటర్నరీ సైన్స్‌లో బ్యాచిలర్, పీజీ, పీహెచ్‌డీ స్థాయి కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు జంతువుల ఆరోగ్య సంబంధిత పరికరాల తయారీ సంస్థల్లో కొలువులు లభిస్తున్నాయి. జంతువులకు వచ్చే వ్యాధుల నిర్ధారణకు అవసరమైన ఎక్స్-రే వంటి పరికరాల తయారీ సంస్థలు, ఆపరేషన్ థియేటర్ పరికరాల ఉత్పత్తి సంస్థలు, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థలు ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. వీటిలో కొలువులు సొంతం చేసుకున్న వారికి నెలకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వేతనం లభిస్తోంది. ఈ పరికరాల తయారీ విభాగంలో మెర్క్ అండ్ కో; జోయెటిస్, ఎలాంకో, మెరియల్ యానిమల్ హెల్త్ సంస్థలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.

లేబొరేటరీలు

వెటర్నరీ ఆసుపత్రులతోపాటు యానిమల్ హెల్త్ డయాగ్నస్టిక్ లేబొరేటరీల ఏర్పాటు కూడా పెరుగుతోంది. ఎక్స్-రే టెక్నీషియన్స్, బ్లడ్ టెక్నీషియన్స్, స్కానింగ్ ఆపరేటర్ల అవసరం కూడా ఏర్పడుతోంది. వెటర్నరీ సైన్స్‌లో డిప్లొమా స్థాయి కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు వీటిలో కొలువులు లభిస్తున్నాయి. నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనాలు సొంతం చేసుకునే అవకాశం ఉంది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు

వెటర్నరీ సైన్స్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు దేశంలో ప్రభుత్వ రంగంలోని పశు వైద్య కేంద్రాలు, జూపార్క్‌లు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, పబ్లిక్ హెల్త్ లేబొరేటరీస్, రక్షణ, వ్యవసాయ విభాగాల్లో కొలువులు సొంతం చేసుకునే వీలుంది. ప్రైవేటు రంగంలో పౌల్ట్రీ ఫారాలు, హేచరీస్, ఆక్వా ఫామ్స్, బయలాజికల్ ప్రొడక్షన్ యూనిట్స్, డైరీ ఫామ్స్‌లో ఉద్యోగాలు అందుకోవచ్చు. ఇవే కాకుండా.. బ్యాంకులు, బీమా సంస్థలు, జంతు ప్రదర్శన శాలల్లో వెటర్నరీ సైన్స్ నిపుణులకు అవకాశాలు లభిస్తున్నాయి. వీటితోపాటు లైవ్‌స్టాక్ ఫీడింగ్ సంస్థలు, యానిమల్ డ్రగ్ ప్రొడక్షన్ సంస్థలు, డ్రగ్ ఫార్ములేషన్ సంస్థల్లోనూ వీరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఖాయం. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు ప్రారంభంలో 20వేల జీతం లభిస్తోంది. అలాగే పీజీ ఉత్తీర్ణులు వారి స్పెషలైజేషన్ ఆధారంగా రూ.30వేల నుంచి రూ.40వేల వేతనంతో కెరీర్ ప్రారంభించొచ్చు.

అంతర్జాతీయంగానూ అవకాశాలు

వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీలో బ్యాచిలర్, పీజీ స్థాయి కోర్సుల ఉత్తీర్ణులకు అంతర్జాతీయ అవకాశాలకు కొదవలేదు. ప్రధానంగా యూకే, ఆస్ట్రేలియా, అమెరికాల్లో భారీ డిమాండ్ నెలకొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం- ఈ దేశాలు జీవజాతుల సంరక్షణపై భారీగా వ్యయం చేస్తున్నాయి. ఆయా దేశాల్లో పెంపుడు జంతువుల సంస్కృతి ఎక్కువ. కాని అక్కడ డిమాండ్‌కు తగ్గట్టు పశువైద్యులు అందుబాటులో లేరు. కాబట్టి మన అభ్యర్థులు బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అవకాశాలు అందుకునే వీలుంది. మన దేశంలో బీవీఎస్‌సీ అండ్ ఏహెచ్ చేసిన అభ్యర్థులు సదరు దేశాలు వేర్వేరుగా నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఉదాహరణకు.. రాయల్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సర్జన్స్ నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే యూకేలో కొలువుకు అనుమతి లభిస్తుంది. అదే విధంగా యూఎస్‌లో అడుగు పెట్టాలంటే.. అమెరికన్ బోర్డ్ ఆఫ్ వెటర్నరీ ప్రాక్టీషనర్స్ సర్టిఫికేషన్ సొంతం చేసుకోవాలి.

రీసెర్చ్‌లో అవకాశాలు విస్తృతం

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పోల్చితే పరిశోధన విభాగంలో ఆకర్షణీయ అవకాశాలు లభిస్తున్నాయి. దేశంలో జంతు సంపద వృద్ధి, సంబంధిత రంగాల్లో సమస్యల పరిష్కారం దిశగా రీసెర్చ్ నిపుణుల అవసరం పెరుగుతోంది. వెటర్నరీ సైన్స్, యానిమల్ హజ్బెండరీ, డెయిరీ టెక్నాలజీ, ఫిషరీస్ టెక్నాలజీల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులు.. ఆర్ అండ్ డీ యూనిట్స్, ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్, ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఇన్ కామెల్(బికనీర్) వంటి ప్రముఖ సంస్థల్లో అవకాశాలు దక్కించుకోవచ్చు. వీరు ప్రారంభంలోనే నెలకు రూ.80వేలకు పైగా వేతనంతో అధ్యాపక వృత్తిలో, పరిశోధనల విభాగంలో సైంటిఫిక్ ఫెలోస్‌గా కెరీర్ ప్రారంభించొచ్చు.

స్వయం ఉపాధి

వెటర్నరీ సైన్స్ సంబంధిత కోర్సులు పూర్తి చేసిన వారికి స్వయం ఉపాధి అవకాశాలు ఎక్కువే! సొంతంగా పెట్ కేర్ క్లినిక్స్ ఏర్పాటు చేసుకోవచ్చు. నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న పెట్ యానిమల్స్ కల్చర్.. వెటర్నరీ రంగంలో స్వయం ఉపాధికి ప్రధానంగా మారుతోంది. ఇలా స్వయం ఉపాధి ద్వారా నెలకు కనీసం రూ.40 వేల వరకు ఆర్జించే అవకాశం ఉంది.

బెస్ట్ స్పెషలైజేషన్స్

ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా బీవీఎస్‌సీ తర్వాత ఎంవీఎస్‌సీలో పలు స్పెషలైజేషన్లు ఉన్నప్పటికీ.. బ్యాక్టీరియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, లైవ్ స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, లైవ్ స్టాక్ ప్రొడక్ట్ టెక్నాలజీ, వెటర్నరీ పబ్లిక్ హెల్త్ అండ్ ఎపిడమాలజీలు బెస్ట్ స్పెషలైజేషన్లుగా మార్కెట్‌లో డిమాండ్ నెలకొంది.

వెటర్నరీ సైన్స్.. ముఖ్యాంశాలు

» వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ, యానిమల్ హెల్త్‌కేర్ విభాగంలో రానున్న రెండేళ్లలో దాదాపు రెండు లక్షల మంది నిపుణుల అవసరం.

» ప్రస్తుతం డిమాండ్ సప్లయ్ మధ్య దాదాపు 40 శాతం వ్యత్యాసం ఉంది.

» వెటర్నరీ సంబంధిత విభాగాల్లో టీచింగ్/రీసెర్చ్ విభాగాల్లో రెండు వేలకుపైగా నిపుణులు అవసరం.

» వెటర్నరీ సంబంధిత రంగాల్లో పారా సపోర్టింగ్ విభాగాల్లో దాదాపు మూడు లక్షల అవకాశాలు.

» అంతర్జాతీయంగానూ భారీ డిమాండ్. యూకే, యూఎస్, ఆస్ట్రేలియా, కెనడాల్లో సులువుగా కొలువులు సొంతం చేసుకునే అవకాశం.

» వెటర్నరీ హాస్పిటల్స్‌తోపాటు పరికరాల ఉత్పత్తి యూనిట్స్, లేబొరేటరీస్‌లోనూ అవకాశాలు.

అకడమిక్ కోర్సులు

యానిమల్ హెల్త్‌కేర్ విభాగంలో కెరీర్ కోరుకునే విద్యార్థులు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ(బీవీఎస్‌సీ) కోర్సులో చేరొచ్చు. ఈ కోర్సు.. వెటర్నరీ రంగంలో కెరీర్ అవకాశాలకు, ఉన్నత విద్యకు తొలి అడుగుగా నిలుస్తోంది. జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల్లోనూ ప్రత్యేక వెటర్నరీ యూనివర్సిటీలు ఏర్పాటయ్యాయి. ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత పీజీ స్థాయిలో యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, యానిమల్ న్యూట్రిషన్, వెటర్నరీ అనాటమీ అండ్ హిస్టాలజీ వంటి పలు స్పెషలైజేషన్స్ అందుబాటులో ఉన్నాయి. పీజీ అనంతరం పరిశోధనల దిశగా పీహెచ్‌డీలోనూ చేరే వీలుంది.

ప్రవేశం ఇలా

తెలుగు రాష్ట్రాల్లో.. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ(తిరుపతి); తెలంగాణలో పీవీ నరసింహరావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీల ఆధ్వర్యంలో బీవీఎస్‌సీ కోర్సుల ప్రవేశ ప్రక్రియ జరుగుతుంది. ఇందుకోసం అభ్యర్థులు ఇంటర్(బైపీసీ) ఉత్తీర్ణతతోపాటు ఎంసెట్‌లో అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్‌లో ర్యాంకు సొంతం చేసుకోవాలి. ఆ ర్యాంకు ఆధారంగా సదరు యూనివర్సిటీలు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరై ప్రవేశం ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

- **ఆంధ్రప్రదేశ్‌లో కళాశాలలు:**
  - » కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్-తిరుపతి
  - » ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్-గన్నవరం » కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్-ప్రొద్దుటూరు » కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్-ముతుకూరు.
- **తెలంగాణలో కళాశాలలు:**
  - » కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్-హైదరాబాద్
  - » కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్-కోరుట్ల
  - » కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్-మామ్నూరు
  - » కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్-పెబ్బేరు.

డిప్లొమా కోర్సులు

వెటర్నరీ సైన్స్‌కు సంబంధించి డిప్లొమా కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో 22 పాలిటెక్నిక్స్; తెలంగాణలో నాలుగు పాలిటెక్నిక్స్ ఉన్నాయి.

గ్లోబల్ కెరీర్ ఖాయం

"ప్రస్తుతం వెటర్నరీ సైన్స్ నిపుణులకు అంతర్జాతీయంగానూ డిమాండ్ నెలకొంది. మానవ వనరుల డిమాండ్ సప్లయ్ కోణంలో 40 శాతం పైనే వ్యత్యాసం ఉంది. కాబట్టి వెటర్నరీ కోర్సులు పూర్తి చేసిన వారికి గ్లోబల్ కెరీర్స్ ఖాయం అని చెప్పొచ్చు. ఇందులో ఎదగాలంటే.. పశు వైద్యంపై ఆసక్తి ఎంతో ముఖ్యం.

- డాక్టర్ ఎం.లక్ష్మణ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వెటర్నరీ పాథాలజిస్ట్ మెంబర్

ఉద్యోగ సమాచారం

ఎన్ఆర్ఆర్ఎంఎస్-2978

నేషనల్ రూరల్ రిక్రియేషన్ మిషన్ సొసైటీ (ఎన్ఆర్ఆర్ఎంఎస్).. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (డీడీయూ-ఆర్ఐడీ) ప్రాజెక్ట్ కింద ఏపీ, తెలంగాణల్లో ఒప్పంద ప్రాతిపదికన 2978 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. తెలంగాణ-1466

- **విభాగాల వారీ ఖాళీలు:** డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్-16, అకౌంట్స్ ఆఫీసర్-19, టెక్నికల్ అసిస్టెంట్-33, డేటా మేనేజర్-48, ఎంఐఎస్ మేనేజర్-62, ఎంఐఎస్ అసిస్టెంట్-214, మల్టీ టాస్కింగ్ అఫీషియల్-228, కంప్యూటర్ ఆపరేటర్-312, ఫీల్డ్ కో-ఆర్డినేటర్-278, ఫెసిలిటేటర్-256.

2. ఆంధ్రప్రదేశ్-1512

- **విభాగాల వారీ ఖాళీలు:** డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్-9, అకౌంట్స్ ఆఫీసర్-13, టెక్నికల్ అసిస్టెంట్-31, డేటా మేనేజర్-83, ఎంఐఎస్ మేనేజర్-137, ఎంఐఎస్ అసిస్టెంట్-226, మల్టీ టాస్కింగ్ అఫీషియల్-223, కంప్యూటర్ ఆపరేటర్-288, ఫీల్డ్ కో-ఆర్డినేటర్-254, ఫెసిలిటేటర్-248.
- **అర్హత:** పోస్టులను బట్టి డిప్లొమా, గ్రాడ్యుయేషన్, సంబంధిత సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 18-43 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 5, 2020
- **వెబ్‌సైట్:** www.nrrmsociety.com

అడ్మిషన్స్

శివనాడార్ యూనివర్సిటీలో ఎంబీఏ

శివనాడార్ యూనివర్సిటీ ఎంబీఏ, బీఎంఎస్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వివరాలు..

➠ **కోర్సు:** ఎంబీఏ

- **వ్యవధి:** రెండేళ్లు; సీట్లు: 60
- **అర్హత:** 50 శాతం మార్కులు లేదా తత్సమాన సీజీపీఏతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత -చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక విధానం:** క్యాట్-2019, ఎన్‌మ్యాట్-2019, ఎక్స్ఏటీ-2020, సీమ్యాట్-2020, జీమ్యాట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ స్కోర్లు లేని విద్యార్థులు యూనివర్సిటీ నిర్వహించే ఎస్‌మ్యాట్ టెస్ట్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది.

➠ **కోర్సు:** బీఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్)

- **వ్యవధి:** మూడేళ్లు, సీట్లు: 60
- **అర్హత:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత, ఎస్ఎన్ యూ శాట్, అకడమిక్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌లలో ఉత్తీర్ణత

➠ **కోర్సు:** పీహెచ్‌డీ ఇన్ మేనేజ్‌మెంట్

- **మొత్తం సీట్లు:** 10
- **అర్హత:** అరవై శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత. యూజీసీ లేదా సీఎస్ఐఆర్ నెట్‌లో జేఆర్ఎఫ్ లేదా లెక్చర్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- అదే విధంగా జీమ్యాట్/క్యాట్/ఎక్స్ఏటీ/ఏటీఎంఏ/మ్యాట్/ఎన్‌మ్యాట్/గేట్/జీఆర్ఈ/ రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్లు ఉండాలి.
- పీహెచ్‌డీకి ఎంపికైన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ. యాభై వేలు చొప్పున; తర్వాత రెండేళ్లు నెలకు రూ. 55 వేలు చొప్పున స్టయిఫండ్ ఇస్తారు.

➠ **ముఖ్య సమాచారం:**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి15, 2020
- **వివరాలకు వెబ్‌సైట్:** www.sme.snu.edu.in

ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు ప్రిపరేషన్

స్టడీ మెటీరియల్, బిట్ బ్యాంక్, జీకే, ఆన్‌లైన్ టెస్టులు, కరెంట్ అఫైర్స్, ప్రీవియస్ పేపర్స్, వీడియో గైడెన్స్ మొదలైనవి.

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM

SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS

2020 ఆస్కార్ ఉత్తమ చిత్రం?

➠ **92వ ఆస్కార్ వేడుకల్లో ఉత్తమ చిత్రం పురస్కారం అందుకున్న సినిమా ఏది?**

1) జోకర్ 2) 1917
3) పారసైట్ 4) మ్యారేజ్ స్టోరీ

సమాధానం: 3

- 92వ ఆస్కార్ పురస్కార వేడుకలు అమెరికాలోని లాస్ ఏంజిల్స్ నగరంలోని డాల్బీ థియేటర్‌లో 2020 జనవరి 9న జరిగాయి. దక్షిణ కొరియా చిత్రం పారసైట్ ఉత్తమ చిత్రం అవార్డు గెలుచుకుంది. ఈ అవార్డు సొంతం చేసుకున్న ఆంగ్లేతర చిత్రంగా చరిత్ర సృష్టించింది. మొత్తం నాలుగు అవార్డులు అందుకొని అగ్రస్థానంలో నిలిచింది. పారసైట్ చిత్రాన్ని తెరకెక్కించిన బాంగ్ జూన్‌హో ఉత్తమ దర్శకుడిగా అవార్డు అందుకున్నారు. అలాగే జోకర్‌లో ప్రధాన పాత్ర పోషించిన జోక్విన్ ఫీనిక్స్ ఉత్తమ నటుడిగా ఆస్కార్ అవార్డు దక్కించుకున్నారు. జూడీ చిత్రానికిగాను రెనీ జెల్‌వెగర్ ఉత్తమ నటి ఆస్కార్ గెలుచుకుంది.

➠ **అమెరికాలో భారత రాయబారిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?**

1) సయ్యద్ అక్బరుద్దీన్
2) తరణ్‌జీత్ సింగ్ సంధు
3) విజయ్ కేశవ్ గోఖలే 4) రవీష్ కుమార్

సమాధానం: 2

- 1988వ బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) అధికారి తరణ్ జీత్ సింగ్ సంధు అమెరికాలో భారత రాయబారిగా 2020 జనవరి 28న నియమితులయ్యారు. ఈ నియామకం నాటికి ఆయన శ్రీలంకలో భారత హైకమిషనర్‌గా ఉన్నారు. హర్షవర్దన్ ష్రింగ్లా స్థానంలో తరణ్ జీత్ సింగ్ సంధు అమెరికాలో భారత రాయబారిగా నియమితులయ్యారు. హర్ష వర్దన్ 2020 జనవరి 29న విదేశాంగ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

➠ **2020 జనవరిలో క్రాస్‌వర్డ్ బుక్ అవార్డు(జ్యూరీ కేటగిరీ)ను గెలుచుకున్న రచయిత్రి ఎవరు?**

1) నమితా గోఖలే 2) అనురాధా రాయ్
3) మాధురీ విజయ్ 4) అరుంధతీ రాయ్

సమాధానం: 3

- బెంగళూరులో జన్మించి ప్రస్తుతం అమెరికాలో నివాసం ఉంటున్న రచయిత్రి మాధురీ విజయ్‌కు ప్రతిష్టాత్మక క్రాస్‌వర్డ్ బుక్ అవార్డు (జ్యూరీ కేటగిరీ) 2020 జనవరిలో లభించింది. ఆమె రచించిన 'ది ఫార్ ఫీల్డ్' అనే పుస్తకానికి ఈ పురస్కారం దక్కింది. కాశ్మీర్ లోయలోని పరిస్థితులను ఈ నవల వివరిస్తుంది. ఈ అవార్డు కింద ఆమెకు మూడు లక్షల రూపాయల నగదు బహుమతి లభించింది. సల్మాన్ రష్దీ, విక్రమ్ సేథ్, కిరణ్ దేశాయ్ వంటి ప్రఖ్యాత భారతీయులు గతంలో క్రాస్ వర్డ్ బుక్ అవార్డును గెలుచుకున్నారు. 'ది ఫార్ ఫీల్డ్' పుస్తకానికి మాధురీ విజయ్ ఇటీవల జేసీబీ ప్రైజ్ ఫర్ లిటరేచర్, టాటా లిటరేచర్ లైవ్ ఫస్ట్ బుక్ అవార్డులను కూడా గెలుచుకోవడం విశేషం.

పోటీ పరీక్షల ప్రత్యేకం
కరెంట్ అఫైర్స్

➠ **2019 సంవత్సరానికిగాను సరస్వతీ సమ్మాన్ పురస్కారాన్ని ఎవరికి ప్రకటించారు?**

1) గోవింద మిశ్రా 2) ఎస్.ఎల్.భైరప్ప
3) మనోజ్ దాస్ 4) వాసుదేవ్ మోహి

సమాధానం: 4

- ప్రముఖ సింధీ రచయిత వాసుదేవ్ మోహి 2019వ సంవత్సరానికిగాను ప్రతిష్టాత్మక సరస్వతీ సమ్మాన్ పురస్కారానికి ఎంపికయ్యారు. 'చెక్ బుక్' అనే చిన్న కథల పుస్తకానికి ఈ అవార్డును 2020 జనవరిలో ప్రకటించారు. 'చెక్‌బుక్' 2012లో ప్రచురితమైంది. వాసుదేవ్ మోహి సింధీ భాషలో కవితలు, కథలు, అనువాదాలు కలిపి 25 రచనలు చేశారు. లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ కశ్యప్ నాయకత్వంలోని కమిటీ వాసుదేవ్ మోహిని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. సరస్వతీ సమ్మాన్ పురస్కారాన్ని 1991లో ప్రారంభించారు. దీన్ని కె.కె. బిర్లా ఫౌండేషన్ ప్రతి ఏటా అందజేస్తుంది. రూ.15 లక్షల నగదు బహుమతి అందజేస్తారు. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో ఉన్న 22 భాషల్లో ఏదైనా ఒక భాషలో ప్రతిభావంతులైన రచయితలకు అందజేస్తారు. 2018కిగాను ఈ అవార్డును మొట్టమొదటిసారి ఒక తెలుగు రచయితకు ప్రదానం చేశారు. 'పక్కకి ఒత్తిగిలితే' అనే కవితా సంపుటికిగాను కె.శివారెడ్డికి 2018లో ఈ అవార్డు లభించింది.

➠ **రోహింగ్యాల మారణకాండపై అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసు వేసిన దేశం ఏది?**

1) ఈజిప్ట్ 2) గాంబియా
3) టునీసియా 4) సౌదీ అరేబియా

సమాధానం: 2

- మయన్మార్‌లో నివశిస్తున్న రోహింగ్యా ముస్లింలపై ఆ దేశ సైన్యం హత్యాకాండకు పాల్పడుతోందని ఆఫ్రికా దేశమైన గాంబియా అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే)లో కేసు వేసింది. 2020 జనవరి 23న ఐసీజే రోహింగ్యా సమస్యపై కీలక ఆదేశాలు జారీ చేసింది. రోహింగ్యాలపై మారణ కాండను ఆపేందుకు మయన్మార్ ప్రభుత్వం వెంటనే అన్ని రకాల చర్యలను చేపట్టాలని ఐసీజే ఆదేశించింది. 2017లో మయన్మార్ సైన్యం జరిపిన దాడితో భయాందోళనకు గురైన లక్షలాది మంది రోహింగ్యాలు పొరుగు దేశాలకు పారిపోయారు. ఒక్క బంగ్లాదేశ్‌లోనే ఏడు లక్షల మంది శరణార్థులుగా జీవిస్తున్నారు. ఇంకా మయన్మార్‌లోనే ఆరు లక్షల మంది ఉన్నారు. వీరిని రక్షించాలని మయన్మార్ ప్రభుత్వాన్ని ఐసీజే ఆదేశించింది. ఐసీజే ప్రధాన కార్యాలయం నెదర్లాండ్స్‌లోని ది హేగ్ నగరంలో ఉంది.

➠ **భారత 71వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎవరు వచ్చారు?**

1) షింజో అబే 2) సిరిల్ రమాఫోసా
3) జెయిర్ బోల్సొనారో
4) లోపెజ్ ఓబ్రడార్

సమాధానం: 3

- భారత 71వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశ రాజధాని ఢిల్లీలో 2020 జనవరి 26న ఘనంగా జరిగాయి. వీటికి ముఖ్య అతిథిగా బ్రెజిల్ అధ్యక్షుడు జెయిర్ బోల్సొనారో హాజరయ్యారు. భారత గణతంత్ర వేడుకల్లో బ్రెజిల్ దేశాధినేత ముఖ్య అతిథిగా పాల్గొనడం ఇది మూడోసారి. ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ తిరుమల బ్రహ్మోత్సవ శకటం, తెలంగాణ బతుకమ్మ శకటం ప్రదర్శించాయి. ఉపగ్రహ విధ్వంసక క్షిపణి(ఏ శాట్), ధనుష్ శతఘ్ని వ్యవస్థ, అపాచీ యుద్ధ హెలికాప్టర్, చినుక్ రవాణా హెలికాప్టర్లను తొలిసారిగా ప్రదర్శించారు. మొత్తం పురుష జవాన్లతో కూడిన సైనిక బృందానికి మహిళా కమాండర్ కెప్టెన్ తాన్యా షెర్గిల్ నేతృత్వం వహించడం విశేషం.

➠ **2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ఫైనల్లో నొవాక్ జొకోవిచ్ ఎవరిని ఓడించి టైటిల్ సాధించాడు?**

1) రఫెల్ నాదల్ 2) మిలోస్ రొన

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం
14-2-2020

విడాకులు తీసుకున్న మైకేల్ క్లార్క్

ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ తన భార్య కైల్ బోల్డీతో విడిపోయాడు. తామిద్దరం పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుంటున్నట్లు క్లార్క్ ప్రకటించాడు. 2012లో క్లార్క్, బోల్డీకి వివాహమైంది. వీరిద్దరికి కెల్సీ లీ అనే నాలుగేళ్ల పాప ఉంది. విడాకులు తీసుకున్నందుకు భరణంగా క్లార్క్ 40 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 285 కోట్లు) చెల్లించనున్నట్లు సమాచారం. ఆసీస్ తరఫున 115 టెస్టులు, 245 వన్డేలు ఆడిన క్లార్క్ 2015లో జట్టును ప్రపంచకప్ విజేతగా నిలిపాడు

ప్రపంచ నంబర్ వన్ బాక్సర్‌గా అమిత్ పంఘాల్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) బాక్సింగ్ టాస్క్ ఫోర్స్ తాజాగా ప్రకటించిన ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత బాక్సర్, ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత అమిత్ పంఘాల్ ప్రపంచ నంబర్‌వన్‌గా అవతరించాడు. 52 కేజీల విభాగంలో 420 పాయింట్లతో అమిత్ అగ్రస్థానంలో నిలిచాడు. దాంతో 2009 అనంతరం బాక్సింగ్‌లో నంబర్‌వన్ ర్యాంకును దక్కించుకున్న తొలి భారత బాక్సర్‌గా నిలిచాడు. గతంలో విజేందర్ సింగ్ (75 కేజీలు) వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచాడు. ఇక మహిళల విభాగంలో ఆరు సార్లు ప్రపంచ చాంపియన్ అయిన మేరీ కోమ్ 51 కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలవగా... తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ 22వ ర్యాంకును సాధించింది. మహిళల 69 కేజీల విభాగంలో లొవ్లీనా బొర్గోహైన్ మూడో ర్యాంకును దక్కించుకుంది.

'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా మన్‌ప్రీత్ సింగ్

ఈ అవార్డును గెల్చుకున్న తొలి భారత హాకీ ప్లేయర్‌గా రికార్డు

లుసానే: భారత పురుషుల హాకీ జట్టు 2020 టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో కీలక పాత్ర పోషించిన సారథి మన్‌ప్రీత్ సింగ్ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు.పురుషుల విభాగంలో 2019 ఏడాదికి గానూ అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును గెల్చుకున్నాడు. దాంతో ఈ అవార్డును గెల్చుకున్న తొలి భారత హాకీ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ అవార్డు కోసం బెల్జియం ప్లేయర్ ఆర్థర్ వాన్ డోరెన్, అర్జెంటీనా ఆటగాడు లుకాస్ విల్లాలు పోటీ పడగా... పోలైన మొత్తం ఓట్లలో 35.2 శాతం ఓట్లను దక్కించుకున్న మన్‌ప్రీత్ విజేతగా నిలిచాడు. ఆర్థర్ 19.7 శాతం, లుకాస్ 16.5 శాతం ఓట్లతో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఈ అవార్డును తన జట్టు సభ్యులకు అంకితమిస్తున్నట్లు మన్‌ప్రీత్ తెలిపాడు. 2019లో తమ ప్రధాన లక్ష్యం ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే అని... రష్యాతో జరిగిన ఒలింపిక్ క్వాలిఫయర్స్ మ్యాచ్‌ల్లో విజయం సాధించడం ద్వారా ఒలింపిక్ కల నెరవేరిందని ఆయన ఆనందం వ్యక్తం చేశాడు. 2011లో భారత సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన మన్‌ప్రీత్ సింగ్ ఇప్పటి వరకు 263 అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లు ఆడాడు. అంతే కాకుండా 2012 లండన్, 2016 రియో ఒలింపిక్స్‌ల్లో భారతకు ఆడాడు. 2017లో సారథ్య బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇక వెనుదిరిగి చూడలేదు. ముఖ్యంగా 2019లో భారత హాకీ జట్టుకు అద్వితీయమైన విజయాలను అందించాడు. భువనేశ్వర్ వేదికగా జరిగిన ఎఫ్ఐహెచ్ సిరీస్ ఫైనల్స్ చాంపియన్‌గా భారత్‌ను నిలబెట్టడంతో పాటు టోక్యో ఒలింపిక్స్ బెర్తును ఖాయం చేశాడు. వీటితో పాటు టోక్యోలో జరిగిన ఒలింపిక్ టెస్టు ఈవెంట్ విజేతగా... సుల్తాన్ అజ్లాన్ షా కప్ ఫైనల్స్‌కు భారత్‌ను చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటికే మన్‌ప్రీత్‌తో పాటు భారత యువ మిడ్‌ఫీల్డర్ వివేక్ సాగర్ ప్రసాద్ 'రైజింగ్ స్టార్ ఆఫ్ ద ఇయర్' అవార్డును గెల్చుకున్నాడు. మహిళల విభాగంలో ఇదే అవార్డును భారత ప్లేయర్ లాల్‌రెమ్‌సియామి గెల్చుకుంది.

సఫారీని గెలిపించిన ఇన్‌గిడి

పరుగు తేడాతో ఇంగ్లండ్ ఓటమి

ఈస్ట్ లండన్ (దక్షిణాఫ్రికా): ఇంగ్లండ్ గెలవాల్సిన మ్యాచ్ ఇది. చేతిలో 5 వికెట్లున్న ఇంగ్లండ్ ఆఖరి 6 బంతుల్లో 7 పరుగులు చేస్తే సరిపోతుంది. దక్షిణాఫ్రికాకు ఓటమి ఖాయమైన వేళ... సఫారీ పేసర్ లుంగి ఇన్‌గిడి (3/30) అద్భుతమే చేశాడు. అంతకు ముందు 2 ఓవర్ల స్పెల్‌లో 25 పరుగులిచ్చిన ఈ పేసర్ ఆఖరి ఓవర్లో ఐదు పరుగులిచ్చి కరన్ (2), మొయిన్ అలీ (5)లను ఔట్ చేశాడు. అదే ఓవర్ ఆఖరి బంతికి రషీద్ రెండో పరుగు తీయబోయి రనౌటయ్యాడు. దీంతో అనూహ్యంగా తొలి టి20లో దక్షిణాఫ్రికా జట్టు పరుగు తేడాతో ఇంగ్లండ్‌పై గెలిచింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 177 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాట్స్‌మెన్ బవుమా (27 బంతుల్లో 43; 5 ఫోర్లు), డికాక్ (15 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), వాన్ డెర్ డసెన్ (26 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తర్వాత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 176 పరుగులు చేడి ఓడింది. ఓపెనర్ జేసన్ రాయ్ (38 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ మోర్గాన్ (34 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడటంతో గెలుపుబాట పట్టింది. చివరి 12 బంతుల్లో 23 పరుగులు చేయాల్సిన తరుణంలో 19వ ఓవర్‌ను మోర్గాన్ 4, 4, 6తో చితకబాదాడు. 16 పరుగులు వచ్చాయి కానీ ఆఖరి బంతికి మోర్గాన్ అవుట్ కావడంతో కథ మారింది.

గుజరాత్‌కు భారీ ఆధిక్యం

ఆంధ్రతో రంజీ మ్యాచ్

చిరాగ్

నడియాడ్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో భాగంగా ఆంధ్రతో జరుగుతోన్న మ్యాచ్‌లో గుజరాత్ జట్టు భారీ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 2/0తో రెండో రోజైన గురువారం ఆట కొనసాగించిన గుజరాత్... ఆట ముగిసే సమయానికి తమ తొలి ఇన్నింగ్స్‌లో 94 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 354 పరుగులు చేసింది. దాంతో 177 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. అక్షర్ పటేల్ (89; 8 ఫోర్లు, సిక్స్), చిరాగ్ గాంధీ (80 బ్యాటింగ్; 8 ఫోర్లు, సిక్స్), పార్థివ్ పటేల్ (57; 7 ఫోర్లు) రాణించారు. ఆంధ్ర బౌలర్ షోయబ్ మొహమ్మద్ ఖాన్ (3/78) ధాటికి గుజరాత్ ఒక దశలో 144 పరుగులకే సగం వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే చిరాగ్ గాంధీ జట్టును ఆదుకున్నాడు. అతను అక్షర్ పటేల్‌తో కలిసి ఆరో వికెట్‌కు 141 పరుగులు... అనంతరం యశ్ గర్ధారియా (37 బ్యాటింగ్)తో కలిసి అభేద్యమైన ఏడో వికెట్‌కు 69 పరుగులు జోడించి జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు.

హైదరాబాద్ 272 ఆలౌట్

హైదరాబాద్ వేదికగా విదర్భతో జరుగుతోన్న రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 94.5 ఓవర్లలో 272 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 239/7తో రెండో రోజు ఆట కొనసాగించిన హైదరాబాద్ మరో 33 పరుగులు జోడించి చివరి 3 వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విదర్భ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 4 వికెట్లకు 242 పరుగులు చేసింది. ఓపెనర్ ఫజల్ అజేయ శతకం (126 బ్యాటింగ్; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కదంతొక్కాడు. అతనికి గణేశ్ సతీశ్ (65; 9 ఫోర్లు, సిక్స్) చక్కటి సహకారం అందించాడు. హైదరాబాద్ బౌలర్ రవి కిరణ్ రెండు వికెట్లు తీశాడు. ప్రస్తుతం విదర్భ 30 పరుగులు వెనుకబడి ఉంది.

ఫజల్

సెమీస్‌లో పేస్ ద్వయం

బెంగళూరు ఓపెన్

బెంగళూరు: భారత దిగ్గజ డబుల్స్ ఆటగాడు లియాండర్ పేస్ బెంగళూరు ఓపెన్ టెన్నిస్ టోర్నీలో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్ మ్యాచ్‌లో పేస్-మాథ్యూ అబ్డెన్ (ఆస్ట్రేలియా) జంట 7-5, 0-6, 10-7తో ఆండ్రె గొరాంసన్ (స్వీడన్)-క్రిస్టోఫర్ రుంగ్‌కట్ (ఇండోనేసియా) జోడీపై గెలుపొందింది. ఈ జోడీతో పాటు సాకేత్ మైనేని (భారత్)-మ్యాట్ రీడ్ (ఆస్ట్రేలియా) ద్వయం 3-6, 6-4, 10-8తో టాప్ సీడ్ చెంగ్ పెంగ్ (చైనీస్ తైపీ)-డెనీస్ మొల్చనోవ్ (ఉక్రెయిన్) జంటపై, పురవ్ రాజా (భారత్)-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జంట 6-4, 6-4తో ఫ్రెడెరికో సిల్వా-నికోల మిలొజెవిచ్ (సెర్బియా) ద్వయంపై గెలిచి సెమీస్ చేరాయి. అయితే పురుషుల సింగిల్స్‌లో మాత్రం భారత పోరాటం ప్రిక్వార్టర్స్‌తో ముగిసింది. ఏడో సీడ్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ 6-7 (5/7), 0-6తో బెంజమిన్ బొంజి (ఫ్రాన్స్) చేతిలో, ఎనిమిదో సీడ్ సుమీత్ నాగల్ 3-6, 3-6తో బ్లజ్ రొలా (స్లొవేనియా) చేతిలో ఓడారు. వీరితో పాటు రామ్‌కుమార్ రామనాథన్, సాకేత్ మైనేని, నికి పూనచ, సిద్ధార్థ్ రావత్ కూడా ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.

క్వార్టర్స్‌లో ఓడిన దివిజ్ శరణ్ జంట

న్యూయార్క్: న్యూయార్క్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ ఆటగాడు దివిజ్ శరణ్‌కు చుక్కెదురైంది. బుధవారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో దివిజ్ శరణ్-ఆర్టెమ్ సిటాక్ (న్యూజిలాండ్) ద్వయం 3-6, 4-6తో అమెరికా ద్వయం స్టీవ్ జాన్సన్-రైలీ ఒపెల్కా చేతిలో ఓడింది. టోర్నీ తొలి రౌండ్‌లో దివిజ్ శరణ్-ఆర్టెమ్ సిటాక్ జంట 7-6 (7/3), 6-3తో టాప్ సీడ్ ఆస్టిన్ క్రాజిసెక్ (అమెరికా)- ఫ్రాంకో స్కుగోర్ (క్రోయేషియా) జోడీకి షాకిచ్చింది.

'డ్రా'తో సరిపెట్టుకున్న హైదరాబాద్

సాక్షి, హైదరాబాద్: చివరి నిమిషాల్లో ఆటగాళ్లు ప్రదర్శించిన అలసత్వం హైదరాబాద్‌కు మరోసారి విజయాన్ని దూరం చేసింది. దాంతో గెలవాల్సిన చోట 'డ్రా'తో సరిపెట్టుకుంది. ఇండియన్ సూపర్ లీగ్ సీజన్-6లో భాగంగా గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ 1-1తో జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించింది. 90+3వ నిమిషంలో లభించిన ఫ్రీ కిక్‌ను అద్భుతమైన ఫ్లిక్‌తో గోల్‌గా మలచిన జమ్‌షెడ్‌పూర్ ఆటగాడు సుమీత్ జట్టుకు ఓటమి పరాభవాన్ని తప్పించాడు. హైదరాబాద్ తరఫున నెస్టోర్ (39వ నిమిషంలో) గోల్ చేశాడు. ఈ మ్యాచ్‌తో తాజా సీజన్‌లో హైదరాబాద్ తన హోమ్ మ్యాచ్‌లను పూర్తి చేసింది. సొంత మైదానంలో 9 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ ఒక దాంట్లో గెలిచి నాలుగింటిలో ఓడింది. మరో నాలుగు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది. 7 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానం అయిన పదో స్థానంలో కొనసాగుతున్న హైదరాబాద్... తన చివరి మ్యాచ్‌ను ఈ నెల 20న గువాహటి వేదికగా నార్త్‌ఈస్ట్ యునైటెడ్‌తో ఆడుతుంది. **నేటి మ్యాచ్‌లో ఒడిశా ఎఫ్‌సీతో నార్త్‌ఈస్ట్ యునైటెడ్ తలపడుతుంది.**

ఓపెనింగ్ పరీక్ష

నేటినుంచి భారత్ ప్రాక్టీస్ మ్యాచ్

న్యూజిలాండ్ ఎలెవన్‌తో పోరు

పృథ్వీ షా

గిల్

హామిల్టన్: న్యూజిలాండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లు పంచుకున్న తర్వాత టెస్టు పోరులో అమీతుమీ తేల్చుకునేందుకు భారత్ సన్నద్ధమవుతుంది. అయితే ఈ నెల 21నుంచి జరిగే తొలి టెస్టుకు ముందు సన్నాహకంగా టీమిండియా మరో మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. నేటినుంచి ఇక్కడి సెడెన్ పార్క్‌లో జరిగే మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఎలెవన్‌తో భారత్ తలపడుతుంది. ఇటీవలి కాలంలో ప్రత్యర్థులకు ప్రాక్టీస్ మ్యాచ్ కోసం నాసిరకం వేదికలు ఇవ్వడం, దిగువ స్థాయి ఆటగాళ్లను బరిలోకి దించడం వంటివి ఆతిథ్య జట్లు తరచుగా చేస్తున్న నేపథ్యంలో తాజా మ్యాచ్ మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తోంది. కివీస్ సీనియర్, 'ఎ' జట్లకు చెందిన పలువురు కీలక ఆటగాళ్లు ఈ మ్యాచ్ ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ సరైన రీతిలో మ్యాచ్‌ను ఉపయోగించుకునేందుకు ఇది మంచి అవకాశం. ఓపెనర్లను పరీక్షించడం, పేస్ బౌలర్ల ఫిట్‌నెస్ తదితర అంశాలను పరిశీలించుకోవడం టీమిండియాకు తొలి టెస్టుకు ముందు ప్రధాన లక్ష్యం. మూడు రోజుల మ్యాచ్ కాబట్టి ప్రధాన ఆటగాళ్లందరికీ బ్యాటింగ్, బౌలింగ్ ప్రాక్టీస్ లభించవచ్చు.

మయాంక్‌కు జోడీగా...

సొంతగడ్డపై వరుస విజయాలు సాధించిన భారత టెస్టులో జట్టులో ఓపెనర్లుగా రోహిత్, మయాంక్ భారీగా పరుగులు సాధించారు. ఇప్పుడు గాయంతో రోహిత్ సిరీస్‌కు దూరం కావడంతో మయాంక్‌కు జోడీగా మరో ఆటగాడిని దించడం అనివార్యమైంది. నిజానికి మయాంక్ ఫామ్ కూడా గొప్పగా లేదు. 'ఎ' జట్టు తరఫున అనధికారిక టెస్టు రెండు ఇన్నింగ్స్‌లోనూ అతను డకౌటయ్యాడు. ఆ తర్వాత మూడు వన్డేల సిరీస్‌లో విఫలం కావడంతో పాటు అతని పేలవ డిఫెన్స్‌పై విమర్శలు వచ్చాయి. ఇప్పటికే రెండు టెస్టులు ఆడిన పృథ్వీ షా తన సత్తా చాటి పునరాగమనం చేయగా...'ఎ' మ్యాచ్‌లలో 83, 204 నాటౌట్, 136 స్కోర్లతో గిల్ చెలరేగాడు. తాజా ప్రాక్టీస్ మ్యాచ్ వీరిద్దరి ప్రదర్శనను అంచనా వేయడానికి టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఉపయోగపడుతుంది. ఇషాంత్ దాదాపుగా సిరీస్‌కు దూరమయ్యాడు కాబట్టి బుమ్రా, షమీలపై బాధ్యత మరింత పెరిగింది. శనివారం జరిగే ఫిట్‌నెస్ టెస్టులో అర్హత సాధిస్తేనే ఇషాంత్ జట్టుతో చేరవచ్చు. ఉమేశ్ యాదవ్‌కు విదేశాల్లో తనను తాను నిరూపించుకునేందుకు ఇది మంచి అవకాశం. ఈ మ్యాచ్‌లో రాణిస్తే మూడో పేసర్‌గా అతని స్థానం ఖాయమవుతుంది. ఇంత వరకు అరంగేట్రం చేయని నవదీప్ సైనీనుంచి అతనికి పోటీ పొంచి ఉంది. ఇద్దరు స్పిన్నర్లు అశ్విన్, జడేజాల ప్రాక్టీస్‌కు కూడా మ్యాచ్ సరైన వేదిక.

దీటైన జట్టు...

న్యూజిలాండ్ ఎలెవన్ తరఫున ఆడుతున్న జట్టులో పలువురు గుర్తింపు పొందిన ఆటగాళ్లు ఉన్నారు. జాతీయ జట్టు రెగ్యులర్ క్రికెటర్లు ఇష్ సోధి, జిమ్మీ నీషమ్, వికెట్ కీపర్ టీమ్ సీఫెర్ట్‌లతో ఆ జట్టు పటిష్ఠంగా కనిపిస్తోంది. వీరంతా ఇటీవల భారత్‌తో వన్డే, టి20 సిరీస్‌లలో తలపడిన జట్టులో ఉన్నవారే. కుగ్‌లీన్, టిక్‌నర్‌లు కూడా సొంత మైదానంలో చెలరేగిపోగల సమర్థులు. డరైన్ మిషెల్, టామ్ బ్రూస్‌వంటి టెస్టు స్పెషలిస్ట్‌లు కూడా తమ సత్తా చాటాలని సిద్ధంగా ఉన్నారు. కాబట్టి ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఈ జట్టు గనక టీమిండియాను ఇబ్బంది పెట్టగలిగితే రాబోయే టెస్టు సిరీస్‌లో భారత్‌కు సవాల్ ఎదురవడం ఖాయం.

పృథ్వీతో పోటీ లేదు

• ఓపెనింగ్ కొత్త కాదు • మీడియాతో శుబ్‌మన్ గిల్

హామిల్టన్: యువ బ్యాట్స్‌మన్ శుబ్‌మన్ గిల్ తనకు ఓపెనింగ్‌లో పృథ్వీ షాతో పోటీ లేదన్నాడు. అయితే అవకాశం వస్తే దాన్ని జారవిడుచుకోనని చెప్పాడు. ఇటీవలే న్యూజిలాండ్ 'ఎ'తో జరిగిన అనధికారిక టెస్టుల్లో భారత్ 'ఎ' తరఫున గిల్ అద్భుతంగా రాణించాడు. డబుల్ సెంచరీ, సెంచరీతో మెరిశాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 21 నుంచి వెల్లింగ్టన్‌లో జరిగే తొలి టెస్టులో అతను ఆడే అవకాశాలు మెరుగయ్యాయి. దీంతో పృథ్వీ షాతో అతను పోటీ పడుతుండటంపై చర్చ మొదలైంది. దీనిపై అతను మాట్లాడుతూ 'పృథ్వీ నా అండర్-19 సహచరుడు. ఇద్దరి కెరీర్‌లు ఒకేసారి మొదలయ్యాయి. కానీ అతనితో నాకు పోటీ లేదు. మేమిద్దరం బాగా ఆడుతున్నాం. జట్టులో ఎవరుండాలనేది టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయిస్తుంది. అయితే ఇది మా మధ్య పోటీ కానే కాదు. ఎవరికి అవకాశమొచ్చినా సద్వినియోగం చేసుకోవాలి తప్ప దాన్ని వృథా చేయొద్దు' అని అన్నాడు. ఆరు వారాలుగా భారత్ 'ఎ' తరఫున కివీస్‌లో ఉండటంతో అక్కడి పరిస్థితులు, పిచ్‌లను అతను చక్కగా అలవాటు చేసుకున్నాడు. దీంతో అనధికారిక టెస్టుల్లో 20 ఏళ్ల గిల్ విశేషంగా రాణించాడు. అక్కడి పేసర్లతో జాగ్రత్త అని చెప్పాడు. 'కివీస్ బౌలింగ్ అటాక్ వికెట్లు పడగొట్టేందుకు షార్ట్‌పిచ్ బంతుల్నే సంధిస్తుంది. ముఖ్యంగా నీల్ వాగ్నర్‌తో అప్రమత్తంగా ఉండాలి. వాళ్లు ఆడిన ఆస్ట్రేలియా సిరీస్‌నే పరిశీలిస్తే ఈ విషయం మనకు అర్థమవుతుంది. వికెట్లు పడకపోతే... ఇక పిచ్‌తో లాభం లేదని అదేపనిగా షార్ట్‌పిచ్ బంతుల్నే ప్రయోగించారు. బ్యాట్స్‌మన్‌గా నేను చెప్పేది ఒకటే... షార్ట్‌పిచ్ బంతుల్ని అలా వదిలేస్తేనే మనం పరుగులు చేయగలం' అని శుబ్‌మన్ వివరించాడు. అక్కడి వాతావరణ పరిస్థితులు కూడా బ్యాటింగ్‌పై ప్రభావం చూపిస్తాయన్నాడు. ఈ పరిస్థితుల ఆధారంగానే వారి (ఆతిథ్య బౌలర్ల) ప్రణాళికలు ఉంటాయన్నాడు. తీవ్రంగా గాలి వీస్తే బ్యాట్స్‌మెన్‌కు పుల్ షాట్లు, హుక్ షాట్లు ఆడటం కష్టమవుతుందని చెప్పాడు. నాలుగో స్థానంలో ఆడటం కన్నా ఓపెనర్‌గా దిగడమే బాగుంటుందని... యథేచ్ఛగా ఆడే అవకాశం ఉంటుందని చెప్పాడు. అదే 4వ స్థానమైతే అప్పటికే 2 వికెట్లు పడిన ఒత్తిడి ఉంటుందని తెలిపాడు. 'న్యూజిలాండ్ కంటే ఇంగ్లండ్‌లోనే స్వింగ్ ఎక్కువ అవుతుంది. అక్కడ ఎరుపురంగు డ్యూక్స్ బంతుల్ని ఎదుర్కోవడం కష్టం. కానీ కివీస్‌లో అలా వుండదు. ఇక్కడి వికెట్లు బ్యాటింగ్‌కు అనుకూలంగానే ఉంటాయి. అయితే బౌన్స్‌ను ఎదుర్కోవడమే కాస్త కష్టం' అని గిల్ విశ్లేషించాడు.

అమ్మాయిలు 1983ని పునరావృతం చేస్తారు!

భారత మహిళా క్రికెట్ జట్టు కోచ్ డబ్ల్యూవీ రామన్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఈనెల 21నుంచి ఆస్ట్రేలియా వేదికగా జరుగనున్న మహిళల టి20 ప్రపంచ కప్‌ను గెలిచే సత్తా భారత్‌కు ఉందని కోచ్ డబ్ల్యూవీ రామన్ అన్నారు. అదే జరిగితే 1983లో ప్రపంచకప్ సాధించడం ద్వారా కపిల్ సేన భారత క్రికెట్ అభివృద్ధికి ఎలా దోహదపడిందో మళ్లీ ఆ పరిస్థితుల్ని భారత అమ్మాయిలు పునరావృతం చేస్తారని వ్యాఖ్యానించారు. ఈ మెగా ఈవెంట్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుందని పేర్కొన్నారు. 'భారత్ కచ్చితంగా ఫేవరెట్ జట్టు. 2017 వన్డే ప్రపంచకప్‌లో రన్నరప్, 2018 టి20 ప్రపంచకప్‌లో సెమీ ఫైనల్స్ ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. నేను జట్టుతో చేరినప్పటితో పోలిస్తే ఇప్పుడు ఫిట్‌నెస్, మానసిక దృఢత్వం, ఆటగాళ్ల పరిపక్వత, పరిస్థితులు మరింత మెరుగయ్యాయి. టైటిల్ గెలిచే అర్హత భారత అమ్మాయిలకు ఉంది. ప్రతీ ఒక్కరూ స్టార్ ప్లేయర్‌గా మారిపోతారు' అని రామన్ వివరించారు. 'ప్రస్తుతం భారత్ బ్యాటింగ్ అద్భుతంగా ఉంది. భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో మంచి టెక్నికల్ షాట్స్ ఆడుతున్నారు'అని అన్నారు. ఫిబ్రవరి 21న తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది.

మలేసియా చేతిలో...

శ్రీకాంత్

• భారత్‌కు తప్పని పరాజయం • ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

మనీలా: ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఓటమి ఎదురైంది. గ్రూప్ 'బి'లో గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 1-4తో మలేసియా చేతిలో పరాజయం చవిచూసింది. ప్రపంచ మాజీ నంబర్‌వన్ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్ ఒక్కడే ఈ పోరులో గెలిచాడు. రెండు డబుల్స్ జోడీలు, ఇతర రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు నిరాశపరిచారు. ఈ పరాజయంతో భారత్ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. కజకిస్తాన్‌తో గెలుపొందడంతో క్వార్టర్స్ చేరిన భారత్... శుక్రవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో థాయ్‌లాండ్‌తో తలపడుతుంది. తొలి సింగిల్స్‌లో బరిలోకి దిగిన ప్రపంచ 11వ ర్యాంకర్ భమిడిపాటి సాయిప్రణీత్ 18-21, 15-21తో లీ జి జియా చేతిలో కంగుతిన్నాడు. మొదటి డబుల్స్‌లో ఎం.ఆర్.అర్జున్-చిరాగ్ షెట్టి ద్వయం 18-21, 15-21తో అరొన్ చియా-సో వుయి ఇక్ జంట చేతిలో ఓడింది. దీంతో భారత్ 0-2తో ఓటమికి దగ్గరవగా... రెండో సింగిల్స్‌లో శ్రీకాంత్ 14-21, 21-16, 21-19తో చిమ్ జున్ వీపై నెగ్గడంతో జట్టు ఆశలు నిలిచాయి. కానీ రెండో డబుల్స్‌లో ధ్రువ్ కపిల-లక్ష్యసేన్ జోడీ 14-21, 14-21తో ఒంగ్ యిన్ సిన్-తే ఈ యి జంట చేతిలో, ఆఖరి సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్ 10-21, 15-21తో లియాంగ్ జున్ హవ్ చేతిలో పరాజయం పాలయ్యారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
14-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
106	27
41,460	12,175

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు 11.30గంటలకు)

నాస్‌డాక్	9,715	11
డోజోన్స్	29,470	81
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,452	82
డాక్స్	13,745	4
షాంఘై	2,906	21
నికాయ్	23,828	33

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	70.64	72.28
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.98	94.18
€	యూరో	ఎస్‌బీఐ	76.26	79.11
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.84	66.22
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	47.01	49.19
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.62	52.38
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	18.23	19.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	19.95	19.96
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.59	10.99

ఐఆర్‌సీటీసీ: 4 నెలలు... 5 రెట్లు

చుక్‌చుక్ బండి.. దుమ్మురేపింది!

ఐఆర్‌సీటీసీ... భారతీయ రైల్వేకు చెందిన ఈ కంపెనీ షేరు జోరైన లాభాలతో దూసుకుపోతోంది. గత ఏడాది అక్టోబర్‌లో స్టాక్ మార్కెట్లో అరంగేట్రం చేసిన ఈ షేర్... ఇన్వెస్టర్లకు కళ్లు చెదిరే లాభాలను పంచింది. నాలుగు నెలల్లోనే ఐదు రెట్లు పెరిగింది. ఈ కంపెనీ ఐపీఓకు వచ్చినప్పుడూ, లిస్టింగ్‌లోనూ, ఆ తర్వాత ట్రేడింగ్‌లోనూ రికార్డ్‌ల మీద రికార్డ్‌లు సృష్టిస్తూ సాగిపోతోంది. ఈ రికార్డ్‌లకు, లాభాల పరుగుకు కారణాలు, షేరు భవిష్యత్తుపై నిపుణుల అంచనాలు తదితర విశేషాలు సాక్షి బిజినెస్ పాఠకుల కోసం...

- షేర్ జోరు ఆపతరమా!
- దలాల్ స్ట్రీట్‌లో దూసుకుపోతున్న రైల్వే దిగ్గజం
- లిస్టింగ్‌లోనే రెండింతలైన షేరు
- నాలుగు నెలల్లో 400 శాతం లాభం

ప్రస్తుతం ఐఆర్‌సీటీసీ(ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) 4 విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించడం, రైల్వే కేటరింగ్ సర్వీసులు నిర్వహించడం, టూరిజం సర్వీసులు నిర్వహణ, రైల్ నీర్ బ్రాండ్ కింద ప్యాకేజ్‌డ్ వాటర్‌ను విక్రయించడం. టూరిజం సర్వీసులు కాకుండా మిగిలిన మూడు విభాగాల్లో ఈ కంపెనీదే గుత్తాధిపత్యం. ఇక రైల్వేయేతర కేటరింగ్ సర్వీసులు, ఈ-కేటరింగ్, బడ్జెట్ హోటళ్ల రంగంలోకి కూడా విస్తరిస్తోంది. ఈ బుధవారమే ఈ కంపెనీ క్యూ3 ఫలితాలను వెల్లడించింది. నికర లాభం మూడు రెట్లు ఎగసి రూ.206 కోట్లకు చేరగా, మొత్తం ఆదాయం 62 శాతం వృద్ధితో రూ.454 కోట్లకు చేరింది. ఒక్కో షేర్‌కు రూ.10 డివిడెండ్‌ను ఇవ్వనుంది. దీనికి రికార్డ్ డేట్‌గా ఈ నెల 25ను నిర్ణయించింది. ఆర్థిక ఫలితాలు అదరగొట్టడంతో ఐఆర్‌సీటీసీ షేర్ జోరుగా పెరిగింది. గురువారం ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.1,609ను తాకింది. చివరకు 11% లాభంతో రూ.1,580 వద్ద ముగిసింది. ఇష్యూ ధరతో పోలిస్తే ఐఆర్‌సీటీసీ షేర్ ధర 400 శాతం పెరగ్గా, ఈ కాలంలో సెన్సెక్స్ 9 శాతమే లాభపడింది.

ఐపీఓ... అదిరిపోయే ఆరంభం...

గత ఏడాది సెప్టెంబర్ 30, అక్టోబర్ 3ల మధ్య వచ్చిన ఐఆర్‌సీటీసీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) 112 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది. ఇప్పటివరకూ ఒక ప్రభుత్వ రంగ సంస్థ ఐపీఓ ఈ స్థాయిలో ఓవర్ సబ్‌స్క్రైబ్ కావడం ఇదే మొదటిసారి. రూ.320 ఇష్యూ ధరతో ఐపీఓకు వచ్చిన ఈ కంపెనీ షేరు దాదాపు రెట్టింపు ధరకు రూ.626 వద్ద అక్టోబర్ 14న స్టాక్ మార్కెట్లో లిస్టయింది. లిస్టింగ్ రోజునే రూ.744 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకి రూ.729 వద్ద ముగిసింది. లిస్టింగ్‌లోనూ ఈ షేర్ రికార్డ్‌లే సృష్టించింది. ఒక ప్రభుత్వ రంగ సంస్థకు ఈ స్థాయిలో లిస్టింగ్ లాభాలు రావడం కూడా ఇదే మొదటిసారి. ఐపీఓలో షేర్లు దక్కని వాళ్లు జోరుగా ఈ షేర్లు కొన్నారు. ఆ ఒక్కరోజే రూ.3,500 కోట్ల షేర్లు చేతులు మారాయి. ఇటీవల కాలంలో మంచి లాభాలు గడించిన ఐపీఓ ఇదే.

23వ స్థానం...: అత్యంత విలువైన ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రస్తుతం ఈ కంపెనీ 23వ స్థానంలో ఉంది. మార్కెట్ క్యాప్ రూ.25,279 కోట్లు. స్టాక్ మార్కెట్లో అరంగేట్రం చేసినప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి టాప్50లో కూడా ఈ షేర్ లేదు. ఇప్పుడు ఆయిల్ ఇండియా, భెల్, భారత్ ఎలక్ట్రానిక్స్, న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీలను దాటేసింది.

ఐఆర్‌సీటీసీ జైత్రయాత్ర...

విషయం	ధర (రూ.లలో)
ఇష్యూ ధర	320
లిస్టింగ్ ధర	626
ప్రస్తుత ధర	1,580
ఆల్‌టైమ్ హై ధర	1,609

తేజస్‌తో మరింత దూకుడు..

ఈ కంపెనీ తొలి తేజస్ రైలును లక్నో- ఢిల్లీ మార్గంలో ప్రవేశపెట్టింది. ఈ ఏడాది జనవరి 16న రెండో తేజస్ రైలును అహ్మదాబాద్ - ముంబై సెంట్రల్‌కు ప్రారంభించింది. ఆ రోజే ఈ షేర్ నాలుగంకెల ధరకు చేరింది. ఇక మూడో తేజస్ రైలును త్వరలోనే ఇండోర్- వారణాసి మధ్య నడిపించనుంది. తేజస్ రైళ్ల దూకుడుతో ఈ షేర్ ధర మరింత జోరుగా పెరగనుంది.

షేరు ధర ఎందుకు పెరుగుతోందంటే..

ఈ కంపెనీ బిజినెస్ మోడల్ వినూత్నంగా ఉండటం వల్ల షేర్ విలువ మదింపు చేయడం కొంచెం కష్టమేనన్నది నిపుణుల మాట. ఆన్‌లైన్ టికెట్ల విక్రయం, రైల్వే కేటరింగ్ సర్వీసుల్లో గుత్తాధిపత్యం ఈ కంపెనీదే. అసెట్- లైట్ బిజినెస్ మోడల్‌ను అనుసరిస్తున్న ఈ కంపెనీ ఫ్లోటింగ్ షేర్లు (ట్రేడింగ్‌కు అందుబాటులో ఉన్న షేర్ల సంఖ్య) చాలా తక్కువగా ఉండటం వల్ల డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. ధర కూడా పెరిగిపోతూనే ఉంది. ఇటీవలే కేటరింగ్ ఉత్పత్తుల ధరలను పెంచింది. మార్జిన్లు అధికంగా ఉండే తేజస్ రైళ్లను మూడు రూట్లలో నడుపుతోంది. మరిన్ని తేజస్ రైళ్లను తెచ్చే యోచనలో ఉంది. బిజినెస్ మోడల్ నిలకడగా ఉండటం, డివిడెండ్ చెల్లింపులు బాగుండటం (గత మూడేళ్లలో సగటున 50% డివిడెండ్ ఇచ్చింది), రూ.1,100 కోట్ల మేర పుష్కలంగా నగదు నిల్వలు.. ఇవన్నీ సానుకూలాంశాలు. దీర్ఘకాలిక ఇన్వెస్ట్‌మెంట్స్‌కు ఉత్తమ షేరుగా విశ్లేషకులు చెబుతున్నారు. మూడేళ్లలో అమ్మకాలు 23%, లాభం 49% చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని అంచనా.

బహుపరాక్..

ఈ షేర్ ధర జోరుగా పెరుగుతోంది. అయితే డెలివరీ అయ్యే షేర్ల నిష్పత్తి 11-13 శాతమే ఉంది. డే ట్రేడింగ్ బాగా జరుగుతోందనడానికి ఇది నిదర్శనమన్నది నిపుణుల మాట. మొమెంటమ్ గేమ్ ఆడాలనుకుంటే ఇన్వెస్టర్ల చేతులు కాలవచ్చని వారు హెచ్చరిస్తున్నారు. మరోవైపు కంపెనీ వేల్యుయేషన్లు భారీగా పెరిగాయని, కంపెనీ షేరు ధర ఈపీఎస్‌కు 80 రెట్ల వద్ద ట్రేడవుతోందని, ఒకింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇంటర్నెట్ ఆధారిత కార్యకలాపాలు నిర్వహించే ప్రైవేట్ కంపెనీలకు ఈ విలువ సమంజసమైనదే. అయితే ఒక ప్రభుత్వ రంగ కంపెనీకి మాత్రం ఈ విలువ చాలా అధికమన్నది వారి విశ్లేషణ. అధిక వేల్యుయేషన్లు ఉండటంతోపాటు, భవిష్యత్తులో ఈ కంపెనీలో మరోవిడత వాటా విక్రయానికి కూడా అవకాశం ఉందని, ఈ రెండూ ప్రతికూలాంశాలని వారంటున్నారు. అయితే మరింత వాటా విక్రయానికి మరో ఏడాది సమయం ఉంది.

ఐడియా నష్టాలు 6,439 కోట్లు

ఏజీఆర్, తరుగుదల ప్రభావం • 5 శాతం తగ్గిన ఆదాయం

న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) డిసెంబర్ క్వార్టర్లో నష్టాలు మరింతగా పెరిగాయి. గత క్యూ3లో రూ.5,005 కోట్లుగా ఉన్న నికర నష్టాలు ఈ క్యూ3లో రూ.6,439 కోట్లకు చేరాయి. ఏజీఆర్(సవరించిన స్థూల రాబడి)కు సంబంధించిన వడ్డీ వ్యయాలు, ఆస్తులకు సంబంధించిన అధిక తరుగుదల కారణంగా ఈ స్థాయిలో నష్టాలు వచ్చాయని వొడాఫోన్ ఐడియా ఎండీ, సీఈఓ రవీందర్ టక్కర్ చెప్పారు. మరిన్ని వివరాలు.....

30 శాతం పెరిగిన వడ్డీ వ్యయాలు...

గత క్యూ3లో రూ.11,983 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో 5 శాతం పతనమై రూ.11,381 కోట్లకు తగ్గింది. వడ్డీ వ్యయాలు 30 శాతం ఎగసి రూ.3,722 కోట్లకు, తరుగుదల వ్యయాలు 23 శాతం వృద్ధితో రూ.5,877 కోట్లకు పెరిగాయి. సీక్వెన్షియల్‌గా చూస్తే, ఈ కంపెనీ నష్టాలు తగ్గాయి. గత క్యూ2లో రూ.50,922 కోట్ల నికర నష్టాలను కంపెనీ ప్రకటించింది. ఏజీఆర్ బకాయిల కేటాయింపుల కారణంగా ఈ కంపెనీకి ఈ స్థాయిలో నష్టాలు వచ్చాయి.

టారిఫ్‌ల పెంపుతో మెరుగుపడుతున్న ఆదాయం....

ఏజీఆర్‌కు సంబంధించిన ఊరటనివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నామని రవీందర్ టక్కర్ పేర్కొన్నారు. కీలక మార్కెట్లలో కెపాసిటీ విస్తరణ, 4జీ కవరేజ్, నెట్‌వర్క్ ఇంటిగ్రేషన్‌పై ప్రధానంగా దృష్టి పెడుతున్నామని వివరించారు. ఇటీవల టారిఫ్‌లను పెంచడం వల్ల సెప్టెంబర్ నుంచి ఆదాయం పుంజుకుంటోందని పేర్కొన్నారు. గత డిసెంబర్‌లో టారిఫ్‌లను మరింతగా పెంచడం వల్ల ఆదాయం మరింతగా మెరుగుపడగలదని వివరించారు. కాగా వొడాఫోన్ ఐడియా చెల్లించాల్సిన ఏజీఆర్ బకాయిలు రూ.53,000 కోట్ల మేర ఉన్నాయి.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో వొడాఫోన్ ఐడియా షేర్ 0.6 శాతం నష్టంతో రూ.4.48 వద్ద ముగిసింది.

భారత మార్కెట్లో బీఎండబ్ల్యూ 'మినీ క్లబ్‌మాన్'

- ధర రూ. 44.9 లక్షలు.. విక్రయానికి 15 యూనిట్లు
- ఈనెల 15 నుంచి అమెజాన్‌లో బుకింగ్స్

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ 'బీఎండబ్ల్యూ'.. భారత మార్కెట్లో 'మినీ క్లబ్‌మాన్' కారును విడుదలచేసింది. కేవలం 7.2 సెకన్ల వ్యవధిలోనే సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలిగిన ఈ పరిమిత ఎడిషన్ ధర రూ. 44.9 లక్షలు (ఎక్స్-షోరూం)గా కంపెనీ ప్రకటించింది. ఇండియన్ సమ్మర్ రెడ్ ఎడిషన్ పేరిట కేవలం 15 యూనిట్లను మాత్రమే ఇక్కడ విక్రయిస్తోంది. అమెజాన్ డాట్ ఇన్ వెబ్‌సైట్లో కారు బుకింగ్స్ ప్రారంభించనుంది. ఫిబ్రవరి 15 నుంచి బుకింగ్స్ ప్రారంభం కానున్నట్లు కంపెనీ వెల్లడించింది. వెనుకవైపు రెండు డోర్లు (స్ప్లిట్ డోర్)తో కలిపి మొత్తం ఆరు డోర్లు కలిగిన ఈ కారుకు 2-లీటర్ 4-సిలెండర్ ఇంజిన్‌ను అమర్చింది. ట్విన్‌పవర్ టర్బో టెక్నాలజీతో ఇది పనిచేస్తుంది. 7-స్పీడ్ స్టెప్‌ట్రోనిక్ ట్రాన్స్‌మిషన్ (డబుల్ క్లచ్) కలిగిన కొత్త కారు గరిష్టంగా గంటకు 228 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.

ఎగుమతి రంగాలపై ప్రత్యేక దృష్టి

కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ: ఎగుమతులకు సంబంధించి భారత్‌కు అనుకూల పరిస్థితులు ఉన్న 12-13 రంగాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియుష్ గోయల్ వెల్లడించారు. టెక్స్‌టైల్స్ తదితర రంగాలు వీటిలో ఉన్నాయని ఆయన వివరించారు. ప్రస్తుతం 37 బిలియన్ డాలర్లుగా ఉన్న టెక్స్‌టైల్స్ రంగం ఎగుమతులు వచ్చే 10 సంవత్సరాల్లో 100 బిలియన్ డాలర్లకు చేరగలవని గోయల్ పేర్కొన్నారు. సేవల రంగం ఎగుమతులు కూడా మెరుగైన వృద్ధి రేట్లు సాధిస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో మిగతా రంగాలతో పోలిస్తే అధిక స్థాయిలో ఎగుమతులకు ఆస్కారమున్న రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని ఒక సదస్సులో పాల్గొన్న సందర్భంగా గోయల్ చెప్పారు. 2019-20 ఏప్రిల్- డిసెంబర్ మధ్య కాలంలో ఎగుమతులు సుమారు 2 శాతం, దిగుమతులు దాదాపు 9 శాతం క్షీణించిన నేపథ్యంలో గోయల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అసంబద్ధ పోటీ నుంచి దేశీ పరిశ్రమలను కాపాడేందుకు భారత్ కొన్ని రక్షణాత్మక విధానాలు పాటించడం తప్పనిసరిగా మారిందని చెప్పారు.

ఈ-కామర్స్ సంస్థలకు వేల కోట్ల నష్టాలా.. ఎలా...

బిలియన్ల డాలర్ల పెట్టుబడులతో భారత్‌నేమీ ఉద్ధరించడం లేదంటూ అమెజాన్‌ను గతంలో ఆక్షేపించిన గోయల్ తాజాగా ఈ-కామర్స్ కంపెనీల నష్టాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ-కామర్స్ కంపెనీలు వేల కోట్ల నష్టాలు ప్రకటిస్తుండటంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. రూ. 5,000 కోట్ల టర్నోవరుపై ఏకంగా రూ. 6,000 కోట్ల నష్టాలు ప్రకటించిందంటే నమ్మశక్యంగా అనిపించదంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ-కామర్స్ సంస్థలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిందేనని గోయల్ స్పష్టం చేశారు. అలాంటి సంస్థలను ఎప్పుడూ స్వాగతిస్తామని చెప్పారు. అమెజాన్‌పై గతంలో చేసిన వ్యాఖ్యల మీద స్పందిస్తూ మంత్రి తాజా వివరణనిచ్చారు. 'ఈ-కామర్స్‌తో ఇంత మందికి ప్రయోజనం చేకూరుతుందన్న హామీలు వినడానికి ఆకర్షణీయంగానే ఉంటాయి. కానీ చట్టరీత్యా ఆమోదయోగ్యం కాని విధానాల వల్ల పది రెట్లు మంది ప్రయోజనాలు దెబ్బతినకూడదు' అని గోయల్ చెప్పారు.

తగ్గిన జీఎంఆర్ నష్టాలు

క్యూ3లో రూ. 279 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నష్టాలు కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.279 కోట్లకు తగ్గాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నష్టాలు రూ.542 కోట్లు. మరోవైపు స్థూల ఆదాయాలు రూ.1,958 కోట్ల నుంచి రూ. 2,196 కోట్లకు పెరిగాయి. కీలకమైన ఎయిర్‌పోర్ట్స్ విభాగం ఆదాయాలు రూ. 1,358 కోట్ల నుంచి రూ. 1,615 కోట్లకు, విద్యుత్ విభాగం ఆదాయాలు రూ.146 కోట్ల నుంచి రూ.207 కోట్లకు పెరిగినట్లు జీఎంఆర్ వెల్లడించింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ సామర్థ్యాన్ని 1.2 కోట్ల నుంచి (వార్షికంగా) 3.4 కోట్లకు పెంచే దిశగా విస్తరణ పనులు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయని పేర్కొంది. క్యూ3లో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల ట్రాఫిక్ 55 లక్షల నుంచి 9 శాతం వృద్ధితో 59 లక్షలకు చేరగా, ఢిల్లీ విమానాశ్రయంలో 6 శాతం పెరిగి 1.87 కోట్లకు చేరినట్లు తెలిపింది.

భారత్ వృద్ధికి ఢోకా లేదు!

- ఎస్‌అండ్‌పీ అంచనా
- ద్రవ్య, పరపతి, విధాన నిర్ణయాలు ఇందుకు దోహదపడతాయని విశ్లేషణ
- స్టేబుల్ అవుట్‌లుక్‌తో 'బీబీబీ-' సావరిన్ రేటింగ్ కొనసాగింపు
- 2020-21లో 6% వృద్ధికి అవకాశం
- ఆపై రెండేళ్లలో మరింత జోరు

న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వృద్ధి రేటు ప్రస్తుతం మందగమనంలో కొనసాగుతున్నా... దేశ ఆర్థిక మూలాల పటిష్టతపై విశ్వాసాన్ని గ్లోబల్ దిగ్గజ రేటింగ్ సంస్థ- స్టాండెర్డ్ అండ్ పూర్స్ (ఎస్‌అండ్‌పీ) వ్యక్తం చేసింది. దీర్ఘకాలికంగా చూస్తే, భారత్ ఆర్థిక వృద్ధి క్రమంగా పుంజుకుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ప్రభుత్వం వైపు నుంచి జరుగుతున్న వ్యవస్థాగత సంస్కరణలు, ద్రవ్య, పరపతి, విధాన నిర్ణయాలు ఇందుకు దోహదపడతాయని విశ్లేషించింది. 2020-2021లో దేశ వాస్తవిక స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 6 శాతంగా ఉంటుందని అంచనావేసింది. 2021-2022లో ఈ రేటు 7 శాతానికి, అటుపై ఆర్థిక సంవత్సరం 7.4 శాతానికి పెరిగే అవకాశం ఉందని కూడా అభిప్రాయపడింది. ఈ అంచనాల నేపథ్యంలో దీర్ఘకాలికంగా భారత్ సార్వభౌమ రేటింగ్‌ను స్టేబుల్ అవుట్‌లుక్‌తో 'బీబీబీ-'గా కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఒక కంపెనీ లేక దేశం తన ద్రవ్య బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించగలదని 'బీబీబీ' రేటింగ్ సూచిస్తుంది. ఎస్‌అండ్‌పీ ఈ మేరకు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ముఖ్యాంశాలను చూస్తే...

- ఇటీవలి త్రైమాసికాల్లో భారత్ ఆర్థిక వృద్ధి బలహీన ధోరణిని ప్రదర్శిస్తోంది. అయితే దేశ వ్యవస్థాగత వృద్ధి పనితీరు పటిష్టంగా, చెక్కుచెదరకుండా ఉంది. దీనివల్ల వాస్తవిక (ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుని) జీడీపీ వృద్ధి క్రమంగా రెండు మూడేళ్లలో రికవరీ చెందుతుందని భావిస్తున్నాం.
- తోటి వర్ధమాన ఆర్థిక వ్యవస్థలతో పోల్చిచూస్తే, భారత్ ఆర్థిక వ్యవస్థ పనితీరు రానున్న కాలంలో మెరుగ్గానే కొనసాగుతుంది.
- తగిన ద్రవ్య, పరపతి విధానాలు, సైక్లికల్ ఫ్యాక్టర్స్ (తప్పనిసరిగా తిరిగి మెరుగుపడే కొన్ని అంశాలు), సానుకూల వ్యవస్థాగత అంశాలు ఆర్థిక వ్యవస్థ రికవరీకి దోహదపడతాయి. విదేశీ మారకద్రవ్య నిల్వల పరిస్థితి మెరుగ్గా ఉండడం ఇక్కడ గమనార్హం.
- జనాభాలో యువత అధికంగా ఉండడం, పోటీ పూర్వక కార్మిక వ్యయాలు, సానుకూల కార్పొరేట్ పన్ను విధానాల వంటి అంశాలను వ్యవస్థాగతంగా భారత్ ఆర్థిక వ్యవస్థకు సానుకూలమైనవిగా పేర్కొనవచ్చు.
- 2020-2024లో వాస్తవిక జీడీపీ వృద్ధి రేటు సగటు 7.1 శాతంగా ఉంటుందన్నది విశ్లేషణ.
- అయితే భారత్ ద్రవ్య పరిస్థితులు ఇంకా కొంత ఆందోళనకరంగానే ఉన్నాయి. ప్రభుత్వ ఆదాయ వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు, ప్రభుత్వ రుణభారం వంటి అంశాలను ఇక్కడ ప్రస్తావించుకోవచ్చు. ముఖ్యంగా ద్రవ్యలోటు ప్రభుత్వ ప్రణాళికలను దాటిపోయింది. వచ్చే కొద్ది సంవత్సరాల్లో దీని కట్టడి కొంత పరిమితంగానే ఉండే వీలుంది. అయితే ఆయా అంశాల్లో భారత్ పురోగతి సాధించగలిగితే, రేటింగ్ పెరిగే అవకాశాలూ ఉంటాయి. వృద్ధి, ద్రవ్యలోటు వంటి అంశాల్లో తన అంచనాలు విఫలమైతే, రేటింగ్ మరింత కోతకు కూడా వీలుంటుంది.
- నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థల బలహీన పరిస్థితులు వచ్చే కొద్ది త్రైమాసికాల్లో ప్రైవేటు వినియోగాన్ని కట్టడి చేసే వీలుంది.
- జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన అంచనాల ప్రకారం- 2019-20 ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి రేటు 5 శాతం. అయితే 2020-21లో ఈ రేటు 6 శాతంగా ఉండే వీలుందని ఎన్ఎస్ఓ పేర్కొంది. దీనికి సరిసమానంగా ఎస్‌అండ్‌పీ అంచనాలు కూడా ఉండడం గమనార్హం.

అపోలో హాస్పిటల్స్ లాభం 80 శాతం అప్

న్యూఢిల్లీ: అపోలో హాస్పిటల్స్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం(2019-20) డిసెంబర్ క్వార్టర్లో 80% ఎగసింది. గతేడాది (2018-19) క్యూ3లో రూ.50 కోట్లుగా ఉన్న లాభం ఈ క్యూ3లో రూ.90 కోట్లకు పెరిగిందని అపోలో హాస్పిటల్స్‌తెలిపింది. అన్ని విభాగాలు మంచి పనితీరు కనబరచడంతో నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని కంపనీ చైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి తెలిపారు. కార్యకలాపాల ఆదాయం రూ.2,495 కోట్ల నుంచి రూ.2,912 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేర్‌కు రూ.3.25 డివిడెండ్‌ను ఇవ్వనున్నామని తెలిపారు.

భారత పర్యటనకు సత్యా నాదెల్ల

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యా నాదెల్ల భారత్‌లో పర్యటించనున్నారు. తెలుగువాడైన నాదెల్ల ఈ నెల 24-26 తేదీల్లో తన సొంత దేశంలో ఉండనున్నారు. కస్టమర్లు, యువ సాధకులు, విద్యార్థులు, డెవలపర్లు, టెక్ సంస్థల వ్యవస్థాపకులను కలిసేందుకు ఈయన భారత్ వస్తున్నారని ఒక ఈ-మెయిల్ ప్రశ్నకు కంపెనీ బదులిచ్చింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లో నాదెల్ల పర్యటించే అవకాశం ఉందని తెలుస్తోంది. సంస్థ చీఫ్ హోదాలో ఇప్పటికే పలు మార్లు ఈయన భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే కాగా, ఈ సారి పర్యటన ఎందుకనే విషయాన్ని మాత్రం ఇప్పటి వరకు కంపెనీ స్పష్టంచేయలేదు.

నేటి బోర్డ్ మీటింగ్స్...

ఓఎన్‌జీసీ, ఎంబసీ ఆఫీస్ పార్క్స్, రీట్, ఎవరెడీ ఇండస్ట్రీస్ ఇండియా, ఫోర్టిస్ హెల్త్‌కేర్, ఎమ్‌ఎమ్‌టీసీ

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	41,740	▲ 160
బంగారం (22 క్యారెట్లు)	39,750	▲ 150
వెండి (కిలో)	49,700	▲ 300
హైదరాబాద్/చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	40,830	▲ 280
బంగారం (22 క్యారెట్లు)	38,890	▲ 270
వెండి (కిలో)	49,700	▲ 300
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	41,740	▲ 260
బంగారం (22 క్యారెట్లు)	38,820	▲ 240
వెండి (కిలో)	47,000	▼ 500
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	41,000	▲ 180
బంగారం (22 క్యారెట్లు)	37,970	▲ 90
వెండి (కిలో)	47,300	▲ 300
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	42,080	▲ 290
బంగారం (22 క్యారెట్లు)	38,890	▲ 270
వెండి (కిలో)	47,400	▲ 400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	51.41 $ (రాత్రి 11.30కు)	51.17 (బుధవారం ముగింపు)
బ్రెంట్	56.22 $ (రాత్రి 11.30కు)	55.79 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 14-2-2020

విశాఖ	410-00
చిత్తూరు	438-00
వరంగల్	393-00
విజయవాడ	405-00
గోదావరి	405-00
13-2-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00

గణాంకాలతో నష్టాలు

- పెరిగిన కొత్త 'కరోనా' కేసులు
- పతనబాటలో ప్రపంచ మార్కెట్లు
- 0.3 శాతం తగ్గిన ఐఐపీ
- ఐదేళ్ల గరిష్టానికి రిటైల్‌ద్రవ్యోల్బణం
- 106 పాయింట్లు తగ్గి 41,460కు సెన్సెక్స్
- 27 పాయింట్ల నష్టంతో 12,175కు నిఫ్టీ

పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణ గణాంకాలు నిరాశపరచడంతో గురువారం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. చైనాలో కోవిడ్-19(కరోనా) వైరస్ సంబంధిత కొత్త కేసులు పెరగడంతో ప్రపంచ మార్కెట్లు నష్టపోవడం ప్రతికూల ప్రభావం చూపించింది. ముడి చమురు ధరలు 2 శాతం మేర తగ్గినప్పటికీ, మార్కెట్‌కు నష్టాలు తప్పలేదు. బీఎస్ఈ సెన్సెక్స్ 106 పాయింట్లు పతనమై 41,460 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 27 పాయింట్లు నష్టపోయి 12,175 వద్ద ముగిశాయి.

దెబ్బతిన్న సెంటిమెంట్....

గత ఏడాది డిసెంబర్‌లో పారిశ్రామికోత్పత్తి 0.3 శాతం తగ్గింది. ఇక జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం ఐదున్నరేళ్ల గరిష్ట స్థాయి, 7.59 శాతానికి ఎగసింది. కోవిడ్-19(కరోనా) వైరస్ కష్టాల కారణంగా చైనాలో కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతింటాయని, ఫలితంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం ఉండగలదని, దీంతో అంతర్జాతీయంగా చమురుకు డిమాండ్ తగ్గగలదని అంతర్జాతీయ ఇంధన సంస్థ(ఐఈఏ) హెచ్చరించడం.. ఈ అంశాలన్నీ కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,192
ఎన్ఎస్ఈ	34,172
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	28,46,772
ఎఫ్ఐఐ	1,061
డీఐఐ	-960

371 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్....

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైనా, ఆ తర్వాత నష్టాల్లోకి జారిపోయింది. రోజంతా నష్టాలు కొనసాగాయి. ఆరంభంలోనే 143 పాయింట్లు పెరిగినా, ఆ తర్వాత 228 పాయింట్లు నష్టపోయింది. రోజంతా 371 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

- ద్రవ్యోల్బణం పెరగడంతో రేట్ల కోత ఆశలు ఆవిరి కావడంతో వడ్డీరేట్ల ప్రభావిత బ్యాంక్, ఆర్థిక రంగ షేర్లు నష్టపోయాయి.
- ఇండస్ఇండ్ బ్యాంక్ 3.8 శాతం నష్టంతో రూ.1,230 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.
- స్టాక్ మార్కెట్ నష్టపోయినప్పటికీ, పలు షేర్లు ఇంట్రాడేలో ఆల్‌టైమ్ హైలను తాకాయి. హెచ్‌యూఎల్, అవెన్యూ సూపర్‌మార్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఇప్కా ల్యాబ్స్, ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్, ట్రెంట్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

2019 అక్టోబర్-డిసెంబర్ కాలానికి..

కంపెనీ	నికర లాభం 2019-20	నికర లాభం 2018-19	నికర లాభం వృ./క్షీ.(%)	మొత్తం ఆదాయం 2019-20	మొత్తం ఆదాయం 2018-19	మొత్తం ఆదాయం వృ./క్షీ.(%)
*నెస్లే ఇండియా	473	342	38	3,131	2,879	9
ఫ్యూచర్ రిటైల్	165	198	-17	5,209	5,374	-3
పీసీ జ్యూయలర్	36	133	-73	1,704	2,235	-24
ఐఎఫ్‌సీఐ	335	(32)	--	687	762	-10
శ్రీ రేణుక షుగర్స్	(209)	311	--	1,004	1,140	-12

(రూ. కోట్లలో)

* ఒక్కో షేరుకు రూ. 61 తుది డివిడెండ్ (నష్టం)

బ్యాంకింగ్ మోసాలు రూ. 1.17 లక్షల కోట్లు!



ఇండోర్: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్‌కు సంబంధించి 2019 ఏప్రిల్- డిసెంబర్ మధ్య జరిగిన మోసాల విలువ రూ.1.17 లక్షల కోట్లు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద వెల్లడైన అంశమిది.

బ్యాంకుల వారీగా చూస్తే...

- 9 నెలల్లో 4,769 కేసుల వల్ల రూ.30,300 కోట్ల నష్టాలు ఎస్‌బీఐకి ఎదురయ్యాయి.
- పీఎన్‌బీ విషయంలో కేసుల సంఖ్య 294 అయితే, నష్టం విలువ రూ.14,929 కోట్లు.
- 250 కేసుల్లో రూ.11,166 కోట్ల మోసపూరిత నష్టాలను బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదుర్కొంది.
- ఇక అలహాబాద్ బ్యాంక్ కేసుల సంఖ్య 860 అయితే, విలువ రూ.6,782 కోట్లు.
- బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.6,626 కోట్లకు సంబంధించి 161 కేసులను ఎదుర్కొంది.
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 292 కేసులను ఎదుర్కొంది. విలువ రూ.5,605 కోట్లు.
- ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ 151 కేసులు (రూ.5,557 కోట్లు) ఎదుర్కొంటే, ఓబీసీ విషయంలో కేసుల సంఖ్య 282 అయితే, వీటి విలువ రూ.4,899 కోట్లు.

షేర్ల దుర్వినియోగానికి చెక్

ఆన్‌లైన్ వ్యవస్థను రూపొందించిన సెబీ

న్యూఢిల్లీ: క్లయింట్ల షేర్లను స్టాక్ బ్రోకర్లు సొంతానికి వాడుకున్నా, ఇన్వెస్టర్ల నిధులను పక్కదారి పట్టించినా సత్వరం గుర్తించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ సిస్టమ్‌ను రూపొందించినట్లు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గురువారం వెల్లడించింది. ఇలాంటి కేసుల్లో స్టాక్ ఎక్స్ఛేంజీలను ఈ సిస్టమ్ వెంటనే అప్రమత్తం చేస్తుందని పేర్కొంది. క్లయింట్లు తనఖాగా ఉంచిన షేర్లను కొన్ని బ్రోకింగ్ సంస్థలు.. సొంత అవసరాల కోసం లేదా ఇతర క్లయింట్ల అవసరాల కోసం దుర్వినియోగం చేసిన ఉదంతాలు వెలుగుచూసిన నేపథ్యంలో సెబీ తాజా చర్యలు తీసుకుంది. ఈ వ్యవస్థ కింద.. బ్రోకర్లు వారంవారీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించే క్లయింట్ల షేర్ల డేటా వివరాలను సెబీ ఆన్‌లైన్ సిస్టమ్ సేకరిస్తుంది. క్లయింట్ డీమ్యాట్ అకౌంట్లో ఉన్న షేర్లు, మరుసటి రోజున బ్రోకరు చూపించిన షేర్ల పరిమాణాన్ని పోల్చి చూస్తుంది. ఏవైనా వ్యత్యాసాలు కనిపించిన పక్షంలో ఎక్స్ఛేంజీలను అప్రమత్తం చేస్తుంది. ప్రతీవారం ఈ నివేదికలు విడుదల చేస్తామని, ఇప్పటికే ఇలాంటి మూడు కేసులను ఎక్స్ఛేంజీలకు తెలియజేశామని సెబీ ఒక ప్రకటనలో తెలిపింది.

బీపీసీఎల్ లాభం మూడు రెట్లు అప్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీపీసీఎల్(భారత్ పెట్రోలియమ్ కార్పొ లిమిటెడ్) నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం(2019-20) మూడో త్రైమాసిక కాలంలో మూడు రెట్లు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం(2018-19) క్యూ3లో రూ.699 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.2,051 కోట్లకు పెరిగింది. స్థూల లాభం రూ.638 కోట్ల నుంచి రూ.2,247 కోట్లకు ఎగసింది. నికర లాభం మూడు రెట్లు పెరిగినా, కార్యకలాపాల ఆదాయం మాత్రం తగ్గింది. గత క్యూ3లో రూ.89,325 కోట్లుగా ఉన్న ఆదాయం ఈ క్యూ3లో రూ.85,927 కోట్లకు తగ్గింది.

ఎన్ఏసీఎల్ ఆదాయం 19 శాతం వృద్ధి

హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఆదాయం 19 శాతం వృద్ధి చెంది రూ. 202 కోట్ల నుంచి రూ. 241 కోట్లకు చేరినట్లు ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ (గతంలో నాగార్జున అగ్రికెమ్) వెల్లడించింది. నికర లాభం రూ. 1.45 కోట్ల నుంచి రూ. 3.09 కోట్లకు పెరిగింది. దేశీయంగా అమ్మకాలు 14 శాతం, ఎగుమతులు 30 శాతం పెరగడంతో ఆదాయాలు మెరుగుపడినట్లు సంస్థ తెలిపింది. మరోవైపు, గుజరాత్‌లో రసాయనాల తయారీ ప్రాజెక్టు కోసం రూ. 150 కోట్ల పెట్టుబడులతో కొత్తగా పూర్తి అనుబంధ సంస్థ ఏర్పాటుకు సంస్థ బోర్డు ఆమోదముద్ర వేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని పైడిభీమవరంలో ప్రతిపాదిత ప్రాజెక్టు కోసం కొత్తగా ఇంకో అనుబంధ సంస్థ ఏర్పాటుకూ ఆమోదం తెలిపింది.

ఎయిర్ ఇండియా సీఎండీగా రాజీవ్ బన్సాల్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాకు సీఎండీగా సీనియర్ ప్రభుత్వ అధికారి రాజీవ్ బన్సాల్‌ను ప్రభుత్వం గురువారం నియమించింది. నాగాలాండ్ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్ బన్సాల్.. గతంలో విజయవంతంగా సంస్థను నడిపించారు. 2017లో మూడు నెలలపాటు మధ్యంతర సీఎండీగా సేవలందించారు. ఆ సమయంలో వ్యయాలను గణనీయంగా తగ్గించి, సమయానికి విమానాలు నడిచేలా చేశారు. దీంతో ప్రస్తుతం అప్పుల ఊబిలో కూరుకుపోయిన సంస్థను గాడిలో పెట్టేందుకు ఆయన్ని మళ్లీ నియమించింది.

బీఎండబ్ల్యూ '530ఐ స్పోర్ట్' విడుదల

న్యూఢిల్లీ: భారత మార్కెట్లో సెడాన్ '530ఐ స్పోర్ట్' కారును బీఎండబ్ల్యూ గురువారం ప్రవేశపెట్టింది. భారత్ స్టేజ్ (బీఎస్)-6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న 2-లీటర్ 4-సిలెండర్ పెట్రోల్ ఇంజిన్‌ను కొత్త కారులో అమర్చింది. కేవలం 6.1 సెకన్ల వ్యవధిలోనే సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలిగిన ఈ కారు ప్రారంభ ధర రూ. 55.4 లక్షలు (ఎక్స్-షోరూం)గా ప్రకటించింది.

చైనాలో వాహన విక్రయాలు డౌన్

- జనవరిలో 20% క్షీణత
- వైరస్ భయాలతో ఫ్యాక్టరీలు, డీలర్‌షిప్‌లు మూసివేత

బీజింగ్: చైనాలో వాహన విక్రయాలకు కరోనా వైరస్ సెగ తగులుతోంది. జనవరిలో ఆటో అమ్మకాలు .. గతేడాది జనవరితో పోలిస్తే ఏకంగా 20.2 % పడిపోయాయి. 16 లక్షలకు పరిమితమైనట్లు చైనా వాహన తయారీ సంస్థల సమాఖ్య సీఏఏఎం ప్రకటించింది. అమ్మకాలు పడిపోవడంతో కంపెనీలు తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాయని పేర్కొంది. అమెరికాతో వాణిజ్య యుద్ధం, వృద్ధి మందగమనం, ఉద్యోగాల కోత వంటి సమస్యలతో చైనా సతమతమవుతుండగా.. తాజాగా మరిన్ని కష్టాలు చుట్టుముడుతున్నాయి. కరోనా వైరస్ మరింత విస్తరించకుండా కట్టడి చేసేందుకు నూతన సంవత్సర సెలవులను మరింతగా పొడిగించడం.. ఫలితంగా ఫ్యాక్టరీలు, డీలర్‌షిప్‌లు మూతబడటం మొదలైన పరిణామాలు ఆటోమొబైల్ పరిశ్రమను మరింతగా కుదేలు చేస్తున్నాయి. సాధారణంగా జనవరిలో సెలవుల సీజన్ తర్వాత ఫిబ్రవరిలో అమ్మకాలు భారీగా నమోదవుతాయి. అయితే, ప్రస్తుతం ఫిబ్రవరి సగం గడిచిపోయినా.. కంపెనీలు ఇంకా తయారీ కార్యకలాపాలు ప్రారంభించలేదు. స్వల్పకాలికంగా వాహనాల ఉత్పత్తి, అమ్మకాలపై గణనీయంగా ప్రతికూల ప్రభావం పడుతోందని, పరికరాల సరఫరా వ్యవస్థకు సమస్యలు తప్పవని సీఏఏఎం తెలిపింది.

గోద్రేజ్ ఇండస్ట్రీస్ లాభం రూ.216 కోట్లు

న్యూఢిల్లీ: గోద్రేజ్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ3 కాలంలో రూ.216 కోట్ల నికర లాభం(కన్సాలిడేటెడ్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.156 కోట్ల నికర లాభం ఆర్జించింది. కార్యకలాపాల ఆదాయం రూ.2,418 కోట్ల నుంచి రూ.2,696 కోట్లకు పెరిగిందని పేర్కొంది.

ఎండీగా మళ్లీ నదీర్ గోద్రేజ్...

కంపెనీ ఎండీగా నదీర్ గోద్రేజ్ మళ్లీ నియమితులయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

రాష్ట్రీయం

కేంద్రంతో సమానంగా...

పంచాయతీలకు నిధులు

- బడ్జెట్‌లో రూ.2,714 కోట్లు కేటాయింపు
- పల్లె సమగ్ర వికాసానికి అదనపు కలెక్టర్లు చొరవ చూపాలి: మంత్రి ఎర్రబెల్లి

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు సమృద్ధిగా నిధులు విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వచ్చే బడ్జెట్‌లో పంచాయతీల అభివృద్ధికి రూ.2,714 కోట్లను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. దీంతో స్థానిక సంస్థలకు నిధుల కొరత ఉండదని స్పష్టం చేశారు. గురువారం ఎంసీహెచ్‌ఆర్డీలో 'కొత్త పంచాయతీరాజ్ చట్టం'పై అదనపు కలెక్టర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక సంఘం నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక సంస్థలకు నిధులు కేటాయిస్తోందని, తద్వారా గ్రామ పంచాయతీలకు ప్రతీ నెల రూ.339 కోట్లు విడుదల చేస్తోందని తెలిపారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన మిషన్ భగీరథ ఖర్చు భారం గ్రామపంచాయతీలపై వేయడం లేదని మంత్రి అన్నారు.

పారదర్శకతకు పెద్దపీట వేయాలనే..

పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర గ్రామీణ విధానాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగానే కొత్త పంచాయతీరాజ్ చట్టానికి శ్రీకారం చుట్టిందని, తద్వారా గ్రామీణ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేసిందన్నారు. స్థానిక సంస్థల అధికారాలు, విధులు, నిధులు, బాధ్యతల విషయంలో స్పష్టత ఏర్పడిందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రంగా ఉండటంతోపాటు సమగ్ర అభివృద్ధి జరగాలనే లక్ష్యంతో 'పల్లె ప్రగతి'ని రూపొందించామని, మొదటి దశ స్ఫూర్తిని కొనసాగించే విషయంలో ఆశించిన మేరకు జరగలేదనే అభిప్రాయంతో సీఎం కేసీఆర్ ఉన్నారని తెలిపారు. అదనపు కలెక్టర్లు పల్లె ప్రగతి ఒరవడిని కొనసాగించడంలో చొరవచూపాలని పిలుపునిచ్చారు. వైకుంఠధామం, డంపింగ్ యార్డులు, ఇంకుడుగుంతలు, నర్సరీలు, హరితహారం, ఉపాధిహామీ పథకంలో నిధుల వినియోగం, దాతల విరాళాలు, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ, మిషన్ భగీరథ నల్లాల పరిశుభ్రత, వాల్టా అమలు, జరిమానాల విధింపుపై అదనపు కలెక్టర్లు పకడ్బందీగా వ్యవహరించాలని ఆదేశించారు. సదస్సులో ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ రఘునందన్‌రావు, స్పెషల్ కమిషనర్ సైదులు, ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ అడిషనల్ డైరెక్టర్ బెనహార్ దత్ ఎక్కా తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుండగా, పంచాయతీరాజ్, పురపాలక చట్టంపై శుక్రవారం జరిగే సదస్సులో జిల్లా కలెక్టర్లు పాల్గొననున్నారు.

లోగోను ఆవిష్కరిస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ. చిత్రంలో సీపీ అంజనీ కుమార్ తదితరులు

భద్రతే మా తొలి ప్రాధాన్యం

- హోం మంత్రి మహమూద్ అలి
- సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ లోగో ఆవిష్కరణ

హైదరాబాద్: ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన తెలంగాణ ప్రభుత్వం పోలీసుశాఖకు అత్యధిక నిధులు కేటాయించిందని హోం శాఖ మంత్రి మహమూద్ అలి చెప్పారు. గురువారం హోటల్ ఐటీసీ కాకతీయలో జరిగిన కార్యక్రమంలో 'హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్'లోగోను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసు పెట్రోలింగ్ వ్యవస్థ పటిష్టానికి సీఎం రూ.700 కోట్లు కేటాయించారని, రూ.500 కోట్లతో నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ టవర్ నిర్మాణం పూర్తయితే లక్ష సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. స్త్రీలు, పిల్లలు, వ్యాపారస్తులు, రోడ్డు భద్రత, సైబర్ సెక్యూరిటీ వంటివి దృష్టిలో ఉంచుకుని సెక్యూరిటీ కౌన్సిల్ పని చేస్తుందన్నారు. నేరాల నియంత్రణలో నగర పోలీసులు దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తున్నారని, అందుకు కారణం సీఎం కేసీఆర్ అన్నారు. నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ మాట్లాడుతూ తెలంగాణ పోలీసుల పనితీరుతో ఇక్కడ నక్సలిజం, ఉగ్రవాదం వంటి వాటికి తావులేదన్నారు. అనంతరం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌కు జూబ్లీహిల్స్ సొసైటీ రూ.10 లక్షలు, అన్నపూర్ణ స్టుడియో రూ.3 లక్షలు, నిర్మాత దిల్ రాజు రూ.3 లక్షలు.. తదితర మొత్తం రూ.45 లక్షల విరాళాన్ని హోం మంత్రికి అందజేశారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ చైర్మన్‌గా సీపీ అంజనీకుమార్ వ్యవహరిస్తారు. కార్యక్రమంలో పలువురు ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ భర్తల కేసుల్లో సత్వర విచారణ

విమెన్‌సేఫ్టీ వింగ్ ఐజీ స్వాతి లక్రా

సాక్షి, హైదరాబాద్: ఎన్ఆర్ఐ భర్తల వేధింపుల కేసులను వేగంగా విచారించి నిందితులకు శిక్ష పడేందుకు చర్యలు తీసుకుంటున్నామని విమెన్ సేఫ్టీ వింగ్ ఐజీ స్వాతి లక్రా వెల్లడించారు. ఎన్ఆర్ఐ వివాహాల్లో సమస్యలు, మోసాల పరిష్కారానికి వివిధ శాఖల మధ్య సహకారం, సమన్వయానికి మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో గురువారం కన్వర్జెన్స్ వర్క్ షాప్ జరిగింది. ఐజీ స్వాతి లక్రా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఎన్ఆర్ఐ సెల్‌తో పాటు రాష్ట్రంలోని పలు మహిళా పోలీస్ స్టేషన్లలో 586 ఎన్ఐఆర్ వైవాహిక సంబంధిత ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. 2019 జూలై 17న హైదరాబాద్‌లో ప్రారంభించిన ప్రత్యేక ఎన్ఆర్ఐ సెల్‌లోనే ఇప్పటివరకు 73 ఫిర్యాదులు అందగా వీటిలో 70పై కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసులను సమర్థంగా విచారించేందుకు దర్యాప్తు అధికారులకు ఎస్ఓపీలను రూపొందించామని వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ విదేశీ మంత్రిత్వ శాఖ, జాతీయ మహిళా కమిషన్, విదేశీ ఎంబసీలతో సమన్వయం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రం ఆవిర్భావ తర్వాత నమోదైన మొత్తం 586 ఎన్ఆర్ఐ కేసులలో 248 కేసులు హైదరాబాద్ కమిషనరేట్లో, 99 కేసులు రాచకొండ పరిధిలో, 99 సైబరాబాద్, వరంగల్‌లో 42, కరీంనగర్‌లో 21, నిజామాబాద్లో 8, నల్లగొండ, సిద్దిపేట, ఖమ్మం జిల్లాల్లో ఏడు కేసుల చొప్పున, మహబూబ్‌నగర్ లో 6, రామగుండం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, జగిత్యాల జిల్లాల్లో 5 కేసుల చొప్పునర నమోదయ్యాయని వివరించారు.

Department of Agriculture
Government of Andhra Pradesh

REQUEST FOR PROPOSAL (RFP)

Department of Agriculture, AP invites bids for selection of Agencies for Printing and Supply of 8,70,692 Books for Dr. YSR Polambadi & Rythu Bharosa Kendralu. For other details please visit **www.apagrisnet.gov.in** or **www.tender.apeprocurement.gov.in**

Sd/- Sri H. Arun Kumar, I.A.S., Special Commissioner of Agriculture

DIPR RO.No.385 PP/CL/Advt/1/1/2019-20, Dt: 13.02.2020

Andhra Pradesh State Skill Development Corporation (APSSDC)

Andhra Pradesh State Skill Development Corporation (APSSDC) invites EOI for selection of qualified and reputed Architecture Firms for Designing Campuses of "Skills University (Academic & Residential)" and "Skill college (Academic & Residential)" in Andhra Pradesh.

For further details please Visit: **apssdc.in** website.

Further updates if any will be posted in www.apssdc.in

MD & CEO, APSSDC, Vijayawada.

DIPR.Ro.No.389PP/CL/ADVT/1/1/2019-20 Dt:13/02/2020

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, రెవెన్యూ సర్కిల్, హైదరాబాద్-04

టెండరు ప్రకటన

e-టెండరు ప్రకటన నం. & తేది	పని పేరు	అంచనా కాంట్రాక్ట్ విలువ
EP. No.138/CGM(E)/ రెవెన్యూ సర్కిల్/ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే సర్వీసెస్/2019-20 తేది: 13.02.2020	2 సంవత్సరాల కాలానికి ఆన్‌లైన్‌లో HMWSSB చే జారీచేయబడే వాటర్ బిల్ చెల్లింపులు మరియు కొత్త కనెక్షన్ చార్జీలు, ప్రాసెసింగ్ రుసుము మరియు ఇతర డిమాండ్ నోటీసుల ప్రకారం తమ చెల్లింపులు జరిపేందుకు HMWSSB వినియోగదారులకు వీలు కల్పించేందుకు HMWSSBకి ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే సర్వీసులు ఏర్పాటు చేయుట	రూ. 76,05,482/-

1) బిడ్ వివరాలు & డాక్యుమెంట్ వెబ్‌సైట్ https://tender.telangana.gov.in లో ఆన్‌లైన్ ద్వారా 14.02.2020న మ.12.00 గం. నుండి లభిస్తాయి.
2) ప్రి బిడ్ సమావేశం 17.02.2020న ఉ.11.30 గం.కు నిర్వహించబడును.
3) టెండరు కోరే అథారిటీ పేరు & చిరునామా: చీఫ్ జనరల్ మేనేజర్ (E), రెవెన్యూ సర్కిల్, HMWSSB, ఖైరతాబాద్, హైదరాబాద్-04 ఫోన్ నం.(ల్యాండ్‌లైన్): 040-23442834 (Ext No: 600)

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), రెవెన్యూ సర్కిల్, హైదరాబాద్-500004

8,212 మందికి కరోనా స్క్రీనింగ్

- హైదరాబాద్ విమానాశ్రయంలో కొనసాగుతున్న థర్మల్ స్కానింగ్
- కరోనా అనుమానాలపై రాష్ట్ర కంట్రోల్ రూమ్‌కు 368 మంది ఫోను
- వారిలో 185 మందిని ఎటూ వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలని ఆదేశాలు
- ఇప్పటివరకు 87 మంది నమూనాల సేకరణ.. 85 మందికి నెగెటివ్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన కరోనా థర్మల్ స్కానింగ్ ద్వారా స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. గత నెల 30 నుంచి ఇప్పటి వరకు వివిధ దేశాల నుంచి వచ్చిన వారిలో 8,212 మందికి థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేసింది. వారంతా చైనా, హాంగ్‌కాంగ్, దక్షిణకొరియా, థాయిలాండ్, సింగపూర్, జపాన్ తదితర దేశాల నుంచి వచ్చినవారే. కరోనా లక్షణాలుంటే ప్రాథమికంగా థర్మల్ స్కానింగ్‌లో గుర్తించడానికి వీలుంది. ప్రధానంగా జ్వరం ఉష్ణోగ్రతలు థర్మల్ స్కానింగ్‌లో గుర్తిస్తారు. జలుబు, దగ్గు వంటి లక్షణాలుంటే నేరుగా నిర్ధారిస్తున్నారు. థర్మల్ స్కానింగ్‌లో కరోనా అనుమానిత లక్షణాలున్న వారిలో కొందరిని ఆసుపత్రికి తరలించగా, మరికొందరికి జాగ్రత్తలు సూచిస్తూ వారి వారి ఇళ్ల నుంచి బయటకు రాకుండా చూసుకోవాలని సలహాలిచ్చి పంపారు. ఇప్పటివరకు 96 మందిని బయటకు రాకుండా ఇళ్లల్లోనే ఒంటరిగా 28 రోజులు ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు సూచించాయి. కాగా వారి వివరాలను అధికారులు అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 87 మంది నుంచి నమూనాలను సేకరించారు. వారిలో 85 మందికి నెగెటివ్ రాగా, మరో ఇద్దరి నమూనాలను గురువారం పరీక్షల కోసం పంపారు. వాటి వివరాలు రావాల్సి ఉంది. కరోనాపై ఎలాంటి భయాలు వద్దని, ఇక్కడి వాతావరణ పరిస్థితులకు వైరస్ బతికే పరిస్థితి ఉండదని ప్రజారోగ్య డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు భరోసా ఇస్తున్నారు. అయితే జాగ్రత్తలు పాటించాలని పదేపదే చెబుతున

రైతన్నదే ముఖ్య భూమిక

వ్యవసాయ వర్సిటీలో గవర్నర్ తమిళిసై పర్యటన

రాజేంద్రనగర్: ప్రపంచంలో వ్యవసాయరంగంతోపాటు అన్నదాతది ప్రథమ స్థానమని గవర్నర్, వ్యవసాయ వర్సిటీ చాన్స్‌లర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీలో ఆమె పర్యటించారు. తొలుత ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో యంత్రాల ద్వారా వరినాట్ల విధానాన్ని, పాలీహౌస్‌ను, వర్సిటీ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను పరిశీలించారు. చిరుధాన్యాల ఉత్పత్తుల కేంద్రాన్ని, పర్యావరణహిత గణేశ్ విగ్రహాలు, హోలీరంగుల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఏజీ బీఎస్సీ చివరి ఏడాది విద్యార్థులు ప్రయోగాత్మకంగా చేస్తున్న సాగుపై గవర్నర్ వివరాలడిగారు. ఎలక్ట్రానిక్ విధానం ద్వారా పుస్తకాలిచ్చే, తీసుకునే విధానాన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ.. రైతుబిడ్డలుగా విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు రైతుబిడ్డలకీ తల్లిదండ్రులుగా మారాలన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. ఐదేళ్లలో అనేక జాతీయ, అంతర్జాతీయ వర్సిటీలు, సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు, వివిధ విత్తనాల రూపకల్పన గురించి వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు, శాస్త్రవేత్తలు ఆమెకు వివరించారు.

గురువారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీలో వరినారును పరిశీలిస్తున్న గవర్నర్ తమిళిసై

వన్ పోలీస్.. వన్ వాట్సాప్!

రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులకు ఒకే నంబర్..

- వాట్సాప్ బిజినెస్ అకౌంట్ వైపు అధికారుల మొగ్గు
- డీజీపీ కార్యాలయం కేంద్రంగా వ్యవస్థ నిర్వహణ
- నెలలో అమలుకు తెలంగాణ పోలీసుల సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పోలీసు- 9490616555, సైబరాబాద్ కాప్స్- 9490617444, రాచకొండ కమిషనరేట్- 9490617111.. రాజధాని భౌగోళికంగా కలిసే ఉన్నా.. పరిధుల పరంగా మూడు కమిషనరేట్లు ఉండటంతో వేర్వేరు వాట్సాప్ నంబర్లు ఏర్పాటు చేశారు. ఈ సాంకేతిక అంశాలు తెలియని కొందరు బాధితులు ఫిర్యాదుచేసే విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తొమ్మిది కమిషనరేట్లు, 19 పోలీసు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. దీన్ని పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర పోలీసు విభాగం ఒకే వాట్సాప్ నంబర్ అమల్లోకి తేవాలని నిర్ణయించింది. డీజీపీ కార్యాలయం కేంద్రంగా దీన్ని నిర్వహిస్తారు.

ఫిర్యాదుల మానిటరింగ్‌కు పదిమంది

ఏదైనా సమస్య ఎదుర్కొంటున్న, నేరాల బారిన పడిన వారు పోలీసులకు సమాచారమివ్వడానికి పలు వేదికలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏకరూప 'డయల్-100' వ్యవస్థ అందుబాటులో ఉంది. అయితే ఫోన్‌కాల్ ద్వారా మాత్రమే దీనికి ఫిర్యాదు చేసే ఆస్కారం ఉంది. వాయిస్ రికార్డులు, వీడియోలు, ఫొటోలు వంటివి పంపించడానికి పోలీసు విభాగాలు ట్విట్టర్ వంటివి అందుబాటులోకి తెచ్చినా.. వాట్సాప్ మాదిరిగా ప్రతి ఒక్కరూ ఈ సామాజిక మాధ్యమాన్ని వినియోగించుకోలేరు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు ఎవరికి వారుగా వాట్సాప్ నంబర్లు ఇచ్చారు. వీరంతా తమకందే ఫిర్యాదుల్ని మానిటర్ చేయడానికి ఎక్కడికక్కడ ప్రత్యేకంగా సోషల్‌మీడియా సెల్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మూడు షిఫ్టుల్లో పనిచేయడానికి కనీసం పదిమందిని కేటాయిస్తున్నారు. సిబ్బంది కొరత, బందోబస్తు సందర్భాల్లో ఈ సోషల్‌మీడియా వింగ్ సిబ్బందినీ అక్కడకు మోహరిస్తున్నారు. అలా కాక, రాష్ట్ర పోలీసు విభాగానికి ఒకే వాట్సాప్ నంబర్ అందుబాటులోకి తెస్తే డీజీపీ కార్యాలయం కేంద్రంగా పదిమందిని నియమిస్తే సరిపోతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. వీళ్లే రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న ఫిర్యాదుల్ని సమీక్షిస్తూ సంబంధిత విభాగాలకు పంపిస్తారు. నేరుగా ఆయా పోలీసుస్టేషన్లకే ఈ ఫిర్యాదుల్ని పంపే వీలు కలగనుంది.

ఒకే నంబర్‌తో ఎంతో సౌలభ్యం

ప్రస్తుతం జిల్లాలు, కమిషనరేట్ల అధీనంలోనే వాట్సాప్ నంబర్లు ఉండటంతో ఉన్న తాధికారులకు ఫిర్యాదు చేయడానికి ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. తాము ఫిర్యాదుచేస్తే ఆ సమాచారం తక్షణం సదరు అధికారికి తెలిసిపోతుందని, తమ నంబర్లు సైతం వారికి అందుతాయనే భావనతో పలువురు ఫిర్యాదులకు వెనకడుగు వేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే నంబర్.. అదీ డీజీపీ కార్యాలయం కేంద్రంగా అందుబాటులోకి వస్తే ఎటువంటి ఫిర్యాదులనైనా ప్రజలు ధైర్యంగా చేయగలుగుతారని అధికారులు అంటున్నారు. సాధారణ వాట్సాప్ కంటే 'వాట్సాప్ బిజినెస్ అకౌంట్'లో అదనపు హంగులున్నాయి. సాధారణ వాట్సాప్‌లో ప్రత్యేక సెట్టింగ్స్ లేనప్పుడు ఒకరు పంపిన సందేశానికి వచ్చే బ్లూ టిక్స్ ఆధారంగా ఎదుటివారు చూశారా? లేదా? అనేది తెలుసుకోవచ్చు. అదే 'వాట్సాప్ బిజినెస్ అకౌంట్'లో కొన్ని సందేశాలను ఫిర్యాదు అందిన వెంటనే ఆటోమేటిక్‌గా, దానికి జవాబుగా పంపే ఆస్కారం ఉంది. ఈ సదుపాయంతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే పోలీసు నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి డీజీపీ కార్యాలయం కసరత్తు చేస్తోంది. నెలలో దీన్ని అమల్లోకి తెచ్చి విస్తృత ప్రచారం కల్పించనున్నారు.

సెకండ్ షిఫ్ట్ 'పాలిటెక్నిక్'కు ప్రత్యేక సదుపాయాలు: ఏఐసీటీఈ

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో సెకండ్ షిఫ్ట్‌లో నడిచే పాలిటెక్నిక్ కాలేజీలకు 2022 నుంచి ప్రత్యేక సదుపాయాలు, ప్రత్యేక లెక్చరర్లు ఉండాల్సిందేనని ఏఐసీటీఈ స్పష్టం చేసింది. వాటిని సెకండ్ షిఫ్ట్ కాకుండా ఫస్ట్ షిఫ్టుగానే కొనసాగించాలని పేర్కొంది. అయితే 2020-21 విద్యా సంవత్సరంతో పాటు 2021-22 విద్యా సంవత్సరం వరకు మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు తమ అప్రూవల్ ప్రాసెస్ హ్యాండ్ బుక్‌లో పేర్కొన్న నిబంధనలను గురువారం సవరించింది. అలాంటివి ప్రస్తుతం రాష్ట్రంలో 92 ప్రైవేట్, 11 ప్రభుత్వ కాలేజీలున్నాయి. వాటన్నింటికి ఈ నిబంధనలు వర్తించనున్నాయి. మరోవైపు వరుసగా ఐదేళ్లు వివిధ ఇంజనీరింగ్ కోర్సుల్లో 30 శాతం సీట్లు లోపు నిండకపోతే ఆయా కోర్సుల్లో 50 శాతం సీట్లు కోత పెడతామని స్పష్టంచేసింది. కాగా రాష్ట్రంలో వరుసగా మూడేళ్లు 25 శాతం లోపు సీట్లు నిండని కోర్సులకు అనుమతి ఇవ్వమని ఇప్పటికే జేఎన్‌టీయూ స్పష్టం చేసింది.

7వరకు పాలిటెక్నిక్ కాలేజీల అఫీలియేషన్‌కు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ కాలేజీల అనుబంధ గుర్తింపునకు (అఫీలియేషన్) నోటిఫికేషన్‌ను రాష్ట్ర సాంకేతిక విద్యా, శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) విడుదల చేసింది. వచ్చే నెల 7వ తేదీ వరకు కాలేజీ యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. రూ.5 వేల ఆలస్య రుసుముతో వచ్చే నెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చుంది. అదే నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తనిఖీలు చేపట్టి ఏప్రిల్ 20న అనుబంధ గుర్తింపు జారీ ప్రక్రియను ప్రారంభిస్తామని వివరించింది. ఇక గతేడాది మొత్తం 145 కాలేజీలుండగా, అందులో 92 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. ప్రైవేటు కాలేజీల్లో ఈసారి ఐదారు కాలేజీలు మూతపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అవి క్లోజర్‌కు దరఖాస్తు చేసుకునే పరిస్థితి ఉందన్నారు.

పలు పోస్టులకు 16, 17న కంప్యూటర్ టెస్టులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్, టీఎస్ బేవరేజెస్ కార్పొరేషన్‌లో పలు పోస్టులకు ఈ నెల 16, 17 తేదీల్లో కంప్యూటర్ అప్లికేషన్స్, అకౌంట్స్‌కు సంబంధించి టెస్టులు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టెస్టులు ఉదయం 10 నుంచి 11.30 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొంది. వీటికి సంబంధించిన హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించింది. పూర్తి వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొంది.

ఏఎస్‌డబ్ల్యూవో పోస్టుల భర్తీకి ఆమోదం

సాక్షి, హైదరాబాద్: దళిత అభివృద్ధి శాఖలో ఖాళీగా ఉన్న నాలుగు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి (ఏఎస్‌డబ్ల్యూవో) పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇటీవల దళిత అభివృద్ధి శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం ఆ శాఖలో పాలనాపరమైన ఇబ్బందులు రాకుండా ఈ నాలుగు పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసుకునేందుకు అనుమతినిస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రొనాల్డ్ రోస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భర్తీ ప్రక్రియను టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తుందని, నిబంధనలకు అనుగుణంగా దళిత అభివృద్ధి శాఖ టీఎస్‌పీఎస్సీకి సమాచారం ఇవ్వాలని, తద్వారా టీఎస్‌పీఎస్సీ ఈ పోస్టులను భర్తీ చేస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడించారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌టీఎస్ఈ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్ష (ఎన్‌టీఎస్ఈ) ఫలితాలను గురువారం ప్రకటించారు. గత నవంబర్ 3న జరిగిన ఎన్‌టీఎస్ఈ సెకండ్ లెవల్ (నేషనల్ లెవల్/స్టేట్-2) పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థుల వివరాలను http//bse.telangana.gov.inలో ఉంచినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఎ.సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా మే 10న జరగనున్న నేషనల్ లెవల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌కు (ఎన్‌టీఎస్ స్టేట్-2 పరీక్ష) సంబంధించిన హాల్‌టికెట్లు, ప్రవేశ పత్రాలను http://www.ncert.nic.in నుంచి ఏప్రిల్ నెలలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఎన్‌టీఎస్ఈ ఫలితాల్లో శ్రీచైతన్య హవా..

హైదరాబాద్: 2019-20 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌టీఎస్ఈ స్టేజ్-1 పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు టాప్ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. పరీక్షలో అన్ని కేటగిరీల్లో రాష్ట్రవ్యాప్తంగా టాప్-10లో 139 ర్యాంకులను ప్రకటించగా.. 58 ర్యాంకులను శ్రీచైతన్య విద్యార్థులు దక్కించుకున్నారు. తమ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులకు మొదటి ర్యాంకు వచ్చిందని శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణ నుంచి ఎంపికైన 233 మంది విద్యార్థుల్లో శ్రీచైతన్యకు చెందిన వారే అత్యధికంగా 88 మంది ఉన్నారని తెలిపారు. గత తొమ్మిదేళ్లుగా శ్రీచైతన్య స్కూల్ ఎన్‌టీఎస్ఈ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ రాష్ట్రంలో నంబర్-1గా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇలాంటి అనితర విజయాలకు కారణమైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ బి.ఎస్.రావు అభినందనలు తెలిపారు.

ఐటీ క్లస్టర్ల అభివృద్ధికి సరికొత్త పాలసీ

నెల రోజుల్లో పాలసీ విధి విధానాలు ఖరారు
హైదరాబాద్‌లో అన్ని ప్రాంతాల్లో ఐటీ క్లస్టర్లు
ఆరు చోట్ల ఐటీ క్లస్టర్ల ఏర్పాటుకు స్థల సేకరణ

సాక్షి, హైదరాబాద్: ఐటీ సేవల రంగంతో పాటు ఎమర్జింగ్ టెక్నాలజీ రంగం కూడా హైదరాబాద్‌లో శరవేగంగా అభివృద్ధి చెందుతుండటంతో ఐటీ దిగ్గజ కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. మరోవైపు స్టార్టప్ కంపెనీలు కూడా తమ కార్యకలాపాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను వెతుకుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ రంగాన్ని హైదరాబాద్‌లోని ఏదో ఒక ప్రాంతానికి పరిమితం చేయకుండా కొత్త ఐటీ క్లస్టర్లను అభివృద్ధి చేయడం ద్వారా నగరం నలుమూలలా విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు వివిధ ప్రాంతాల్లో ఐటీ కంపెనీల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న సంస్థలకు భూములు, కార్యాలయాల కేటాయింపునకు సంబంధించి పాలసీని రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాలసీ విధి విధానాలను నెల రోజుల్లోగా ఖరారు చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌ను సంబంధిత శాఖ మంత్రి కె.తారకరామారావు బుధవారం జరిగిన సమీక్షలో ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే పాలసీ విధి విధానాలను ఖరారు చేసి వీలైనంత త్వరగా కేబినెట్ ఆమోదానికి పంపించేందుకు ఐటీ శాఖ సన్నద్ధమవుతోంది.



పశ్చిమంలోనే ఐటీ కేంద్రీకృతం..

హైదరాబాద్‌లో ఐటీ రంగం ప్రస్తుతం నగరం పశ్చిమ ప్రాంతంలోని మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, కోకాపేట వంటి ప్రాంతాల్లో ప్రధానంగా కేంద్రీకృతమైంది. దీంతో ఆ ప్రాంతంలో కార్యాలయాల నిర్మాణం, అద్దె తదితరాలు ఐటీ కంపెనీలకు భారంగా మారింది. ఈ నేపథ్యంలోనే తమ కార్యకలాపాల కోసం వేరే ప్రాంతాల్లో స్థలం కేటాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కంపెనీలు కోరుతున్నాయి. బుద్వేల్‌లో 200 ఎకరాల్లో ఐటీ క్లస్టర్‌ను అభివృద్ధి చేసేందుకు ఐటీ శాఖ సన్నాహాలు చేస్తుండగా, మౌలిక వసతుల కల్పన కోసం టీఎస్ఐఐసీకి భూమిని అప్పగించాల్సి ఉంది. ఐటీ కంపెనీల ఏర్పాటు కోసం ఉప్పల్ పరిసరాల్లో స్థలం కేటాయించాల్సిందిగా పలు సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ఉప్పల్ పరిసరాల్లో తగినంత భూమి లేకపోవడంతో భూ సేకరణ జరపాల్సిందిగా మంత్రి కేటీఆర్ ఆదేశించారు. గతంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి పొందిన స్థలాన్ని కొందరు ఇతరుల కు విక్రయించారు. ఇలాంటి స్థలాల్లో ఐటీ కార్యాలయాల నిర్మాణానికి అనుమతులు కోరు తూ ప్రభుత్వానికి వినతులు అందుతున్నాయి. ఐటీ సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి కొత్త పాలసీ అమల్లోకి వస్తేనే ఇది సాధ్యమవుతుందని టీఎస్ఐఐసీ వర్గాలు చెప్తున్నాయి.

మరో ఆరు చోట్ల ఐటీ క్లస్టర్లు

ప్రస్తుతం హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోనే ఐటీ సంస్థలు కేంద్రీకృతం కావడంతో నగరానికి అన్ని దిశలా మరో ఆరు ఐటీ క్లస్టర్లు అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. నైరుతి దిశలో రాజేంద్రనగర్, బుద్వేల్, కిష్టాపూర్ ప్రాంతం, ఉత్తర దిశలో కొంపల్లి, బాచుపల్లి, భౌరంపేట, వాయవ్య దిశలో కొల్లూరు, ఉస్మాన్‌నగర్, తెల్లాపూర్ ప్రాంతాల్లో ఐటీ క్లస్టర్లు అభివృద్ధి చేస్తారు. దక్షిణాన ఆదిభట్ల, శంషాబాద్, జీఎంఆర్ ఎయిరోసిటీ, తూర్పున ఉప్పల్, పోచారంతో పాటు నగరం నడిబొడ్డున బేగంపేట, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల్లో నూతన ఐటీ క్లస్టర్ల అభివృద్ధిని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. నూతన ఐటీ క్లస్టర్ల అభివృద్ధికి అవసరమైన స్థల సేకరణ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని మంత్రి కేటీఆర్ ఐటీ, పరిశ్రమల శాఖ అధికారులకు తాజాగా ఆదేశాలు జారీ చేశారు.

మూడు రోజులు పొడి వాతావరణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రధానంగా ఈశాన్య దిశ నుంచి గాలులు వీస్తుండటంతో వచ్చే మూడు రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక గత 24 గంటల్లో నల్లగొండలో సాధారణం కంటే 4 డిగ్రీలు తక్కువగా 16 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రామగుండంలో సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా 15 డిగ్రీలు, హన్మకొండలో సాధారణం కంటే మూడు డిగ్రీలు తక్కువగా 16 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత రికార్డు అయింది.

కార్ల్ జూన్‌కు జినోమ్ వ్యాలీ అవార్డు

- ప్రకటించిన బయో ఆసియా
- నోవార్టిస్ సీఈవో వాస్ నరసింహన్‌కు కూడా..

సాక్షి, హైదరాబాద్: కేన్సర్ మహమ్మారికి వినూత్నమైన చికిత్సను అందుబాటులోకి తెచ్చిన అమెరికా శాస్త్రవేత్త డాక్టర్ కార్ల్ హెచ్.జూన్, ప్రజారోగ్య రంగంలో విశేష కృషి చేసిన అంతర్జాతీయ ఫార్మా కంపెనీ నోవార్టిస్ సీఈవో డాక్టర్ వాస్ నరసింహన్‌లకు ఈ ఏడాది జినోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డులు అందించనున్నట్లు బయో ఆసియా నిర్వాహకులు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ఏటా నిర్వహించే బయో ఆసియా ఇప్పటికే ఆసియా మొత్తానికి అతిపెద్ద జీవశాస్త్ర సంబంధిత వేదికగా పరిణమించిన సంగతి తెలిసిందే. ఫార్మా రంగంతోపాటు, ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాలను విస్తృతంగా చర్చించే బయో ఆసియా ఆయా రంగాల్లో విశిష్టమైన కృషి చేసిన వారికి జినోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డులు అందిస్తోంది. ఈ ఏడాది బయో ఆసియా సమావేశం ఫిబ్రవరి 17 నుంచి మూడ్రోజులపాటు జరగనుంది. ఈ నేపథ్యంలో కార్ల్ హెచ్.జూన్‌కు జినోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డు ఇస్తున్నట్లు బయో ఆసియా నిర్వాహకులు దీంతోపాటు ఫార్మా రంగంలో డిజిటల్ విప్లవం తీసుకురావడం ద్వారా ఆరోగ్య రంగంలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టిన వాస్ నరసింహన్‌లకు బయో ఆసియా తొలిరోజున అవార్డులు అందిస్తామని వివరించింది.

ఇమ్యూనోథెరపీ ద్వారా..

కేన్సర్ వ్యాధికి ప్రస్తుతం మూడు చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి శస్త్రచికిత్స, రెండు రేడియో థెరపీ, మూడు కీమో థెరపీ. అయితే ఈ మూడింటితోనూ చాలా సమస్యలు ఉన్నాయి. కీమో, రేడియో థెరపీలతో జుట్టు ఊడిపోవడం మొదలుకొని ఆరోగ్యకరమైన కణాలూ నాశనమై అనేక ఇతర దుష్ప్రభావాలు చూపుతాయన్నది మనకు తెలిసిందే. కేన్సర్ కణాలు రోగ నిరోధక శక్తి కణాలను దృష్టిని తప్పించుకోవడం ద్వారా శరీరమంతా వ్యాపిస్తుంటాయి. అయితే కార్ల్ హెచ్.జూన్ ఈ రోగ నిరోధక వ్యవస్థ కణాల్లో (టి-సెల్స్) కొన్ని మార్పులు చేయడం ద్వారా అవి కేన్సర్ కణాలను గుర్తించి మట్టుబెట్టేలా చేయగలిగారు. కచ్చితంగా చెప్పాలంటే టి-సెల్స్ ఉపరితలానికి కైమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్లను అనుసంధానిస్తారు. ఫలితంగా ఇవి కేన్సర్ కణాలను గుర్తించే శక్తిని పొందుతాయన్నమాట. దీన్నే ఇమ్యూనోథెరపీ అని పిలుస్తారు. ఇటీవలి కాలంలో అందుబాటులోకి వచ్చిన మెరుగైన కేన్సర్ చికిత్స ఇది. కార్ల్ జూన్ పరిశోధనల ఆధారంగా అభివృద్ధి చెందిన టిసాజెన్‌లిక్లుయి అనే ఎఫ్‌డీఏ ఆమోదిత జన్యు చికిత్స అందుబాటులోకి వచ్చింది.

ఉపాధ్యాయ రిజర్వేషన్లపై సుప్రీం తీర్పు రిజర్వ్

సాక్షి, న్యూఢిల్లీ: షెడ్యూలు ప్రాంతాల్లో రిజర్వేషన్లు వంద శాతం ఉండటంపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. షెడ్యూలు ఏరియాలో ఎస్టీలకు నూరు శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి వీలుగా ఉమ్మడి ఏపీలో చాలా కాలం క్రితం ఇచ్చిన జీవోను సమర్థిస్తూ ఉమ్మడి హైకోర్టు 2001లో తీర్పు ఇచ్చింది. వీటిని సవాలు చేస్తూ చేబ్రోలు లీలాప్రసాదరావు తదితరులు 2002లో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గత మూడు రోజులుగా విచారించింది. జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ వినీత్ శరణ్, జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌ల ధర్మాసనం ఇరు పక్షాల వాదనలు విని. ఏపీ, తెలంగాణ ప్రభుత్వం షెడ్యూలు ఏరియాలో నూరు శాతం రిజర్వేషన్లకు సమర్థనగా వాదనలు వినిపించాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.